


న్యూస్-9
సామాజిక అవసరం...సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక
news9telengana@gmail.com www.news9-india.com




సంపుటి : 19 | సంచిక : 94 వెల : 4 బుధవారం 19 మార్చి 2025 www.news9-india.com హైదరాబాద్ | విశాఖపట్నం పేజీలు : 12

## హైకోర్టును తప్పుదోవ పట్టించిన పిటిషనర్‌కు కోటి జరిమానా



/హైదరాబాద్,మార్చి18: తెలంగాణ హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక సంచలన తీర్పు వెల్లడించారు. హైకోర్టును తప్పుదోవ పట్టించిన పిటిషనర్‌కు రూ.కోటి జరిమానా విధిస్తూ సంచలన తీర్పునిచ్చారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన మిగతా 2లో...

## డికె అరుణ ఇంట్లో చొరబడ్డ వ్యక్తి అరెస్ట్


2లో

## తాగునీటి సరఫరాలో సంక్షోభం లేదు

### - శాసనమండలిలో మంత్రి సీతక్క వెల్లడి



/హైదరాబాద్, మార్చి 18: ప్రస్తు తం తాగునీటి సరఫరాలో ఎలాంటి సంక్షోభం లేదని మంత్రి సీతక్క తెలిపారు. నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడితే ప్రత్యామ్నాయం ఏర్పా ట్లు చేశామని స్పష్టం చేశారు. మంగళవారం శాసన మండలిలో ఆమె మాట్లాడారు. భూగర్భ జలవనరులను కూడా సిద్ధంగా ఉంచామని, నీటి సరఫరాను అనునిత్యం పరిశీలిస్తున్నామని, నీటి సమస్యలపై ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ కూడా ఏర్పాటు- చేశామని వివరించారు. మిగతా 2లో...

## సునీత విజయాల పట్ల భారత్ గర్విస్తోంది



- నీవు క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటున్నాం
- భారత్‌లో పర్యటించాలని ఆకాంక్షిస్తున్నాం
- సునీతా విలియమ్స్‌కు మోడీ లేఖ

న్యూఢిల్లీ, మార్చి 18: భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ కొన్ని నెలల ఎదురుచూపుల తర్వాత పుడమికి తిరిగి వస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్పందించారు. మిమ్మల్ని భారత్‌లో చూసేందుకు ఎదురుచూస్తున్నాం అని సునీతకు లేఖ రాశారు. ఆమె సురక్షితంగా భూమిపైకి తిరిగిరావాలని, ఆరోగ్యంగా ఉండాలని మోదీ ఆకాంక్షించారు. సునీత సాధించిన విజయాల పట్ల 140 కోట్లమంది భారతీయులు గర్వంగా ఉన్నారని పేర్కొన్నారు. యూఎస్ పర్యటనకు వెళ్లినప్పుడు.. మీ గురించి అడిగి తెలుసుకున్నాను. మీరు వేలాది కి.మీ.దూరంలో ఉన్నప్పటికీ.. మా హృదయాలకు దగ్గరగా ఉన్నారు. మీ అంతరిక్షయాత్ర విజయం సాధించాలని మేమంతా కోరుకుంటున్నాం. మీరు తిరిగి వచ్చిన తర్వాత మిమ్మల్ని భారత్‌లో చూసేందుకు ఎదురుచూస్తున్నాం. తన కుమార్తెలకు ఆతిథ్యం ఇవ్వడం పట్ల భారత్ సంతోషంగా ఉంటుందని మోదీ తన లేఖలో పేర్కొన్నారు. మార్చి ఒకటిన రాసిన లేఖను కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఎక్స్ వేదికగా పోస్టు మిగతా 2లో...

## ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధానం

### అధికారులతో కేంద్ర ఎన్నికల సంఘం కీలక భేటీ



న్యూఢిల్లీ,మార్చి18: ఓటరు జాబితాల తయారీలో అక్రమాలు జరిగాయంటూ విపక్షాలు తీవ్రస్థాయితో విమర్శిస్తున్న వేళ కేంద్ర ఎన్నికల సంఘం కీలక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆధార్‌తో ఓటరు కార్డు అనుసంధానంపై కీలక ప్రకటన చేసింది. ఆర్టికల్ 326, ప్రజాప్రాతినిధ్య చట్టం-1950, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే ఈ అనుసంధాన ప్రక్రియ చేపట్టనున్నట్లు- తెలిపింది. ఇందు కోసం యూనిక్ ఐడెంటి ఫికేష న్ మిగతా 2లో...



## ఫోర్త్ సిటీ కాదు.. ఫోర్ బ్రదర్స్ సిటీ

### - శంభీపూర్ వ్యాఖ్యలపై మండిపడ్డ శ్రీధర్ బాబు

/హైదరాబాద్, మార్చి 18: బిఆర్ఎస్ ఎంఎల్‌సి శంబిపూర్ రాజు, మంత్రి శ్రీధర్ బాబు మధ్య మాటల యుద్ధం నెలకొంది. శాసన మండలిలో ఎంఎల్‌సి శంబిపూర్ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం కడుతోంది ఫోర్త్ సిటీ కాదు అని, ఫోర్ బ్రదర్స్ సిటీ- అని శంభీపూర్ రాజు అనడంతో శ్రీధర్ బాబు ఊగిపోయారు. సభలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని బాబు మిగతా 2లో...

## పదేళ్లుగా దేవాదుల నిర్లక్ష్యం

- చర్చల లేని రోజే కెసిఆర్ వచ్చి వెళతారు
- మామూలు రోజుల్లో సభను ఎదుర్కొనే ధైర్యం లేదు
- దేవాదుల పంపులను ప్రారంభించిన మంత్రులు



/వరంగల్,మార్చి18: గత పదేళ్లు దేవాదులను నిర్లక్ష్యం చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. వైఎస్సార్ ఉన్నప్పుడే దేవాదుల ఫేజ్ 1 పూర్తయిందన్నారు. మూడో ఫేజ్ పనులను పూర్తి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దేవాదుల పంప్ హౌస్ ఫేజ్ 3 లో భాగంగా నిర్మించిన మోటార్లను మంత్రులు ఉత్తమ్, పొంగులేటి ఆన్ చేశారు. ఒక మోటార్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన పొంగులేటి.. మిగతా 2లో...

## కమీషన్ల మీదనే కాంగ్రెస్ దృష్టి

- హైడ్రా పేరుతో వసూళ్ల దందా
- పేదల ప్రతాపాలు.. పెద్దలతో ఒప్పందాలు : మాజీమంత్రి కేటీఆర్



/హైదరాబాద్, మార్చి 18: అక్రమ వసూళ్ల కోసమే కాంగ్రెస్ పార్టీ హైడ్రాను తీసుకొచ్చిందని మాజీమంత్రి కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను గాలికి వదిలేసి.. కమీషన్లు ఎక్కడ వస్తాయో అక్కడ దృష్టి పెట్టిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. హైడ్రా పేరుతో వసూళ్ల దందా.. మూసీ పేరుతో పేదల ఇండ్లపై పగబట్టిందని విరుచుకుపడ్డారు కేటీఆర్. ఫార్మాసిటీ పేరుతో భూముల చెర.. మిగతా 2లో...



## ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

- ఆది నుంచి దళితులకు అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ
- దళితులను ముందువరసలో నిలిపింది కాంగ్రెస్ పార్టీయే
- ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 18: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దళితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటోందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పార్టీలో, ప్రభుత్వంలో ఎస్సీలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. బాబూ జగ్జీవన్‌రామ్‌కు కేంద్రంలో వివిధ శాఖల బాధ్యతలు అప్పగించి గౌరవించింది. దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వ్యక్తి దామోదరం సంజీవయ్యను సీఎంగా చేసింది కాంగ్రెస్ పార్టీ. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరిగింది. దశాబ్దాలుగా సాగిన పోరాటంలో ఎంతో మంది ప్రాణాలు అర్పించారు. 2004లో ఉషా మెహ్రా కమిటీ- వేసి సమస్య పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రయత్నించింది. ఇన్నాళ్లకు నేను సీఎంగా ఉండగానే సమస్య పరిష్కారం కావటం మిగతా 2లో...

## చిన్నచిన్న కేసుల్లో బెయిల్ నిరాకరణలు

### - ట్రయల్ కోర్టుల తీరుపై సుప్రీం అసహనం - ప్రజాస్వామ్యంలో పోలీస్ రాజ్యం కారాదని వ్యాఖ్య



న్యూఢిల్లీ, మార్చి 18: ట్రయిల్ కోర్టుల తీరుపై సుప్రీంకోర్టు అస హనం వ్యక్తంచేసింది. చాలా సాధారణ కేసు ల్లో దర్యాప్తు పూర్తయినప్పటికీ బెయిల్ పిటిషన్లను తిరస్కరించడాన్ని అత్యున్నత న్యాయ స్థానం తప్పు బట్టింది. మిగతా 2లో...

## నేడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి

అంతకు ముందే కేబినెట్‌లో చర్చించి ఆమోదం


2లో

న్యూస్-9
సామాజిక అవసరం...సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక
www.news9-india.com
news9.india News9India_ news9telugudaily

# నేడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి

## - అంతకు ముందే కేబినేట్‌లో చర్చించి ఆమోదం



/హైదరాబాద్, మార్చి 18: తెలంగాణలోని కాంగ్రెస్.. 2025-26 ఆర్థిక సంవత్స రానికి సంబంధించిన బడ్జెట్‌ను బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టనుంది. రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో బుధవారం ఉదయం 11.14 గంటలకు ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్‌ను ముందుగా కేబినేట్ ఆమోదించాల్సి ఉంటుంది. దీంతో ఉదయం 9.30 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం కానుంది. అసెంబ్లీ కమిటీ హాలులో మంత్రివర్గ సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలుపనుంది. అనంతరం బడ్జెట్ కాపీలతో భట్టి విక్రమార్క అసెంబ్లీకి చేరుకోనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది రెండో బడ్జెట్ కావడం విశేషం. బడ్జెట్‌లో ఎలాంటి నిర్ణయాలు ఉండబోతున్నాయని రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఏ పథకానికి ఏ మేరకు కేటాయింపులు ఇవ్వబోతున్నదనేది ఆసక్తిగా మారింది. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు, రాష్ట్రంలోని ప్రాజెక్టుల విషయంలో కీలక ప్రకటనలు ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ఓటరు కార్డుతో ఆధార్ అనుంధానం

(మొదటి పేజీ తరువాయి)

నిపుణుల మధ్య త్వరలోనే చర్చలు ప్రారంభం అవుతాయని ఓ ప్రకటనలో పేర్కొంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బిర్ సింగ్ సందు, వివేక్ జోషీలు మంగళవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి, లెజిస్లేచర్ కార్యదర్శి, ఎలక్ట్రానిక్స్, ఐటీ- శాఖ కార్యదర్శి, యూఐడీఏఐ సీఈవోతో పాటు- ఈసీ సాంకేతిక నిపుణులతో సమావేశమై చర్చించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం.. భారతీయ పౌరులకు మాత్రమే ఓటు- హక్కు ఉంటు-ంది. అయితే, ఆధార్ కేవలం వ్యక్తి గుర్తింపును మాత్రమే నిర్ధారించగలిగే పత్రం. అందువల్ల ఓటర్ల గుర్తింపు కార్డు (ఊఒఈ)ని ఆధార్‌తో అనుసంధానించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్లు 23(4), 23(5), 23(6) నిబంధనలు, 2023లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా చేయాలని ఈ భేటీ-లో నిర్ణయించారు. ఇందులో భాగంగా యూఐడీఏ, ఈసీ -టె- క్నికల్ నిపుణుల మధ్య చర్చలు త్వరలోనే ప్రారంభం కానున్నాయని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది.

# ఫోర్త్ సిటీ కాదు..ఫోర్ బ్రదర్స్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

హితువు పలికారు. శాసన సభలో ఇంతకంటే దారుణంగా మాట్లాడుతున్నారని శంబిపూర్ వివరణ ఇచ్చారు. వేరే సభ విషయాలు ఈ సభలో అనవసరమని ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అనడంతో ఈ అంశం సద్దుమణిగింది.

# హైకోర్టును తప్పుదోవ పట్టించిన పిటిషనర్‌కు కోటి జరిమానా

(మొదటి పేజీ తరువాయి)

ఒకటి హైకోర్టు వద్ద పెండింగ్‌లో ఉంది. అయితే ఆ విషయాన్ని దాచిన పిటిషనర్ మరో బెంచ్ వద్ద కొత్త పిటిషన్ వేసి ఆర్డర్ తీసుకున్నాడు. ఈ విషయం ధర్మాసనం దృష్టికి రావడంతో జస్టిస్ నగేశ్ ఆగ్రహించారు. ఉన్నత న్యాయస్థానాన్నే తప్పుదోవ పట్టించడంపై మండిపడ్డారు. ఓ పిటిషన్ పెండింగ్‌లో ఉండగా మరో బెంచ్ వద్ద రిట్ పిటిషన్ ఎలా వేస్తారంటూ ధ్వజమెత్తారు. ఈ మేరకు పిటిషనర్‌కు రూ.కోటి జరిమానా విధించారు. కాగా, ప్రభుత్వ భూముల కబ్జాకు పాల్పడే వారికి ఈ తీర్పు ఓ చెంప పెట్టు లాంటిదని పలువురు చర్చించుకుంటున్నారు. మరోవైపు జస్టిస్ నగేశ్ ఇచ్చిన తీర్పు ఇప్పుడు సంచలనంగా మారింది.

# ట్రిపుల్ ఆర్‌తో హైదరాబాద్‌కు మహర్దశ

## - రోడ్ల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెల్లడి

హైదరాబాద్, మార్చి 18: ఆర్ఆర్ఆర్ దక్షిణభాగం అలైన్ మెంట్ చేసి కేంద్రానికి పంపుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఆర్ఆర్ఆర్ గురించి కేంద్రమంత్రి గడ్కరీతో పలుమార్లు చర్చలు జరిపామని అన్నారు. ఆర్ఆర్ఆర్ పూర్తయితే హైదరాబాద్ రూపురేఖలు మారిపోతాయని చెప్పారు. వాళ్ల మాదిరిగా తమకు రోడ్లు అమ్ముకునే అలవాటు లేదని బిఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. భూసేకరణకు సంబంధిoచి సహకరించాలని కోరుతున్నానని వెల్లడించారు. భూములకు మార్కెట్ ధర ప్రకారం చెల్లింపులు చేస్తామన్నారు. అధికారులపై

# ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

సంతోషకరం. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన గంటలోపే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం ప్రకటించాం. వెంటనే ఉత్తమ్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం నియమించాం. మంత్రివర్గ ఉపసంఘం సూచన మేరకు షమీమ్ అక్తర్ కమిషన్ నియమించాం. కమిషన్.. ప్రజల నుంచి 8,681 ప్రతిపాదనలు స్వీకరించింది. కమిషన్ నివేదికను ఏ మాత్రం మార్చకుండా ఆమోదించాం. 59 ఎస్సీ ఉప కులాలను 3 గ్రూపులుగా కమిషన్ విభజించింది. 59 కులాలు ఇప్పటివరకు పొందిన ప్రయోజనాల ఆధారంగా కమిషన్ సిఫార్సులు చేసిందని సీఎం వివరించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాలుగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ పోరాటానికి గొప్ప విజయం లభించింది. ఇక, ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ' స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి కాంగ్రెస్ పార్టీ దళితులకు అండగా ఉంటోంది. దశాబ్ధాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరుగుతోంది. ఎంతో మంది ప్రాణాలు అర్పించారు. బిల్లును ఎకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు నా కృతజ్ఞతలు. నేను ముఖ్యమంత్రిగా ఉండగానే సమస్య పరిష్కారం కావటం సంతోషం' అని అన్నారు. బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో.. ఎస్సీ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ షమీమ్ అక్తర్ ఏక సభ్య కమిషన్ సిఫార్సు చేసిన ప్రకారమే 3 గ్రూపులతో ఎస్సీ వర్గీకరణ బిల్లును రూపొందించింది. ఎస్సీల్లో అత్యంత వెనుకబడిన 15 కులాలను గ్రూప్ 1లో చేర్చారు. మొత్తం జనాభాలో వీరి జనాభా 3.288గా ఉంది. వీరికి 1 శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు. మధ్యస్థంగా లబ్ధిపొందిన 18 కులాలను గ్రూప్ 2లో చేర్చారు. వీరి జనాభా 62.748గా ఉంది. వీరికి 9శాతం రిజర్వేషన్ కల్పించారు. కాస్త మెరుగైన ప్రయోజనాలు పొందిన 26 కులాలను గ్రూప్ 3లో వేశారు. వీరి జనాభా 33.963గా ఉంది. వీరికి 5 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఏ,బీ,సీ,డీ, కేటగిరీలుగా ఎస్సీ వర్గీకరణను చేసే అవకాశం లేదని కమిషన్ స్పష్టం చేసింది. ప్రభుత్వం.. కమిషన్ సిపార్సుతో పాటు- ఎపిరికల్ డేటాను దృష్టిలో పెట్టు-కుని న్యాయపర చిక్కులు రాకుండా ఉండేలా బిల్లును సిద్ధం చేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ జనాభా 1,38,78,078. వీరిలో మాదిగలు 67,02,609 ఉండగా.. మాలలు 55,70,244 మంది ఉన్నారు. ఈ లెక్కల ప్రకారం మాలల జనాభా కంటే మాదిగల జనాభా 11.3 లక్షలు ఎక్కువ. ఎస్సీల్లో కేవలం ఈ రెండు కులాల జనాభానే 80 శాతం వరకు ఉంటు-ందని ఓ అంచనా. అందరికీ కలిపి 15 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. ఈ మొత్తం కోటాలో మాలలే ఎక్కువ లాభం పొందుతున్నారనే గొడవ దశాబ్దాల క్రితమే మొదలైంది. 1972 నుంచి మాదిగ వర్గానికి చెందిన నేతలు ముఖ్యమంత్రుల్ని కలుస్తూ వినతి పత్రాలు ఇస్తూ వచ్చారు. మంద క్రిష్ణ మాదిగ కూడా దీనిపై ఎప్పటినుంచో మాట్లాడుతున్నారు..'

# కమీషన్ల మీదనే కాంగ్రెస్ దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. ట్రిపుల్ ఆర్ పేరుతో పేదల భూముల ఆక్రమించుకుంటుందన్నారు. పేదలపై ప్రతాపం చూపిస్తూ.. పెద్దలతో ఒప్పందాలు కుదుర్చుకుంటుందన్నారు. నాడు మద్యం వద్దని చెప్పిన రేవంత్ రెడ్డి.. నేడు మద్యం ముద్దు అంటున్నారని పేర్కొన్నారు. ధరల సవరణ పేరుతో, కొత్త బ్రాండ్ల పేరుతో అక్రమ ఒప్పందాలు చేసుకుంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలు గాలికి వదిలేసి.. వాటిపై ప్రశ్నించిన వారిని జైలుకు పంపిస్తున్నారని తెలిపారు. రైతుభరోసా రాదు.. రుణమాఫీ కాదు.. పంటలు కొనుగోలు చేయరు.. రూ.500 క్వింటాలు ధాన్యానికి బోనస్ బోగస్ అయింది.. తులం బంగారం ఇయ్యరు.. ఉద్యోగాలు వేయరు.. ఉద్యోగులకు పీఆర్సీ రాదు, డీఏలు ఇవ్వరు అని కేటీఆర్ మండిపడ్డారు. సత్యం వధ.. ధర్మం చెర బట్టిందన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో దేశానికే దిక్సూచిగా ఎదిగిన తెలంగాణను.. 15 నెలల కాంగ్రెస్ పాలనలో అథం పాతాళానికి తీసుకెళ్లారు. ఆర్థికశక్తిగా ఎదిగిన తెలంగాణను ఆగం చేసి బీద అరుపులు అరుస్తున్నారు. ఇది పాలన కాదు పీడన.. ఇది సర్కారు కాదు సర్కస్ కంపెనీ అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. **కాంగ్రెస్ పాలనలో రైతన్నలను వెంటాడుతున్న కష్టాలు..** కాంగ్రెస్ పాలనలో రైతన్నలను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయని మాజీమంత్రి కేటీఆర్ అన్నారు. సాగుకు సరిపడా విద్యుత్, నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రైతు రుణమాఫీ కాక, రైతు భరోసా నిధులు విడుదల కాకపోవడంతో అన్నదాతలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. ఈ పరిస్థితులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ముంచుకొస్తున్న ముప్పును ముందే హెచ్చరించినా.. ఈ తెలివిలేని కాంగ్రెస్ సర్కారు తలకెక్కలేదు అని కేటీఆర్ విమర్శించారు. కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టొద్దని మొత్తుకున్నా విషం తప్ప విషయం లేని ముఖ్యమంత్రి వినిపించుకోలేదు. కళ్ల ముందే పచ్చని పంటలు ఎండుతున్నాయని వ్యవసాయ శాఖ సమర్పించిన ప్రాథమిక నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని కేటీఆర్ పేర్కొన్నారు. ఓవైపు రుణమాఫీ కాక, పెట్టుబడి సాయం రాక అన్నదాత అల్లాడుతున్న సమయంలో గోరి చుట్టు మీద రోకలి పోటులా పంటలు ఎండటంతో రైతు బతుకు ఆగమైంది. ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ కక్షగట్టి తెచ్చిన కరువు కాబట్టి రైతులను ఆదుకునే పూర్తి బాధ్యత ముఖ్యమంత్రిదే. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కూడా జరుగుతున్న ఎండిన ప్రతి ఎకరానికి వెంటనే రూ.25 వేల నష్ట పరిహారం ప్రకటించి వెంటనే చెల్లించాలి. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోవాలని చూస్తే రైతులతో కలిసి కాంగ్రెస్ సర్కారు భరతం పడతాం అని కేటీఆర్ హెచ్చరించారు. జై కిసాన్.. జై తెలంగాణ.. అని కేటీఆర్ నినదించారు.

# రిజర్వేషన్ల పోరాటానికి ముందుండి నాయకత్వం వహిస్తా...

## ● తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి



/హైదరాబాద్, మార్చి 18: బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు జరిగే పోరాటానికి ముందుండి నాయకత్వం వహిస్తానని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా, నిబద్ధతతో నిర్వహించిన కుల సర్వేను తప్పుబడితే బీసీలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని విడమరిచి చెప్పారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లును శాసనసభ ఆమోదించిన నేపథ్యంలో రాష్ట్రంలోని ఆయా బీసీ సంఘాలు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. 2026లో జరిపే జన గణనలో కులగణన చేర్చాలని శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాం. మనం అందరం కలిసి కొట్లాడితే కుల గణనను ఎందుకు చేర్చరు. కొట్లాడితే తెలంగాణ రాలేదా? కొట్లాడితే దేశానికి స్వతంత్రం రాలేదా? కొట్లాడితే జన గణనలో కుల గణన ఎందుకు చేర్చరు. జన గణనలో ఒకసారి కులగణన చేర్చితే ఆ తర్వాత ప్రతి పదేళ్లకోసారి మరింత స్పష్టత వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కులగణన చరిత్రలో ఒక మైలు రాయిగా నిలుస్తుంది. ఈ ప్రక్రియలో భాగస్వాములం కావడం మాకు గర్వకారణంగా ఉంది. దీన్ని తప్పుబడితే బీసీలకు తీవ్ర నష్టం జరుగుతుంది. బలహీన వర్గాలు తమ హక్కుల సాధన కోసం చేసే పోరాటానికి పూర్తి మద్దతుగా నిలబడుతా. ఈ సర్వే పునాది లాంటిది. పునాదిలోనే అడ్డుపడితే మీకు మీరే అన్యాయం చేసుకున్న వారవుతారు. ముందు అమలు చేసుకుని తర్వాత అవసరాన్ని బట్టి సవరణలు చేసుకోవచ్చు. ఈ కుల గణన అందరికీ భగవద్గీత, బైబిల్, ఖురాన్ లాంటిది. కులం ముసుగులో రాజకీయంగా ఎదగాలని భావించే వారి ఉచ్చులో పడొద్దని హితవు చెప్పారు.

# తాగునీటి సరఫరాలో సంక్షోభం లేదు

(మొదటి పేజీ తరువాయి)

తాగునీటి కోసం రిజర్వాయర్ల నుంచి నీటిని సరఫరా చేస్తామని, నీటి సరఫరా అవసరాలకు 2024 జనవరి నుంచి ఇప్పటివరకు రూ.298 కోట్లు- మంజూరు చేశామన్నారు. 34 భారీ తాగునీటి సరఫరా పథకాల కోసం రూ.745 కోట్లు- కేటాయించామని, గ్రామాల్లో నీటి అవసరాల కోసం రూ.175 కోట్లతో ప్రతిపాదనలు పంపామని సీతక్క ప్రకటించారు.

# సునీత విజయాల పట్ల భారత్ గర్విస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఈ లేఖ పట్ల సునీత సంతోషం వ్యక్తంచేశారు. దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. సునీతా విలియమ్స్, వ్యోమగామి బుచ్ విల్మోర్, మరో ఇద్దరు ఆస్ట్రోనాట్‌లతో కలిసి వారు భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 3.27 గంటలకు పుడమికి చేరుకుంటారని అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ప్రకటించిన విషయం తెలిసిందే. 2024 జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌కు చేరుకున్నారు. వారం రోజులకే తిరిగి భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే, స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వ్యోమగాములు లేకుండానే అది భూమికి తిరిగొచ్చింది. నాటినుంచి సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌లోనే చిక్కుకుపోయారు. ఎట్టకేలకు వీరిరువురు తిరిగి భూమికి వస్తున్నారు. బుధవారం తెల్లావరుజామున వీళ్లు భూమ్మీదకు రానున్నారు. ఆమె ఆరోగ్యం బాగుండాలని దేశ ప్రజలు ప్రార్థిస్తున్నారని అన్నారు. తను అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు ట్రంప్‌ని కలిసినా.. లేదా బైడన్‌ని కలిసినా.. ఆమె ఆరోగ్యం గురించి విచారించినట్లు పేర్కొన్నారు. 140 కోట్ల భారతీయులు ఆమె సాధించిన ఘనతకు గర్వపడుతున్నారని తెలిపారు. ఆమె భర్త మైఖెల్ విలియమ్స్‌కి సునీతతో పాటు బుచ్ విల్‌మోర్‌కి కూడా ఆయన బెస్ట్ విషెస్ తెలియజేశారు.

# పదేళ్లుగా దేవాదుల నిర్లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)


గత ప్రభుత్వం కమిషన్ల కోసమే తాపత్రయపడింది కానీ.. ప్రాజెక్టును పట్టించుకోలేద న్నారు. సాగునీటి సమస్యకు గత ప్రభుత్వమే కారణమని విమర్శించారు. మిషన్ భగీరథ పేరుతో 39 వేల కోట్లు- ఖర్చు చేసినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. సమాధానం చెప్పాల్సి ఉంటది కాబట్టే కేసీఆర్ అసెంబ్లీకి రావట్లేదన్నారు. చర్చ లేనిరోజునే కేసీఆర్ అసెంబ్లీకి వస్తారని ఎద్దేవా వేశారు పొంగులేటి. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ అసెంబ్లీని ఫేజ్ చేసే దమ్ములేదు.. అందుకే చర్చ లేని సమయంలో.. బడ్జెట్ చదివే సమయంలో అసెంబ్లీకి వచ్చిపోతున్నారని మండిపడ్డారు. ఇవాళ రాష్ట్రంలో ఉన్న నీటి ఎద్దడికి కారణం కేసీఆరే.. కేసీఆర్ ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసింది.. కమిషన్ల కోసం శిలా ఫలకాల కోసమే కొత్త ప్రాజెక్టులు తెచ్చారు.. దేవాదులను నిర్లక్షయం చేశారు ఆరోపించారు. ఇక, ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనుకున్న దాని కంటే రైతులు ఎక్కువ సాగు చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రైతుల పంటల ఎండిపోకుండా కాపాడే ప్రయత్నం చేస్తున్నాం.. బడ్జెట్ సమావేశాల కంటే రైతుల సమస్యలే ముఖ్యమని వచ్చాం.. ఎంత పొద్దుపోయినా పంపు ఆన్ చేసి వెళతాం.. నాటి ప్రభు త్వం దేవాదుల పూర్తి చేసి ఉంటే ÷తులకు ఈ స్థితి వచ్చేది కాదు అన్నారు. ఇక, అంచనా వ్యయం పెరగడానికి కూడా కేసీఆర్ నిర్లక్షయమే కారణం.. తాగునీరు, సాగునీరు సమస్యకు గత కేసీఆర్ సర్కారే కారణమని ఆరోపించారు. ఒక లిఫ్టుతో ఆపరేట్ చేసినా 60-70 వేల ఎకరాల ఆయకట్టు-కు ప్రయోజనం చేకూరేది.. యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నామని మంత్రి పొంగులేటి పేర్కొన్నా రు. దేవాదుల ఆయకట్టుకు నీరందించడం సంతోషంగా ఉందన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. స్టేషన్ ఘన్ పూర్, జనగామ,పాలకుర్తి,పరకాల, భూపాలపల్లి నియోజకవర్గాల్లోని ఆయకట్టుకు నీరం దుతుందన్నారు. గత పదేళ్లుగా దేవాదుల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. మార్చి19 న దేవాదుల రావాలనుకున్నాం కానీ..బడ్జెట్ ఉండటంతో ఇవాళే వచ్చామన్నారు. హనుమకొండ జిల్లా దేవన్నపేట దగ్గర దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ ను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులతో పాటు- ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# చిన్నచిన్న కేసుల్లో బెయిల్ నిరాకరణలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాస్వామ్య దేశం పోలీసుల రాజ్యంలా పని చేయకూడదని హితవు పలికింది. ఒక చిన్న కేసులో బెయిల్ కోసం దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. ఒక ప్రజాస్వామ్య దేశం పోలీసుల రాజ్యంలా పని చేయకూడదు. ఇక్కడ నిజాలతో సంబంధం లేకుండా చట్టం అమలుచేసే సంస్థలు కొందరు వ్యక్తులను నిర్బంధించేందుకు ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తారు. అలా చేయడం ఆమోదయోగ్యం కాదు. రెండు దశాబ్దాల క్రితం.. చిన్న కేసుల్లో బెయిల్ పిటిషన్లు హైకోర్టు, సుప్రీంకోర్టులకు చాలా అరుదుగా వచ్చేవి. ట్రయిల్ కోర్టు స్థాయిలో పరిష్కారం కావాల్సిన కేసులకు సంబంధించి బెయిల్ పిటిషన్ల విషయంలో అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడమనేది దిగ్భ్రాంతి కలిగిస్తోంది. దర్యాప్తు పూర్తయి ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ నిందితుడి బెయిల్ పిటిషన్‌ను ట్రయల్ కోర్టు, గుజరాత్ హైకోర్టు తిరస్కరించాయి. మేజిస్ట్రేట్లు విచారించగలిగే కేసుల్లో బెయిల్ విషయాలను

# డికె అరుణ ఇంట్లో చొరబడ్డ వ్యక్తి అరెస్ట్



హైదరాబాద్, మార్చి 18: భాజపా ఎంపీ డీకే అరుణ ఇంట్లో చొరబడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని దిల్లీకి చెందిన అక్రమ్‌గా గుర్తించారు. అతడిని వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్, జూబ్లీహిల్స్ పోలీసులు విచారిస్తున్నారు. ఎంపీ ఇంట్లోకి చొరబడేందుకు గల కారణాలను తెలుసుకుంటు-న్నారు. అక్రమ్ గతంలో హైదరాబాద్‌లోని పాతబస్తీ, దిల్లీలోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు- సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో సీపీ సీవీ ఆనంద్ సోమవారం ఎంపీ ఇంటికి చేరుకుని వివరాలను సేకరించిన విషయం తెలిసిందే. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 56లోని ఎంపీ నివాసంలోకి నిందితుడు ముసుగు

# బ్యాక్ లాగ్ సీట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం



**తూప్రాన్, మార్చి17**

జిల్లాలోని ఎంజేపీ మహాత్మ జ్యోతిబాపూలే, బీసీ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9వ తరగతిలో బ్యాక్ లాగ్ సీట్ల భర్తీ కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వెల్దుర్తి ఎంజేపీ ప్రిన్సిపాల్ ఏ.అర్.కే వందన తెలిపారు. సోమవారం వెల్దుర్తి ఎం.జె .పి. ప్రిన్సిపాల్ ఏ.అర్.కే వందన మాట్లాడుతూ జిల్లాలోని బాలురు, బాలికల ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలో 2025-26 సంవత్సరంలో మిగిలిపోయిన ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యా ర్థులు ఈనెల 31వ తేదీలోపు అన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 20వ తేదీన ప్రవేశ్ణ పరీక్ష ఉంటుందని, మెరిట్ ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్విని యోగం చేసుకోవాలని సూచించారు.

# ఇంత దుర్మార్గమా...

## మృత్యువాత పడ్డ వందలాది కోళ్లు మాంజీరా లో పారవేత...

**పాపన్నపేట,మార్చ్,18,**



గరుడ గంగా పేరుగాంచిన మంజీరా నదిని కొంతమంది దుర్మార్గులు కలుషితం చేస్తున్నారు. ఇలాంటి వారిని గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పాపన్నపేట మండలం చుట్టూరా మంజీరా నది ప్రవహిస్తుంది. దీనికి ఎంతో చరిత్ర ఉంది, ఏల్లాపూర్, పేరుర్ గ్రామాల మధ్య నుండి మంజీరా ప్రవహించే చోటే సర్పయాగం జరిగిందని ప్రతిదీ, ఆ యాగం బూడిద ఇప్పటికి ఇక్కడ దొరుకుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఇలాంటి చోట ఎవరో గుర్తుతెలియని వారు వైరస్ సోకి మృతి చెందిన వందలాది కోళ్ల కళేబరాలను మంజీరా నదిలో పారబోశారు. దీంతో అవి కుళ్ళిపోయి మంజీరా నది కలుషితమయ్యే అవకాశం ఉంది. అంతేకాకుండా పశువులు తాగడం మూలంగా అవి రోగాల బారిన పడే అవకాశం ఉండడమే కాకుండా చేపలు సైతం చనిపోయే అవకాశం ఉంది, అంతేకాకుండా ఈ చనిపోయిన కోళ్ల కలేబరాలను పరవేసిన చోటుకి కొద్ది దూరంలోనే మెదక్ పట్టణానికి మంచినీటిని అందించే వాటర్ ప్లాంట్ సైతం ఉంది, దీంతో పట్టణవాసులు సైతం ఈ నీరుతాగి రోగాల బారిన పడే అవకాశం ఉంది, సంబంధిత అధికారులు వెంటనే మాంజిరాలో పారవేసిన వేలాది కోళ్ల కళేబరాలు నదిలో నుండి తీయేసి వేయించి, ఇందుకు కారకులైన వారిని శిక్షించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# మిర్యాలగూడలో బహుజన ముక్తి పార్టీలో నూతన సభ్యులు చేరికలు

**- బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర కార్యదర్శి సిరిశాల సీనయ్య,రాష్ట్ర ఉపాధ్యక్షుడు వజ్రగిరి అంజయ్య ఆధ్వర్యంలో నియామక పత్రాలు అందజేయడం జరిగింది.**

**మిర్యాలగూడ 18 మార్చి,( న్యూస్ : 9 )** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని బహుజన ముక్తి పార్టీ కార్యాలయం నందు మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నుండి రాజీనామా చేసి బహుజన ముక్తి పార్టీలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గం లోని వివిధ మండలాల ప్రజలు చేరడం జరిగింది.అనంతరం మీడియా ముఖంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో అన్ని రాజకీయ పార్టీలు ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనారిటీలకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదని తెలియజేస్తూ ఎస్సీ ఎస్టీ బీసీలతో పాటుగా మైనారిటీలకు సమచిత అవకాశాలు



బహుజన ముక్తి పార్టీలో ఉన్నాయని గుర్తించి ఈ పార్టీలో బహుజనుల అభ్యున్నతికి కృషి చేయడానికి కలిసి పని చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలియజేయడం జరిగింది.మేము తీసుకున్న ఈ నిర్ణయం ఆధారంగా బహుజనులంతా ఆలోచించి బహుజన ముక్తి పార్టీలో కలిసి పని చేయటానికి ముందుకు రావాలని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది.బహుజనుల ప్రయోజనాల కొరకు భవిష్యత్తులో బలమైన ఉద్యమ పోరాటాల ద్వారా బహుజనుల ప్రయోజనాలు సాధించుకుంటామని ఈ సందర్భంగా పార్టీ అధిష్టానానికి హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి శీరిశాల శ్రీనయ్య,ఉపాధ్యక్షుడు వజ్రగిరి అంజయ్య,నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కోల కృష్ణ నల్లగొండ జిల్లా మహిళా అధ్యక్షురాలు చేన్నబోయిన వెంకట నరసమ్మ,గిరిజన హక్కుల పోరాట సమితి సభ్యురాలు బుజ్జి, తో పాటుగా తదితరులు పాల్గొనడం జరిగింది.

# అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డాగా తూప్రాన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

**- ఒకే భూమిని మూడు డాకుమెంట్లు గా రిజిస్ట్రేషన్ ..**
**- కోర్టు స్టే లో ఉన్నా రిజిస్ట్రేషన్ లు ఆగని వైనం ..**
**- మాజీ సబ్ రిజిస్ట్రార్ జైలుకు వెళ్లినా మారని తీరు ..**
**- వరుస అక్రమాలు జరుగుతున్నా స్పందించని పై అధికారులు**






**తూప్రాన్, మార్చి 18,**

తూప్రాన్, తప్పుడు పత్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్లకు తూప్రాన్ లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కేరాఫ్ అడ్రస్ గా మారింది. మెదక్ జిల్లా తూప్రాన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి అక్రమాలు రోజురోజుకు మితిమీరి పోతున్నాయి.తూప్రాన్ మండలం రావెల్లి శివారులో ఒకే భూమిని మూడుసార్లు అక్రమ రిజిస్ట్రేషన్లు చేసి ఇక్కడి అధికారులు ఘనతను చాటుకున్నారు. ఈ ఫేక్ రిజిస్ట్రేషన్ల వల్ల రెండు కుటుంబాల మధ్య గొడవ పెట్టారు. ఈ ఘనకార్యం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే..తూప్రాన్ హైవే బైపాస్ లో సర్వే నంబర్ 97/రు లోని 4 గుంటల భూమిని 12 గుంటలు గా విస్తీర్ణం పెంచి జనవరి 16న 158,159 నంబర్లపై రెండు డాక్యుమెంట్లు, ఫిబ్రవరి12వ తేదీన 560 డాక్యుమెంట్ నంబరుపై మరొకటి మొత్తం మూడు ఫేక్ డాకుమెంట్లును సృష్టించారు.ఈ మోసాన్ని ఆ లస్యంగా తెలుసుకున్న బాధిత రైతు బూర్గుల గోవర్ధన్ రెడ్డి మంగళవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగాడు. సబ్ రిజిస్ట్రార్ పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, ఫేక్ డాక్యుమెంట్లను రద్దు చేసి తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశాడు. బాధిత రైతు బూర్గుల గోవర్ధన్ రెడ్డి, ఈ విషయం గురించి వివరణ అడగడానికి మీడియా వాళ్లు ఆఫీసుకు వెల్లగా ఎస్ఆర్వో అందుబాటులో లేరు. ఇన్చార్జి అధికారి తనకు తెలియదని సమాధానమిచ్చారు. గత ఏడాదిలోనే అక్రమ రిజిస్ట్రేషన్ ల కేసులో ఇక్కడి సబ్ రిజిస్ట్రార్ జైలుకు వెళ్లిన ఘటన మరువక ముందే మరో ఘటన వెలుగు చూడటం గమనార్హం. సబ్ రిజిస్ట్రార్ లో విచ్చలవిడిగా అక్రమాలు జరుగుతున్నప్పటికి జిల్లా సబ్ రిజిస్ట్రార్ పట్టించుకోకపోవడం పై స్థానిక ప్రజలు మండి పడుతున్నారు. తూప్రాన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారుతోంది. అక్రమార్కులకు ఇక్కడ అధికారులు అండదండలు అందిస్తుండగా అమాయక ప్రజలు అన్యాయానికి, మోసాలకు గురవుతున్నారు.

# పార్లమెంట్ సమావేశాల్లో ప్రజలకు సంబంధించిన అంశాలపై చర్చ సాగడం లేదు

పార్లమెంట్ సమావేశాల్లో ప్రజలకు సంబంధించిన అంశాలపై చర్చ సాగడం లేదు. ఈ విషయంలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఘోరంగా విఫలం అవుతోంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చకు తేవడం లో ఆ పార్టీ గత కొంత కాలంగా పార్లమెంటులో విఫలం అవుతోంది. ఎంతసేపు కేవలం బిజెపిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తోందే తప్ప..సమస్యలను ఆధారంగా చేసుకుని బిజెపిని విమర్శలు చేయడం లేదు. పార్లమెంట్ ఇప్పుడు కాంగ్రెస్, బిజెపిల మధ్య వ్యక్తిగత ఎజెండాగా మారింది. మిగతా విపక్షాలు కూడా అలాగే ఉన్నాయి. పార్లమెంట్ సమావేశాల్లో గతంలో చక్కటి చర్చ జరిగేది. ప్రభుత్వం కూడా చర్చలకు అవకాశం ఇచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. సాదాసీదాగా పార్లమెంట్ సమావేశాలు సాగుతు న్నాయి. ఏ పార్టీ ఎజెండా దానికి ఉంది. దాని ప్రాకరమే సాగుతున్నారు. డిఎంకె హిందీవ్యతిరేకత, డీలిమిటేషన్పై పోరాడుతోంది. ఆ అంశాలను ప్రస్తావించి హడావిడి చేసింది. విలువలతో కూడాని రాజకీయాలు నెరిపే బిజెపికి ఇప్పుడు అసత్యాలు మాట్లడడమే అలవాటుగా చేసుకుంది. ఈ పార్టీలో అన్నీ అవలక్షణాలు చోటుచేసుకున్నాయి. కేవలం ఇద్దరి చేతుల్లోనే పార్టీ ఉంది. వారిద్దరే అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు. కార్పోరేట్ల సలహాలతో వారు చెప్పిన రీతిలోనే పాలన సాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తాము చెప్పిందే వేదం అన్న రీతిలో పార్టీని నడుపుతూ పోతున్నారు. అన్నీ ఘనతలు సాధించామని, భారత్ ఉజ్వలంగా ఉందని గొప్పలకు పోతున్నారు. ఇలాంటి వారికి ఎదుటి వారు చెప్పే నిజాలు చేదుమాత్రగానే ఉంటుంది. దేశంలో నిరుద్యోగం గరిష్ఠానికి చేరింది. సమస్యలపై గొంతుచించుకుని అరిచినా వినిపించుకునే స్థాయిని మోడీ దాటిపోయారు. నిరుద్యోగం పెరిగిందని, ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీస్తున్నా సమాధానం ఇచ్చే ధైర్యం మోడీకి లేదు. విపక్ష పార్టీలు నిజాలు అడిగినంతనే బిజెపి అగ్గిమీద గుగ్గిలం కావడం దాని అసహనాన్ని వెల్లడిస్తోంది. ఉద్యోగ కల్పనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విఫలమయ్యారని గణాంకాలే వెల్లడిస్తున్నా ఒప్పుకునే ధైర్యం చేయడం లేదు. దీనికితోడు ఉన్నప్రభుత్వరంగ సంస్థలను నిస్సిగ్గుగా అమ్ముతున్నా..గట్టిగా నిలదీసే నేతలు బిజెపిలో కూడా లేరు. అంతెందుకు పార్లమెంటులో ఏ సమస్యపైనా చర్చించే ధైర్యం కూడా మోడీ చేయడం లేదు. అసలు తమను పట్టించుకున్న పాపాన పోవడం లేదని అన్ని వర్గాలు వాదిస్తున్నా పట్టించు కోవడం లేదు. ఎన్నికల ముందు, పార్లమెంటు సమావేశాల సందర్భంగా నీతి వాక్యాలు చెప్పడంతప్ప సమస్యల కోణంలో చూడడం లేదు. కేంద్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయే రంగాల్లో ఎలాంటి సానుకూల మార్పులు తీసుకు వచ్చిందీ చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసు కోవడం లేదు. రాష్ట్రాలకు ఒరగబెట్టిందీ ఏమీ లేకున్నా గణాంకాలతో వివరించేందుకు పదేపదే ప్రయత్నాలు చేయడంతప్ప మరేమీ లేదు. యోడీ తీసుకుంటున్న నిర్ణయాలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బ తీసింది. చాయ్ అమ్మానని గొప్పుల చెప్పే ప్రధాని మోడీ,గ్రామాల్లో చాయ్ అమ్మేవాళ్లకు కూడా కష్టకాలం తీసుకుని వచ్చారు. ఎంతోమంది ఆర్థిక వేత్తలు, ఆర్థిక నిపుణులు జిఎస్టి వల్ల కలిగిన విపరిణామాలను ఏకరువు పెట్టినా పట్టించుకోలేదు.

పలు స్వతంత్ర నివేదికలు ఇప్పటికే ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టాయి. నిజానికి ఇది ప్రతి నిరుద్యోగి చేస్తున్న ఆక్రందన. దేశంలో ఉద్యోగాలు రావు. వస్తూత్పత్తి పెరిగినా అనుబంధ రంగాలు బలపడలేదు. వ్యవసాయం దివాళా తీసింది. పండించిన పంటలకు మద్దతు ధరలు రావడం లేదు. పండించిన పంటలను అమ్ముకునే పరిస్థితి లేదు. బలమైన మార్కెటింగ్ వ్యవస్థ లేకుండా పోయింది. ఇందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పత్తి, మిర్చి, పసుపు,
వరి పండించిన రైతులే నిదర్వనం.
వ్యయసాయానుబంధ పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించి ఉంటే నిరుద్యోగాన్ని తగ్గించుకునే అవకాశం ఉంది. ఉద్యోగాలు కల్పిస్తానని, మేకిన్ ఇండియా అంటూ ఊదరగొట్టడం తప్ప క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. దేశంలో నిరుద్యోగ సమస్య తీర్చే ప్రయత్నాలు జరిగివుంటే పరిస్థితి ఎందుకింత దారుణంగా ఉంటుంది. దీనికితోడు రూపాయి విలువ పడిపోతూ, ద్రవ్యోల్బణం పెరుగుతూ పోతుందే తప్ప అభివృద్ది గణాంకాలు ముందుకు సాగడం లేదు. పాలనలో కొత్త ఒరవడి తీసుకుని వచ్చి,ప్రజలకు ఆసరాగా అండగా, దేశానికి మంచి చేసేలా చేస్తారని మోడీని నమ్మిన ప్రజలు ఇప్పుడు చేష్టలు ఉడిగి చూస్తున్నారు. దీనిపై బిజెపి పెద్దలు ఆత్మవిమర్శ
చేసుకుంటే పార్టీకి, దేశానికి మంచిది.
దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు ఎలా సన్నగిల్లాయో లెక్కలుచూస్తే తెలుస్తుంది. దేశంలోని పట్టణ ప్రాంతాల్లో 7.8శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 5.3శాతం చొప్పున నిరుద్యోగిత ఉందని, సగటున 6శాతం పైనేనని గణాంకాలు తెలుపుతున్నాయి. తీవ్రమైన ఉపాధి లేమి కారణంగా మొన్నటి ఎన్నికల్లో మోదీ విజయావకాశాలను దెబ్బతీసిందని చాలా మంది అంచనాలు వేశారు. అయితే మోడీ మేనేజ్మెంట్తో ఎన్నికల్లో గెలవడంతో ఇక తమకు తిరుగులేదన్న ధోరణిలో ఉన్నారు. స్వతంత్ర సంస్థల నోరుకట్టేసి, ప్రభుత్వ సంస్థల నివేదికలను దాచేసి, ఎన్నో అద్భుతాలను సాధించామని చెప్పుకున్నంత మాత్రాన ప్రజలు నమ్ముతారనుకోవడం అవివేకం. అధికారంలోకి వచ్చేముందు కోట్లాది ఉద్యోగ ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత కొంతకాలం అవే మాటలతో మేకిన్ ఇండియా పాట కూడా పాడారు. నిజంగానే ఇదే సాకారం కావాలంటే స్వయం ఉపాధి రంగాలను ప్రోత్సహించాలి. పంటల కొనుగోలుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పడాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలి. చైనా ఈ రకమైన విజయాలతోనే ఆర్థికంగా విజయం సాధించిందని వేరుగా చెప్పనక్కరలేదు.

న్యూస్-9 సామాజిక అవసరం...సామాన్యుడి ఆయుధం తెలుగు దినపత్రిక
www.news9-india.com
news9.india News9India_ news9telugudaily

# తెలంగాణకు చల్లని కబురు



**హైదరాబాద్ :**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. మార్చి నెల ప్రారంభం నుంచే ఉష్ణోగ్రతలు భారీగా పెరిపోవడంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. ఉదయం 9 గంటల తర్వాత బయటికి రావాలంటేనే జంకుతున్నారు. ఇక, సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత ఉంటోంది. పలు ప్రాంతాల్లో వడగాలులు కూడా మొదలయ్యాయి. దీంతో ప్రజలు పగటిపూట ఇంటి నుంచి బయటికి రావాలంటేనే భయపడిపోతున్నారు.ఈ నేపథ్యంలో, తాజాగా, వాతావరణ శాఖ తెలంగాణ ప్రజలకు చల్లని కబురు చెప్పింది. మార్చి నెలలోనే ఐదు రోజులపాటు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. తెలంగాణ రాష్ట్రంలో మార్చి 21వ తేదీ నుంచి వానలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. మార్చి 21 నుంచి 25 వరకు మొత్తం ఐదు రోజులపాటు వానలు పడతాయని పేర్కొంది.ఇక, నేటి నుంచి మూడు రోజులపాటు ఉదయం వేళ పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం నాటి వాతావరణంలో ఎలాంటి మార్పూ లేదని పేర్కొంది. ఈరోజు ఉష్ణోగ్రతలు ఎక్కువగానే ఉండనున్నాయి.. అయితే, ఆ తర్వాత క్రమంగా ఉష్ణోగ్రతలు తగ్గుతాయని వాతావరణ శాఖ వెల్లడించింది.కాగా, గత నెల రోజులుగా మండిపోతున్న ఎండలతో సతమతమవుతున్న ప్రజలకు వాతావరణ శాఖ ఇచ్చిన సమాచారంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. మరి కొద్ది రోజుల్లో కురుస్తాయన్న వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. వర్షాలు పడితే వాతావరణం చల్లబడుతుందని ఆశిస్తున్నారు. ఎండవేడిమి, ఉక్కపోత నుంచి కొన్ని రోజులపాటైనా ఉపశమనం లభిస్తుందని భావిస్తున్నారు.తెలంగాణలో ఎండ తీవ్రత ఇక మామూలుగా ఉండదట!అయితే, మార్చి 25 తర్వాత మాత్రమం మళ్లీ ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

దీంతో పగటిపూట అనవసరమైన ప్రయాణాలు చేయకుంటేనే మంచిదని వాతావరణ శాఖ అధికారులు, ఆరోగ్య నిపుణులు ప్రజలకు సూచిస్తున్నారు. ఏవైనా పనులుంటే ఉదయం, సాయంత్రంపూట చేసుకోవాలంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో పగటిపూట ప్రయాణం చేయాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. తమ వెంట తాగునీరు, గొడుగు లాంటి వాటిని తీసుకెళ్లాలని చెబుతున్నారు.

# ఎస్సీ వర్గీకరణ బిల్లు 2025 ఆమోదం పొందడం ఒక మైలురాయి

**హైదరాబాద్:** తెలంగాణ శాసనసభలో మంగళవారం ఎస్సీ (రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) బిల్లు 2025 ఆమోదం పొందడం ఒక మైలురాయి నిర్ణయమని నీటిపారుదల మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయడానికి ఏర్పాటు చేసిన కేబినెట్ ఉప కమిటీకి ఛైర్మన్‌గా ఉన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలో దశాబ్దాలుగా పరిష్కరించబడని డిమాండ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని పేర్కొన్నారు."ఇది చారిత్రాత్మకమైన రోజు. ఎస్సీ వర్గీకరణకు సంవత్సరాలుగా అన్ని వర్గాల మద్దతు ఉంది, కానీ ఎటువంటి నిర్మాణాత్మక పరిష్కారం సాధించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కింద, మేము ఈ దీర్ఘకాల డిమాండ్‌ను పూర్తి చిత్తశుద్ధితో నెరవేర్చాము," అని ఆయన అసెంబ్లీలో ప్రసంగిస్తూ అన్నారు.వన్ మ్యాన్ కమిషన్ నియామ



కంచర్చ సమయంలో, ముఖ్య మంత్రి తరపున మంత్రి దామోదర్ రాజనర్సింహ బిల్లును ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ఎస్సీ వర్గీకరణకు మద్దతుని చ్చిందని, రాహుల్ గాంధీ తన ఎన్నికల ప్రచారాలలో ఈ విషయంపై స్పష్టమైన హామీ ఇచ్చారని ఉత్తమ్ కుమార్ రెడ్డి హైలైట్ చేశారు. మునుపటి ప్రభుత్వాలు ఏకగ్రీవ తీర్మానాలు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన గుర్తు చేశారు.తాను 1999 నుండి ప్రతి అసెంబ్లీ సమావేశాలను ఫాలో అవుతున్నట్లు చెప్పిన ఉత్తమ్...అప్పుడు కూడా ఎస్సీ వర్గీకరణ గురించి చర్చించారని అన్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు దానిని నిజం చేసిందని కొనియాడారు.పంజాబ్, హర్యానా , తమిళనాడు వంటి రాష్ట్రాల నమూనాలను అధ్యయనం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ కోసం చక్కటి ప్రణాళికను రూపొందించింది.అక్కడ కూడా ఇలాంటి వర్గీకరణలు ఉన్నాయి. ప్రభుత్వం వన్ మ్యాన్ కమిషన్‌ను నియమించింది, ఇది ఎస్సీ ఉప కులాలపై సమగ్ర అధ్యయనం చేసింది.జనాభా, అక్షరాస్యత, ఉపాధి, ఉన్నత విద్యలో ప్రవేశాలు, రిక్రూట్‌మెంట్ ట్రెండ్స్, ఆర్థిక సహాయం మరియు రాజకీయ ప్రాతినిధ్యం వంటి డేటాను సేకరించిందని ఉత్తమ్ చెప్పారు.

ఫిర్యాదులు స్వీకరించిన ప్రభుత్వంతెలంగాణలోని 59 ఎస్సీ ఉప కులాలను పరిశీలించడంలో షమీమ్ అక్తర్ కమిటీ కీలక పాత్ర పోషించిందని చెప్పిన ఆయన, న్యాయమైన వర్గీకరణను నిర్ధారించేందుకు అంతర్గత వెనుకబాటుతనాన్ని విశ్లేషించిందని చెప్పారు. కమిషన్ ప్రారంభంలో ప్రాథమిక నివేదికను సమర్పించింది, ఆ తర్వాత అనేక ఎస్సీ ఉప కులాలు ఆందోళనలను లేవనెత్తగా... ప్రతిస్పందనగా, వర్గీకరణ ప్రక్రియను ఖరారు చేయడానికి ముందు అన్ని ఫిర్యాదులను సమగ్రంగా పరిష్కరించడానికి ప్రభుత్వం కమిషన్ పదవీకాలాన్ని ఒక నెల పొడిగించిందని గుర్తు చేశారు.వెనుకబాటుతనం ఆధారంగా ఎస్సీల్లో వర్గీకరణను మూడు గ్రూపులుగా విభజించింది. గ్రూప్ లో,ఎస్సీ జనాభాలో 3.288% ఉన్న 15 అత్యంత వెనుకబడిన ఎస్సీ కులాలకు 1% రిజర్వేషన్ కేటాయించారు. గ్రూప్ లో,ఎస్సీ జనాభాలో 62.74% ఉన్న 18 మధ్యస్థంగా ప్రయోజనం పొందిన కులాలకు 9శాతం రిజర్వేషన్ కేటాయించారు.రిజర్వేషన్ల నుండి ఎక్కువగా ప్రయోజనం పొందిన 26 కులాలు,ఎస్సీ జనాభాలో 33.963% ఉన్నవారికి 5% రిజర్వేషన్ కేటాయిస్తూ మూడవ గ్రూపులో చేర్చారు.

# అయ్యో అయ్యయ్యో.. ఇఫ్తార్ విందుకు వెళ్లొచ్చేసరికి ఇంట్లో భారీ చోరీ

**షేక్‌పేట :**పవిత్ర రంజాన్ మాసాన్ని టార్గెట్ గా చేసుకున్న దొంగలు.. ఓ ముస్లిం కుటుంబం ఇఫ్తార్ విందుకు వెళ్ళిన సమయంలో ఇంటిని లూటీ చేసేశారు. 34 తులాల బంగారం ఆభరణాలతో పాటు సుమారు రూ 4.5 లక్షల నగదు, ఫారెన్ కరెన్సీని దోచుకెళ్లారు. ఈ దారుణ ఘటన హైదరాబాద్ లోని ఫిల్మ్ నగర్ లో చోటు చేసుకుంది. ప్రస్తుతం ఈ ఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది.ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే.. షేక్‌పేట సమీపంలోని డైమండ్ హిల్స్ కాలనీకి చెందిన మహ్మద్ ముజాహిద్ కుటుంబంతో కలిసి ఆస్ట్రేలియాలో నివాసం ఉంటున్నారు. రీసెంట్ గానే హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. అయితే నిన్న రాత్రి పవిత్ర రంజాన్ మాసం కావడంతో ఇంటికి తాళం వేసి ఇఫ్తార్ విందుకోసం




బంధువుల ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చేసరికి.. ఇంటి వెనక తలుపు పగలగొట్టి ఉండడం గమనించారు.అలానే ఇంట్లోని రెండు బెడ్రూంలలో అల్మారాలు పగలగొట్టిన దుండగులు 34 తులాల బంగారు ఆభరణాలతో పాటు సుమారు రూ 4.5 లక్షల నగదు, 550 కెనడియన్ డాలర్లు ఎత్తుకెళ్లినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు అందుకున్న ఫిలిం నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్ తో పాటు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇంట్లోని సీసీ కెమెరాలు, డీవీఆర్ ధ్వంసం చేసినట్లు గుర్తించారు.

దీంతో వాటి ఇంటికి సమీపంలోని సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఊహించని ఘటనతో స్థానికంగా దుమారంగా మారింది. భక్తిశ్రద్ధలతో ఉపవాసం ఉంటూ రంజాన్ మాసాన్ని పవిత్రంగా జరుపుకుంటారు. దుండగులు ఈ సమయాన్ని టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడడం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఊహించని ఘటనతో ముస్లిం వర్గీయులు ఎక్కువగా ఉండే ఏరియాల్లో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# టీడీపీలో ఒక వర్గం...ఏమి చేద్దాం...ఇదే చర్చ

**అమరావతి :**తెలుగుదేశం పార్టీలో ఇపుడు హాట్ హాట్ గా ఒక విషయం మీద చర్చ సాగుతోందిట. ఆ చర్చ అంతా కూడా పార్టీ పెద్దలకు ఇబ్బంది కలిగించేలా ఉందిట. నిజానికి తెలుగుదేశం పార్టీలో హార్డ్ కోర్ ఫ్యాన్స్ చాలా మంది ఉన్నారు. వారంతా టీడీపీ అంటే ప్రాణాలు ఇస్తారు. పార్టీ ఆత్మగా వారు ఉంటారు. తమ పార్టీ మీద ఈగ వాలనివ్వరు.అలాంటిది వారు ఇపుడు పార్టీ లో ఒక వర్గంగా ఉంటున్నారు. వారు పార్టీలో జరుగుతున్న పరిణామాల పట్ల మేధో మధనం జరుపుతున్నారు. మరీ ముఖ్యంగా వర్తమానంలో చోటు చేసుకుంటున్న అనేక పరిణామాల పట్ల కూడా వారు తమదైన శైలిలో స్పందిస్తున్నారని అంటున్నారు.ఇలా తెలుగుదేశం పార్టీలో ఒక అతివాద వర్గం ఉందని తెలుస్తోంది. ఈ వర్గం అన్నది ప్రతీ పార్టీలో కూడా మామూలుగానే ఉంటుంది అన్నది నిజం. అయితే తెలుగుదేశంలో ఈ వర్గం దూకుడు వేరు అని అంటున్నారు. ప్రస్తుతం ఈ అతివాద వర్గం తెలుగుదేశంలో రచ్చ చేస్తోంది అని అంటున్నారు. జనసేన మీద వీర లెవెల్ లో విరుచుకుపడుతోంది అని అంటున్నారు.జనసేన ఆవిర్భావ సభలో పవన్ కళ్యాణ్ నాగబాబు మాట్లాడిన మాటలో పట్ల పూర్తి స్థాయిలో గుస్సా అవుతోంది అని అంటున్నారు. వీరు అన్న మాటలను సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున ట్రోలింగ్ చేస్తున్నారు అని అంటున్నారు.

తెలుగుదేశం పార్టీని నిలబెట్టామన్న పవన్ మాటల మీద గుర్రు



అవుతోంది. టీడీపీని వారు నిలబెట్టేది ఏంది అని ఈ వర్గం ఒక్క లెక్కన ఫైర్ అవుతోంది. ఏపీలో ఒకవేళ ఈ పొత్తులు లేకపోయినా టీడీపీకి ఒంటరిగా 135 సీట్లకు తక్కువ కాకుండా వస్తాయని కూడా ఈ వర్గం ధీమాగా చెబుతోంది అంటున్నారు.అంతే కాదు టీడీపీకి ఇప్పటివరకూ 40 శాతం ఓటు షేర్ తగ్గిన దాఖలాలు అయితే లేవు అని అంటున్నారు. టీడీపీ సుదీర్ఘమైన చరిత్ర కలిగిన పార్టీ అని గెలుస్తూ ఉంటాం, ఓడుతూ ఉంటామని కూడా అతివాదులు అంటున్నారు. గ్రామాలో చూస్తే టీడీపీ అత్యంత పటిష్టంగా ఉందని అదే జనసేనకు ఒక వర్గం అంటూ లేదని గుర్తు చేస్తున్నారు.

అలాగే సరైన నాయకత్వం కూడా వారికి లేదని అంటున్నారు. తూర్పు గోదావరిలో కొంచెం బలం ఉంది తప్పించి ఏమి ఉంది ఆ పార్టీకి అని జనసేన మీద టీడీపీ అతివాదులు విరుచుకుపడుతున్నారు. టీడీపీని నిలబెట్టేది పవన్ కళ్యాణ్ కాదని వారు చెబుతున్నారు.ముందు ఆయనను ఆయన నిలబెట్టుకోమని ఈసారి ఎన్నికల్లో అని కూడా అంటున్నారు. తెలుగుఏశం పార్టీ వయసు నాలుగు దశబ్దాలు దాటింది. అటువంటి పార్టీని నిలబెట్టేది ఆయన ఎలా అని ప్రశ్నిస్తున్నారు. టీడీపీని ఎపుడూ నిలబెట్టేది క్యాడర్ అని అలాగే చంద్రబాబు ఫేస్ వాల్యూ అని ఈ రెండే ప్రజలలో నమ్మకాన్ని పెంచి టీడీపీకి అధికారాన్ని తెచ్చాయని వారు గుర్తు చేస్తున్నారు.

మొత్తం మీద చూస్తే పవన్ కళ్యాణ్ నాగబాబు అన్న మాటలను టీడీపీలోని హార్డ్ కోర్ ఫ్యాన్స్ అయితే అసలు తట్టుకోలేకపోతున్నారు. వారు సోషల్ మీడియా వేదికగా తమ గోడు వెళ్ళబోసుకుంటున్నారు. ఒక విధంగా ఈ తరహా వ్యాఖ్యలను టీడీపీలో అతివాదులు అవమానంగా ఫీల్ అవుతున్నారు. తెలుగుదేశం ఎన్నో రికార్డులు సృష్టించిన పార్టీగా వారు చెబుతున్నారు.తెలుగుదేశం పార్టీ ఎదురులేకుండా తెలుగు రాజకీయాల్లో తన జెండాని ఎగుర వేస్తోందని అంటున్నారు. అలాంటి పార్టీ విషయంలో ఎవరు ఏ విధంగా మాట్లాడినా అతివాదులకు కోపమే వస్తుందని చెబుతున్నారు. అయితే టీడీపీ అధినాయకత్వం మాత్రం జనసేనకు ఆ పార్టీ పెద్దలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తూండడాన్ని చూసి ఇబ్బంది పడుతున్నారు. టీడీపీ క్యాడర్ వారి మాటగా ఆవేదనగా ఉంది.

# పిటీషనర్ కు కోటి జరిమానా..

## తెలంగాణ హైకోర్టు సంచలనం



**హైదరాబాద్ :**తెలంగాణ హైకోర్టులోని న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక తన ధర్మాసనంలో నిత్యం ఎన్నో కేసులను విచారిస్తుంటారు. అయితే ఒక మధ్యాహ్నం ఆయన వెలువరించిన తీర్పు న్యాయవాద వర్గాల్లోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బండ్లగూడ జాగీర్ భూములకు సంబంధించిన ఒక పిటిషన్‌ను విచారిస్తున్న ఆయన, పిటిషనర్ వెంకట్రామిరెడ్డి ప్రవర్తనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకంగా కోటి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. జస్టిస్ నగేశ్ తీర్పు చదువుతుండగా ఉత్కంఠ నెలకొంది. ఆయన గొంతులో ఆగ్రహం స్పష్టంగా వినిపిస్తోంది. "ఈ పిటిషనర్ వెంకట్రామిరెడ్డి ఉన్నత న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. ఇది ఎంత మాత్రం క్షమించరాని నేరం," అంటూ ఆయన తీవ్ర స్వరంతో హెచ్చరించారు..అసలు ఏం జరిగిందంటే వెంకట్రామిరెడ్డి బండ్లగూడ జాగీర్ భూములకు సంబంధించి గతంలోనే ఒక పిటిషన్‌ను హైకోర్టులో దాఖలు చేశారు. అది ఇంకా పెండింగ్‌లో ఉండగానే, ఆ విషయాన్ని దాచిపెట్టి, మరో బెంచ్ ముందు అదే అంశంపై మరో రిట్ పిటిషన్‌ను వేశారు. అక్కడ అనుకూలమైన ఉత్తర్వులు పొందాలని ఆయన ప్రయత్నించారు.ఈ విషయం జస్టిస్ నగేశ్ దృష్టికి రావడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. ఉన్నత న్యాయస్థానాన్ని మోసం చేసేలా వ్యవహరించిన పిటిషనర్‌పై ఆయన ఆగ్రహం కట్టలు తెంచుకుంది. "ప్రభుత్వ భూములను అక్రమ మార్గాల్లో సొంతం చేసుకోవాలని చూసే ఇలాంటి వ్యక్తుల వల్ల న్యాయ వ్యవస్థ పట్ల ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతుంది. దీన్ని ఎంత మాత్రం సహించేది లేదు," అని ఆయన స్పష్టం చేశారు. వెంటనే ఆయన వెంకట్రామిరెడ్డికి కోటి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ భారీ జరిమానా వినగానే కోర్టు హాలులో ఒక్కసారిగా కలకలం రేగింది. న్యాయవాదులు సైతం ఆశ్చర్యపోయారు. ఇంత పెద్ద మొత్తంలో జరిమానా విధించడం చాలా అరుదుగా జరుగుతుంది.ఈ తీర్పుతో అక్రమంగా ప్రభుత్వ భూములు కాజేయాలనుకునే వారికి ఒక బలమైన సందేశం వెళ్లింది. ఉన్నత న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టిస్తే ఎంతటి మూల్యం చెల్లించాల్సి వస్తుందో ఈ తీర్పు రుజువు చేసింది. జస్టిస్ నగేశ్ భీమపాక తీసుకున్న ఈ చర్యను న్యాయవాద వర్గాలు ముక్తకంఠంతో సమర్థిస్తున్నాయి. ఇది న్యాయ వ్యవస్థ పట్ల ప్రజల నమ్మకాన్ని మరింత బలపరుస్తుందని వారు అభిప్రాయ పడు తున్నారు.ఈ ఘటనతో తెలంగాణ హైకోర్టు మరోసారి తన నిష్పాక్షిక వైఖరిని చాటుకుంది. చట్టాన్ని అతిక్రమించే ఎవరికైనా శిక్ష తప్పదని ఈ తీర్పు స్పష్టం చేసింది. విలువైన ప్రభుత్వ భూములను కాపాడటంలో న్యాయస్థానం దృఢ సంకల్పానికి ఈ తీర్పు ఒక నిదర్శనంగా నిలిచింది.

# అధ్యక్షుడి సన్నిహితుడు అరెస్ట్...

## చైనాలో ఏమి జరుగుతోంది

**చైనా :**చైనాలో గత ఏడాది మియావో లి అనే ఉన్నతస్థాయి సైనిక అధికారిని అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఆయన నాడు పొలిటికల్ వర్క్ డిపార్ట్ మెంట్ డైరెక్టర్ గా ఉన్నారు. అంతక ముందు చైనా రక్షణ మంత్రిని అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా చైనా సైన్యంలో అధ్యక్షుడు జిన్ పింగ్ కు అత్యంత సన్నిహితమైన ఫుజియాన్ నాయకులు, జనరల్స్ పై చర్యలు మొదలయ్యాయి. అవును... చైనా సైన్యంలో అత్యంత కీలక స్థానాల్లో ఉంటూ, అధ్యక్షుడు జిన్ పింగ్ కు అత్యంత సన్నిహితమైన వ్యక్తుల అరెస్ట్ ఇప్పుడు సంచలనంగా మారింది. ఇందులో భాగంగా... అత్యంత కీలకమైన సెంట్రల్ మిలటరీ కమిషన్ వైస్ ఛైర్మన్ హివైడాంగ్ అరెస్టయ్యారు. ఇటీవల కాలంలో చైనా కీలక పదవుల్లో ఉన్న వ్యక్తులను మార్చేస్తున్న క్రమంలో ఈ అరెస్ట్ వైరల్ గా మారింది.

వాస్తవానికి అత్యంత కీలకమైన ఈ కమిషన్ కు చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ ఛైర్మన్ కాగా.. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీలో సెంట్రల్ మిలటరీ కమిషన్ వైస్ ఛైర్మన్ పదవి అత్యున్నతమైంది! అలాంటి వ్యక్తి అరెస్ట్ అవ్వడంతో.. మరికొంతమందిని కూడా అదుపులోకి తీసుకోనున్నారని అంటున్నారు. ఇప్పటికే అదుపులోకి తీసుకున్నవారిలో ఉన్న ప్రముఖుల వివరాలు వెలువడుతున్నాయి.

ఇందులో భాగంగా... పీ.ఎల్.ఏ. జనరల్ లాజిస్టిక్స్ డిపార్ట్ మెంట్ మాజీ మంత్రి ఝూవో కేషిని కూడా కస్టడీలోకి తీసుకొన్నట్లు కథనాలొస్తున్నాయి. ఈయన కూడా నాన్ జింగ్ మిలటరీ రీజియన్ లో జనరల్ లాజిస్టిక్స్ లో అధిపతిగా పనిచేశారు.


దీంతోపాటు సైనిక బడ్జెట్, వనరుల కేటాయింపులు, రక్షణ పరిశ్రమలపై అతడి ప్రభావం ఉందని చెబుతారు.ఇదే సమయంలో... వెస్టర్న్ థియేటర్ కమాండ్ డిప్యూటీ కమాండర్, ఫుజియాన్ లో




పనిచేసే చాలామంది జనరల్స్ ను అదుపులోకి తీసుకొన్నట్లు తెలుస్తోంది. అయితే... ఈ అరెస్టులను ఆ దేశ రక్షణశాఖ ధృవీకరించాల్సి ఉంది.

# అమెరికా నుంచి లేడీ డాక్టర్ బహిష్కరణ...

## వైరల్ గా బైబై రాషా



**అమెరికా :**అమెరికా తమ దేశం నుంచి ఓ మహిళా డాక్టర్ ను బహిష్కరించింది. ఇందులో భాగంగా... రోడ్ ఐలాండ్ లో కిడ్నీ మార్పిడి స్పెషలిస్టుగా పనిచేస్తున్న లెబనీస్ డాక్టర్ రాషా అలవీని దేశం నుంచి బహిష్కరించింది. హెజ్ బొల్లాతో ఈమెకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ అమెరికా ఈ నిర్ణయం ప్రకటించింది. ఈ సందర్భంగా వైట్ హౌస్ పోస్ట్ వైరల్ గా మారింది.అవును... కిడ్నీ మార్పిడి స్పెషలిస్టుగా పనిచేస్తున్న లెబనీస్ మహిళా డాక్టర్ కు.. హెజ్ బొల్లాతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. అమెరికా తమ దేశం నుంచి బహిష్కరించింది. ఈ నేపథ్యంలో వైట్ హౌస్ ఓ పోస్ట్ చేసింది. ఇందులో భాగంగా... డొనాల్డ్ ట్రంప్ ఆమెకు బై చెబుతున్నట్లుగా ఉన్న ఫోటోను షేర్ చేస్తూ.. "బైబై రాషా" అంటూ రాసుకొచ్చింది.వాస్తవానికి లెబనాన్ పర్యటనకు వెళ్లిన రాషా ఫిబ్రవరి 23న జరిగిన హెజ్ బొల్లా మాజీ అధినేత హసన్ నస్రల్లా (64) అంత్యక్రియలకు హాజరైనట్లు చెబుతున్నారు. దీంతో.. గతవారం బోస్టన్ లోగాన్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ చేరు కున్న ఆమెను అమెరికా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నస్రల్లా అంత్యక్రియలు హాజరైనట్లు ఆమె అంగీకరించినట్లు చెబుతున్నారు.ఇదే సమయంలో.. ఆమె ఫోన్ లో నస్రల్లాతో పాటు ఇతర హెజ్ బొల్లా నేతల ఫోటోలు ఉన్నాయని చెబుతున్నారు. అయితే.. ఆమె లెబనాన్ నుంచి బోస్టన్ చేరుకునే ముందు వాటిని డిలీట్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ విషయంపై అధికారులు ఆమెను ప్రశ్నించగా.. ఆమె అంగీకరించిందని అంటున్నారు. విచారణలో భాగంగా ఈ విషయాలపై ఆమెను ప్రశ్నించగా.. వారి రాజకీయ కార్యకలాపాల గురించి కాకుండా మతప రమైన, ఆధ్యాత్మిక బోధనల విషయంలో మాత్రమే తాను హెజ్ బొల్లా నేతలను ఫాలో అవుతున్నట్లు ఆమె పేర్కొన్నారని చెబు తున్నారు. అయితే... హెజ్ బొల్లాతో సంబంధాలు ఉన్నాయని తెలియడంతో ఆమెను దేశం అధికారులు వెల్లడించారు.

# మళ్లీ ట్రెండింగ్ లో సీమా హైదర్... ఈ పాక్ మహిళ గుర్తున్నారా

**పాకిస్థాన్ :**ఆన్ లైన్ లో పరిచయమైన యువకుడి కోసం పాకిస్థాన్ నుంచి భారత్ లోకి అక్రమ మార్గంలో అడుగుపెట్టిన సీమా హైదర్ గురించి ఇప్పుడు పెద్దగా పరిచయం అవసరం లేదనే చెప్పాలి. గతకొంతకాలంగా జాతీయ మీడియా, ప్రాంతీయ మీడియా, సోషల్ మీడియా అనే తారతమ్యాలేమీ లేకుండా... ఎక్కడ చూసినా ఈమె గురించిన చర్చే జరిగిందన్నా అతిశయోక్తి కాదు!2013లో సీమా హైదర్ నలుగురు పిల్లలతో కలిసి పాకిస్థాన్ నుంచి భారత్ లో ఉన్న ఆన్ లైన్ ప్రేమికుడు సచిన్ మీనా కోసం రావడంతో తీవ్ర సంచలనం సృష్టించింది. అప్పట్లో ఆమె గురించి రకరకాల ప్రచారాలు తెరపైకి వచ్చాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆమె మరోసారి నెట్టింట చర్చనీయాంశంగా మారారు. అందుకు కారణం.. ఆమె ఐదో బిడ్డకు జన్మనివ్వడమే!అవును... భారత్ లో ఉన్న ప్రియుడి కోసం నలుగురు పిల్లలతో పాక్ నుంచి వచ్చేసిన సీమా హైదర్ జీవితంలో మరో గుడ్ న్యూస్ కలిగింది!



ఇందులో భాగంగా.. సీమా హైదర్ %-% సచిన్ మీనా దంపతులకు ఈ నెల 18 (మంగళవారం) ఆడపిల్ల జన్మించింది. దీంతో.. మరోసారి ఈ జంట కు సంబంధించిన వార్తలు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి.కాగా... ఆన్ లైన్ లో సీమా హైదర్ - సచిన్ మీనా మధ్య పరిచయం కాస్తా ప్రేమగా మారిన సంగతి తెలిసిందే! దీంతో... ప్రేమించినవాడి కోసం సీమ తన నలుగురు పిల్లలను తీసుకుని నేపాల్ మీదుగా భారత్ లో ప్రవేశించేందుకు ప్రయత్నించింది. అయితే.. అప్పటికే వీరిద్దరూ నేపాల్ లోని ఓ ఆలయంలో వివాహం చేసుకున్నారు.ఈ క్రమంలో భారత్ లోకి అక్రమంగా ప్రవేశించిన విషయానికి సంబంధించి కేసులు, బెయిల్ మొదలైన పరిణామాల అనంతరం పరిస్థితులు కాస్త సానుకూలంగా మారడంతో.. వీరిరువురూ ఉత్తరప్రదేశ్ లోని నొయిడాలో నివాసం ఉంటున్నారు. ఇక.. సీమా హైదర్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటున్నారని.. ఆమె సంపాదన కూడా బాగుందని అంటున్నారు.ఈ నేపథ్యంలో తాజాగా సీమా హైదర్.. ఐదో బిడ్డకు జన్మనిచ్చిందని ఆమె లాయర్ వెల్లడించారు. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. ఈ సందర్భంగా స్పందించిన సీమా-సచిన్ ల న్యాయ సలహాదారు... అయ్యింది అని తెలిపారు.

# ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు.. పోటీపడుతోన్న తెలుగు రాష్ట్రాలు



**హైదరాబాద్:** అభివృద్ధిలోనే కాదు.. క్రిమినల్ కేసులు కలిగి ఉన్న ప్రజాప్రతినిధుల జాబితాలోనూ రెండు తెలుగు రాష్ట్రాలు పోటీ పడుతున్నాయనే విషయం తాజాగా తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా... 28 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని అసెంబ్లీలకు చెందిన 4,092 మంది ఎమ్మెల్యేలను విశ్లేషించి అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంచలన విషయాలు వెల్లడించింది.అవును... దేశంలోని 4,902 మంది ఎమ్మెల్యేలను విశ్లేషించినప్పుడు అందులో 1,861 మంది ఎమ్మెల్యేలు (సుమారు 45శాతం మంది)పై క్రిమినల్ కేసులు నమోదయ్యాయని తేలింది. వారిలో 1,205 మంది అంటే.. సుమారు 29శాతం మందిపై హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, మహిళలపై నేరాలు వంటి తీవ్రమైన క్రిమినల్ అభియోగాలను ఎదుర్కొంటున్నారని తెలిపింది.ఈ జాబితాలో క్రిమినల్ కేసులు ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యేలు అత్యధికంగా ఆంధ్రప్రదేశ్ లో ఉండటం గమనార్హం. ఏపీలో అత్యధికంగా 79శాతం మంది.. అంటే 138 మంది క్రిమినల్ కేసులున్న ఎమ్మెల్యేలతో ఈ జాబితాలో ఫస్ట్ ప్లేస్ లో ఉండగా.. తర్వాత స్థానాల్లో 69శాతం క్రిమినల్ కేసులున్న ఎమ్మెల్యేలతో కేరళ, తెలంగాణ ఉన్నాయి.అయితే... 66 శాతం మంది క్రిమినల్ కేసులున్న ఎమ్మెల్యేలతో బీహార్ రెండు తెలుగు రాష్ట్రాలు, కేరళ తర్వాత స్థానంలో ఉండటం గమనార్హం! ఆ తర్వాత 65%తో మహారాష్ట్ర, 59శాతంతో తమిళనాడు రాష్ట్రాలు టాప్ 5 లో ఉన్నాయి. ఇదే సమయంలో తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల జాబితాలోనూ 56% తో ఏపీ అగ్రస్థానంలో ఉండగా... తర్వాత వరుసగా తెలంగాణ (50%), బీహార్ (49%)తో ఉన్నాయి.ఇక పార్టీల వారీ విశ్లేషణ విషయానికొస్తే... ఏపీలో అధికారంలో ఉన్న తెలుగుదేశంపార్టీలో అత్యధికంగా క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు 134 మందిలో 115 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు (86%) ఉన్నారని ఏడీఆర్ నివేదిక తెలిపింది. ఇదే సమయంలో వారిలో 82 మంది ఎమ్మెల్యేలు తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నారని వెల్లడించింది.ఇక దేశవ్యాప్తంగా బీజేపీకి చెందిన 1,653 మంది ఎమ్మెల్యేలలోను 638 మంది (సుమారు 39%) మందిపై క్రిమినల్ కేసులు.. 436 మంది (26శాతం) పై తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయని విశ్లేషణలో తేలింది. ఇక కాంగ్రెస్ పార్టీ విషయానికొస్తే... ఆ పార్టీకి ఉన్న 646 మంది ఎమ్మెల్యేల్లో 339 మందిపై క్రిమినల్ కేసులు.. 194 మందిపై తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి!ఇదే సమయంలో... తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే ఎమ్మెల్యేలు 132 మందిలో 98 మందిపై క్రిమినల్ కేసులు ఉండగా.. వీరిలో 42 మంది తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇక తృణముల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎమ్మెల్యేలు 230 మందిలో 95 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటుండగా.. వారిలో 78 మంది తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.ఇక.. ఇటీవల ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన ఆప్ పార్టీలోని 123 మంది ఎమ్మెల్యేలలో 69 మంది క్రిమినల్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారని.. వీరిలో 35 మంది తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నారని ఏడీఆర్ నివేదిక వెల్లడించింది.

ఇదే సమయంలో.. ఈ తాజా నివేదిక ఎమ్మెల్యేల ఆర్థిక పరిస్థితిని తెరపైకి తెచ్చింది. ఇందులో భాగంగా.. దేశంలో 119 మంది ఎమ్మెల్యేలు బిలియనీర్లు కాగా.. అన్ని రాష్ట్రాల్లోనూ సగటున ఎమ్మెల్యేల ఆస్తులు రూ.17.92 కోట్లు. అయితే... నేరారోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల సగటు ఆస్తులు మాత్రం రూ.20.94 కోట్లుగా ఉన్నాయి.

# గుజరాత్ లో ఘోరం... దర్గాలోకి బూట్లతో వచ్చారని..

**గుజరాత్ :**ఇటీవల కాలంలో భారత్ లో పర్యటిస్తున్న విదేశీయులపై దాడులు జరుగుతున్న ఘటనలు వరుసగా చోటు చేసుకుంటున్న సంగతి తెలిసిందే! ఇటీవల కర్ణాటకలోని గంగావరి ప్రాంతానికి వచ్చిన విదేశీయులపై కొందరు దుండగులు దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా గుజరాత్ లో ఇలాంటి ఘోరం ఒకటి చోటు చేసుకుంది.అవును... గుజరాత్ లోని వడోదర జిల్లాలోని దర్గాలోకి.. నలుగురు అంతర్జాతీయ విద్యార్థులు పాదరక్షలు ధరించి ప్రవేశించారు. దీంతో... వారిపై ఓ గుంపు దాడి చేసింది. విదేశీ విద్యార్థులకు గుజరాతీ భాష అర్థం కాకపోవడం, స్థానిక ఆచారాల గురించి అవగాహన లేకపోవడం వల్ల ఈ ఘటన జరిగిందని చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ దాడిలో ఓ విద్యార్థి తలకు తీవ్రంగా గాయమైందని.. ఇదే సమయంలో అతడి చేతులు, కాలుపైనా గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఇప్పటివరకూ ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేయగా.. వారిలో ఇద్దరు మైనర్లు ఉన్నారని తెలుస్తోంది. బాధితుడిని పరుల్ సేవాశ్రమ్ ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డులో చేర్చినట్లు చెబుతున్నారు.వాఘోడియా పోలీస్ స్టేషన్ లో నమోదైన ఎఫ్.ఐ.ఆర్. ప్రకారం... మార్చి 14 సాయంత్రం... థాయిలాండ్, సూడాన్, యునైటెడ్ కింగ్ డమ్, మొజాంబిక్ దేశాలకు చెందిన పారుల్ యూనివర్శిటీకి చెందిన నలుగురు అంతర్జాతీయ విద్యార్థులను.. లిమ్డా గ్రామంలో వారి హాస్టల్ కి సమీపంలో సుమారు 10 మంది వ్యక్తుల బృందం వెంబడించి దాడి చేసింది.గుజరాతీ భాషలో.. దర్గా దగ్గర బూట్లు ధరించి నడవొద్దని స్థానిక వ్యక్తి చేసిన సూచనలను ఈ విదేశీ విద్యార్థులు అర్థం చేసుకోకపోవడంతోనే ఈ దాడి జరిగిందని తెలుస్తోంది. ఈ దాడి సమయంలో ముగ్గురు విద్యార్థులు తప్పించుకుని



పారిపోగా.. థాయిలాండ్ కు చెందిన విద్యార్థి దొరికిపోయాడని.. అతడిపై క్రికెట్ బ్యాట్, కర్రలతో దాడి చేశారు!దీంతో... నిందితులపై భారతీయ న్యాయ సంహితలోని వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వాఘోడియా పోలీస్ స్టేషన్ అధికారి వెల్లడించారు.

# తెలంగాణలో ఎంట్రీ ఇవ్వనున్న 37 మద్యం బ్రాండ్లు

**హైదరాబాద్:** తెలంగాణ మందుబాబులకు మరింత కిక్కు ఇచ్చే నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంది. అతి త్వరలో మార్కెట్ లోకి సరికొత్త మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయి. అది కూడా ఒకట్రెండు కాదు ఏకంగా 37 కొత్త మద్యం బ్రాండ్లు ముందుకు వచ్చాయి. మద్యం సరఫరా కోసం గత నెల 23న బేవరేజెస్ కార్పొరేషన్ కొత్త సరఫరాదారుల నుంచి అప్లికేషన్లకు ఆహ్వానించింది.

ఇప్పటికే దేశీయంగా తయారయ్యే మద్యం బ్రాండ్లలో 95 శాతం కార్పొరేషన్ తో రిజిస్టర్ అయిన నేపథ్యంలో మిగిలిన బ్రాండ్లు అప్లై చేస్తాయని భావించారు. ఆసక్తికరమైన అంశం ఏమంటే.. గడువు ముగిసేనాటికి ఏకంగా 37 బ్రాండ్లు దరఖాస్తు వేస్నుకున్నాయి. ఇందులో 15 విదేశీ మద్యం బ్రాండ్లు కాగా మరో 15దేశీయ మద్యం



బ్రాండ్లు. ఏడు అప్లికేషన్లు బీర్ల సరఫరాకు ముందుకు వచ్చాయి.

ఇక్కడో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. నోటిఫికేషన్ లేకుండా కొత్త బ్రాండ్ల సరఫరా కోసం అనుమతి ఇవ్వటం ఏమిటంటూ ప్రభుత్వం మీద విమర్శలు చేసి.. వివాదాస్పద జాబితాలోకి ఎక్కిన సోం డిస్టలరీస్ కూడా ఈ జాబితాలో ఉన్నట్లుగా చెబుతున్నారు. బీర్ తో పాటు లిక్కర్ సంస్థలు కూడా అప్లికేషన్ పెట్టిన వైనం బయటకు వచ్చింది. మొత్తం ఫార్మాలిటీస్ పూర్తి చేసేందుకు నెల రోజులు పడుతుందని చెబుతున్నారు. అదే సమయంలో లిక్కర్ బేసిక్ ధరల్ని పెంచాలన్న దానిపై కసరత్తు జరుగుతోంది. అదే జరిగితే.. మద్యం ధరలు పెరిగే అవకాశం ఉందన్న వ్యాఖ్య వినిపిస్తోంది.

# అనూహ్యంగా యాదాద్రి ఆలయంలో మెరిసిన మిస్ వరల్డ్

**యాదగిరిగుట్ట :**మిస్ వరల్డ్- 2024 టైటిల్ ఎగురేసుకెళ్లిన చెక్ రిపబ్లిక్ సుందరి క్రిస్టినా పిజ్కోవా.. తెలంగాణలో ప్రత్యక్షం అయ్యారు. యా దాద్రి భువనగిరి జిల్లాలో ప్రఖ్యాతి చెందిన యాదగిరిగుట్ట లక్ష్మీనంసింహ స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలా చీరెకట్టు..



బొట్టుతో మెరిసిపో యారు .ప్రపంచ పర్యటనలో భాగంగా భారత్‌కు వచ్చారామె. తెలంగాణలో అడుగు పెట్టారు. ఈ ఉదయం యాదగిరిగుట్ట లక్ష్మీనారసింహుడి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ నిర్మాణ శైలికి ముగ్ధులయ్యారు. యాదగిరిగుట్టను సందర్శించడం ఆనందాన్ని ఇస్తోందని, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మించారంటూ ప్రశంసించారు. ఆలయాన్ని సందర్శించడం మనశ్శాంతిని కలిగించిందంటూ వ్యాఖ్యానించారు.ఈ ఏడాది మే 7 నుండి 31వ తేదీ వరకు మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యాన్ని ఇవ్వనుంది తెలంగాణ. భారత్ సహా ప్రపంచం నలుమూలల నుండి 120కి పైగా దేశాలకు చెందిన యువతులు ఇందులో పాల్గొనబోతోన్నారు. తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ఇది 72వ ఎడిషన్. మిస్ వరల్డ్ ప్రారంభం, ముగింపు వేడుకలు, గ్రాండ్ ఫినాలే మొత్తం హైదరాబాద్‌లోనే ఉండబోతోంది.దీనికి సంబంధించిన ఓ అధికారిక ప్రకటనను మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్‌పర్సన్, సీఈఓ జూలియా మోర్లే ఇదివరకే విడుదల చేసిన విషయం తెలిసిందే. తెలంగాణ పర్యాటక మంత్రిత్వ శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్‌ను సైతం కలిశారు. తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం కావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు.దీనికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించడంలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చారు క్రిస్టినా పిజ్కోవా. యాదాద్రి ఆలయాన్ని సందర్శించారు. ఇది ఆరంభం మాత్రమేనని, తెలంగాణ, ఇక్కడ నిక్షిప్తమై ఉన్న రత్నాల్లాంటి అద్భుత ప్రదేశాలను చూడటానికి ఆతృతతో ఎదురు చూస్తున్నానంటూ వ్యాఖ్యానించారు.

# ఏపీలో 50 ఏళ్లకే పెన్షన్ పై మంత్రి కొండపల్లి కీలక ప్రకటన..

**అమరావతి :**ఏపీ శాసనమండలిలో మరో కీలక అంశం నేడు ప్రస్తావనకు వచ్చింది. పెన్షనర్ల తగ్గింపు, 50 ఏళ్లకే పెన్షన్ హామీపై వైసీపీ సభ్యులు కూటమి ప్రభుత్వానికి ప్రశ్నలు సంధించారు. ఈ క్రమంలోనే వారి ప్రశ్నలపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పందించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే రూ. 4 వేల చొప్పున పెన్షన్ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వం వెయ్యి రూపాయలు పెన్షన్ పెంచడానికి ఐదేళ్లు టైమ్ తీసుకుంటే.. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే వెయ్యి రూపాయలు పెంచామని గుర్తు చేశారు. ప్రస్తుతం అనర్హుల పెన్షన్లనే తొలగిస్తున్నామని క్లారిటీ ఇచ్చారు.ప్రస్తుతం 60 ఏళ్ల వయసు, ఆపై దాటిన వారికి సామాజిక పెన్షన్లు అందుతున్నాయి. అయితే 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ 4 వేలు పెన్షన్ అందిస్తామని నాడు ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ



ఇచ్చారు. అందుకోసం అర్హులైన నిరుపేదలు అందరికీ సామాజిక భద్రతా పింఛనులు అందేలా చూసేందుకై మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటుకు కూడా కృషి చేశారు. ఈ క్రమంలోనే పలువురు అనర్హులు పెన్షన్లు అందుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. దాంతో జిల్లాల వారీగా వీరి లెక్కలను ప్రభుత్వం సేకరించింది. అర్హత లేకపోయినా పెన్షన్లు అందుకుంటున్న వారిని గుర్తించి పెన్షన్లను తొలగిస్తున్నారు.రాష్ట్రంలో 50 నుండి 60 ఏళ్ల మధ్య ఉన్న వారు దాదాపు 15 లక్షలుగా ఉన్నట్లు గుర్తించారు. అయితే వారికి పింఛను అందజేసే విధానం పైన ఒక కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి ఇప్పటికే నిర్దేశించారు. ఇందు కోసం అధికారులు, మంత్రులకు కూడా బాధ్యతలు కేటాయించారు.

ఇక ఇప్పుడు మంత్రి ప్రకటనతో త్వరలోనే రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే రూ. 4 వేల చొప్పున పెన్షన్ ఇవ్వడం గ్యారంటీ అని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.అంతకు ముందు వైసీపీ అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రంలో 53 లక్షల మందికి పెన్షన్‌లు ఉన్నాయని.. కానీ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చే సమయానికి 65 లక్షలకు పెన్షన్లు పెంచామని.. వైసీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ తెలిపారు. యాభై ఏళ్లకే పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి.. ప్రభుత్వం వచ్చి 10 నెలలు గడుస్తున్నా ఇంతవరకూ ఏ ప్రతిపాదన చేయలేదని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేరొన్నారు.

# విజయసాయిరెడ్డికి మరో షాక్ మళ్లీ సీఐడీ పిలుపు

**కాకినాడ :**ఏపీలో రాజకీయాలకు గుడ్ బై చెప్పేసినా మాజీ వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డిని పాత కేసులు వెంటాడుతున్నాయి. గతంలో కాకినాడ పోర్టు వాటాల బదిలీకి యజమానుల్ని బెదిరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న విజయసాయిరెడ్డిని ఇప్పటికే ఓసారి విచారించిన సీఐడీ అధికారులు.. మరోసారి విచారణకు రావాలని ఇవాళ నోటీసులు



పంపారు. దీంతో సాయిరెడ్డి మరోసారి విచారణకు హాజరయ్యేందుకు సిద్దమవుతున్నారు.గత వైసీపీ ప్రభుత్వంలో కాకినాడ పోర్టు యజమాని కేవీరావును బెదిరించి తన బంధువులకు వాటిని రాయించుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న విజయసాయిరెడ్డిని ఈ నెల 25న మరోసారి విచారణకు రావాలని సీఐడీ నోటీసులు పంపింది. కాకినాడ పోర్టుతో పాటు సెజ్ వ్యవహారంలోనూ ఆయన్ను ప్రశ్నించాల్సి ఉందని సీఐడీ తెలిపింది. ఈ వ్యవహారంలో విజయసాయిరెడ్డితో పాటు మొత్తం ఆరుగురిపై సీఐడీ కేసు నమోదైంది.దీనిపై గతంలో విచారణకు హాజరైన విజయసాయిరెడ్డిని సీఐడీ అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. అయితే విచారణ తర్వాత అవసరమైతే మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని చెప్పి పంపారు. అలాగే ఈ విచారణలో విజయసాయిరెడ్డి కాకినాడ పోర్టు వాటాల వ్యవహారంతో తనకు అస్సలు సంబంధం లేదని, దీనికి కర్త, కర్మ, క్రియ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డేనని సీఐడీకి చెప్పారు. ఈ విషయం విచారణ తర్వాత బయటికి వచ్చి మీడియాతో కూడా వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఈసారి విచారణలో బయటపెట్టబోతున్నారనేది ఉత్కంఠ రేపుతోంది.

# పోలీస్ అయిఉండి బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్.. ఊహించని షాక్..



**పంజాగుట్ట :**మలయాళంలో సూపర్ హిట్ అయిన రేఖ చిత్రం అనే సినిమాలో హీరో బెట్టింగ్ ఆడి లక్షలు గెలుస్తాడు. ఈ విషయం అధికారులకు తెలిసి కొన్ని నెలలు సస్పెండ్ చేస్తారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌తో పాటు సాధారణ జనం కూడా అతడ్ని వింతగా చూస్తారు. ఇదంతా ఎందుకు చెబుతు న్నానంటే.. నిజ జీవితంలోనూ ఓ కానిస్టేబుల్ బెట్టింగ్ యాప్స్ కారణంగా ఇబ్బందుల్లో పడ్డాడు. ఇప్పుడు ఉద్యోగం కూడా పోయే పరిస్థితి వచ్చింది. హబీబ్‌నగర్ పీఎస్‌లో పనిచేస్తున్న కిరణ్ గౌడ్ బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేశాడు. అది కూడా యూనిఫామ్ వేసుకుని మరీ బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేశాడు. అంతటితో ఆగకుండా టెలిగ్రామ్ ఛానల్‌లో బెట్టింగ్ యాప్స్ టిప్స్ కూడా చెప్పటం మొదలెట్టాడు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిసింది. కిరణ్ గౌడ్‌పై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.బెట్టింగ్ యాప్స్‌పై ఉక్కుపాదం..తెలంగాణ పోలీసు శాఖ బెట్టింగ్ యాప్స్‌పై ఉక్కుపాదం మోపుతోంది.

న్యూస్-9 సామాజిక అవసరం....సామాన్యుడి ఆయుధం తెలుగు దినపత్రిక
www.news9-india.com
news9.india News9India_ news9telugudaily

## ఆ విషయంలో ఏపీకి ఫస్ట్ ర్యాంక్, సెకండ్ ప్లేస్ లో తెలంగాణ.. నేతలు సిగ్గుపడాలి




**అమరావతి** :ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మొదటి ర్యాంక్.. తెలంగాణకు రెండవ ర్యాంక్ చెప్పుకో వడానికి బాగానే ఉన్న.. అసలు ఏ విష యంలో ఈ ర్యాంకులు వచ్చాయో తెలిస్తే మాత్రం ప్రజలు, నాయకులు ఖచ్చితంగా సిగ్గుపడాలి. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్ ( ఏడీఆర్ ) రిపోర్ట్ ప్రకారం తెలుగు రాష్ట్రాలు టాప్ లో నిలిచాయి. ఎన్నికల సమ యంలో నేతలు సమర్పించిన ప్రకారం.. దేశంలోని ఎమ్మెల్యేలలో 45 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని పేర్కొంది. 28 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 1,861 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు వెల్లడించింది. ఈ మేరకు రూపొందించిన డేటలో దేశవ్యాప్తంగా మొత్తం 4123 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వారిలో 24 మంది సభ్యుల అఫిడవిట్లు సరిగ్గా స్కాన్ చేయలేదని.. వాటి కారణంగా వాటిని విశ్లేషించలేదని ప్రకటించింది. ఇక మిగిలిన 4092 మంది ఎమ్మెల్యేల్లో 1,861 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు తేల్చింది. దాదాపు ఇది 45 శాతం వరకు వస్తుండగా.. అందులో 29 శాతం ఎమ్మెల్యేలపై హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు లాంటి తీవ్ర అభియోగాలు ఉన్నట్టు రిపోర్టులో స్పష్టం చేసింది. ఇక 28 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో అత్యధిక కేసులున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. ఏపీలోని 175 ఎమ్మెల్యేల్లో ఏకంగా 138 మందిపై క్రిమినల్ అభియోగాలు ఉన్నాయి. దాదాపు ఇది 79 శాతానికి సమానం. అలానే రెండో స్థానంలో కేరళ-తెలంగాణలు సంయుక్తంగా ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లో దాదాపు 69 శాతం మంది ఎమ్మెల్యేలపై కేసులున్నాయి. 66 శాతంతో బీహార్ మూడో స్థానంలో నిలవగా.. 65 శాతంతో మహారాష్ట్ర నాలుగో స్థానం దక్కించుకుంది. ఐదవ స్థానంలో 59 శాతంతో తమిళనాడు ఉంది.

చిన్న కేసు ఉంటేనే ప్రభుత్వ ఉద్యోగాలకు కూడా ఎలిజిబుల్ కానీ ఈరోజుల్లో.. ప్రజలను పాలంచే నాయకులకు మాత్రం ఈ వెసులుబాటు ఎందుకని విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రజలకు ఆదర్శంగా నిలబడాల్సిన నాయకులు పోయి.. కేసులున్న వారే రూలింగ్ చేస్తున్నారని మండిపడుతున్నారు. ఒకప్పుడు రాజకీయాల్లో మచ్చ లేకుండా ప్రజాసేవకే అంకితం అయిన నేతలు ఉంటే ఇప్పుడు మాత్రం ఈ పరిస్థితి ఏర్పడింది అని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## గుంటూరులో అరుదైన ఘటన.. ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలకు జన్మ



**గుంటూరు** :గుంటూరులోని సిటిజన్ హాస్పిటల్ వైద్యులు మెడికల్ మిరాకిల్ చేసి చూపించారు. పెళ్లి జరిగి ఐదేళ్లు అవుతున్న పిల్లలు లేక ఇబ్బందులు పడుతున్న మహిళకు పిల్లలు కలిగేలా చేశారు. ఇక్కడ మరో విశేషం ఏంటంటే ఒకే కాన్పులో ముగ్గురు ఆడ పిల్లలకు ఆమె జన్మనివ్వడం. మహిళ, పిల్లలు ఆరోగ్యంగా ఉండడంతో వారి కుటుంబం ఫుల్ ఖుషి అవుతున్నారు. ప్రస్తుతం ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాదుకు చెందిన పద్మావతికి ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే వివాహం జరిగినప్పటి నుంచి పిల్లలు లేకపోవడంతో మానసికంగా ఆవేదన చెందుతుంది. ఈ క్రమంలోనే పలు హాస్పిటల్స్ కూడా తిరిగి ఇబ్బందులు పడింది. కానీ ఆమెకు మాత్రం పిల్లలు పుట్టలేదు. అయితే గుంటూరు సిటిజన్ హాస్పిటల్ లో ప్రముఖ డాక్టర్ భాగ్యలక్ష్మి దగ్గర సంప్రదించగా ఆమె పరివేక్షణలో వైద్య సేవలను పొందుతూ గర్భం దాల్చింది. ముగ్గురు ఆడశిశువుల్లో ఇద్దరు 1.5 కేజీలు, ఒక శిశువు 1.4 కేజీలు ఉన్నట్లు చెప్పారు. గత ఆదివారం నాడు ఆమె ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చినట్టు తెలుస్తోంది. గత ఐదేళ్లుగా పిల్లలు లేని మహిళకు ఇప్పుడు ఒకే కాన్పులో మగ్గురు జన్మించడం అద్భుత సంఘటన ఒబెస్ట్రిక్ అండ్ గైనకాలజీ డాక్టర్ ఎస్ భాగ్యలక్ష్మి తెలిపారు. పిల్లలు లేక ఇబ్బందులు పడుతున్న వారికి గుంటూరు సిటిజన్ హాస్పిటల్ లో అత్యాధునిక వైద్య సౌకర్యాలతో చికిత్స అందిస్తున్నామని ఆమె చెప్పారు. ఇటువంటి క్లిష్టమైన ఆపరేషన్ లో సహకారం అందించిన పీడియాట్రిషన్ డాక్టర్ రాజాని, హాస్పటల్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. మహిళ గర్భం దాల్చే సమయంలో బహుళ అండాలు ఏకకాలంలో ఫలదీకరణం చెందడం వల్ల ఒకే కాన్పుల్లో ఎక్కువ మంది శిశువులు జన్మిస్తారని డాక్టర్లు తెలిపారు. జన్యుపరమైన కారణాల వల్ల కూడా ఇలా జరగవచ్చని చెప్పారు. ఒకే కాన్పుల్లో ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలు పుట్టడం సాధారణమని, అయితే ముగ్గురు కంటే ఎక్కువ మంది పిల్లలు పుట్టడాన్ని పాలీజైగోటిక్ అంటారని స్పష్టం చేశారు.

## గుంటూరు, రాజమండ్రి, కాకినాడ, విశాఖ ప్రయాణికులకు రైల్వే అలర్ట్

**గుంటూరు** :ఏపీలోని నాలుగు కీలక రైల్వే స్టేషన్లు గుంటూరు, రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే అలర్ట్ జారీ చేసింది. ఈ నాలుగు స్టేషన్ల మధ్య రాకపోకలు సాగించే 8 రైళ్లను తాత్కాలికంగా ఈ నెల 23, 24 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఈ 8 రైళ్లు ఏయే తేదీల్లో ఈ స్టేషన్ల మధ్య రాకపోకలు సాగించడం లేదో, అందుకు గల కారణాలేంటో పేర్కొంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీలోని కాకినాడ పోర్టు-విశాఖపట్నం మధ్య నడిచే 17267 నంబర్ ఎక్స్ ప్రెస్ రైలును మార్చి 24వ తేదీన రద్దు చేశారు. అలాగే విశాఖ నుంచి కాకినాడ పోర్టుకు వచ్చే 17268 రైలును కూడా అదే రోజు రద్దు చేశారు. అలాగే రాజమండ్రి-విశాఖపట్నం మధ్య నడిచే 67285 రైలును ఈ నెల 24న రద్దు చేశారు. అలాగే విశాఖపట్నం-రాజమండ్రి రైలు నంబర్ 67286 రైలు కూడా అదే రోజు రద్దయింది. "జనసేనకు సర్వే నిపుణుడి షాక్- మిమ్మల్ని



గెలిపించింది ఆయనే..! తాజా విశ్లేషణ..!"

విశాఖపట్నం-గుంటూరు మధ్య నడిచే 22875 నంబర్ ఉదయ్ ఎక్స్ ప్రెస్ రైలును 24వ తేదీన నడిచే రైలు కూడా రద్దయింది. అలాగే గుంటూరు-విశాఖ మధ్య నడిచే 22876 నంబర్ ఉదయ్ ఎక్స్ ప్రెస్ రైలు కూడా అదే రోజు రద్దయింది. అలాగే గుంటూరు-విశాఖ మధ్య నడిచే 17239 నంబర్ సింహాద్రి ఎక్స్ ప్రెస్, అలాగే విశాఖ నుంచి గుంటూరుకు వెళ్లే 17240 సింహాద్రి ఎక్స్ ప్రెస్ రైళ్లను ఈ నెల 23, 24 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. విజయవాడ డివిజన్ పరిధిలోని సామర్లకోట, పిఠాపురం, గొల్లప్రోలు, రావికంపాడు సెక్షన్ల మధ్య జరుగుతున్న ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ పనుల కారణంగా ఈ రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ పనులు పూర్తి కాగానే తర్వాత రోజు నుంచి ఈ రైళ్లు తిరిగి యథావిధిగా రాకపోకలు సాగిస్తాయి.

# మహారాష్ట్ర వదలని ఔరంగజేబు.. తాజా లొల్లి ఏమంటే



**మహారాష్ట్ర** :కొద్దిరోజులుగా మహారాష్ట్రలో నడుస్తున్న రాజకీయం మొత్తం ఔరంగజేబు చుట్టూ తిరుగుతోంది. మరాఠాల మీద అధిప త్యం కోసం ఔరంగజేబు ప్రయత్నించటం.. అందులో భాగంగా శివాజీ మహారాజ్.. ఆయన కొడుకు శంభాజీ మహారాజ్ ను హతమార్చినప్పటికీ.. ఆయన కలలు కన్న మరాఠా నేల మాత్రం పాదాక్రాంతం కాకపోవటం.. చివరకు శంభాజీ మహారాజ్ సతీమణి చేసిన శపథానికి తగ్గట్లే.. మరాఠా పొలిమేరలు దాటకుండానే ఔరంగజేబు చనిపోయిన ఉదంతం తెలిసిందే. అప్పుడెప్పుడో వందల ఏళ్ల క్రితం జరిగిన చరిత్రను బాలీవుడ్ సంచలన మూవీ 'చావా' చిత్రం కారణంగా చరిత్ర కాస్తా వర్తమానంలో వచ్చి కూర్చుంది. సహజంగానే భావోద్వేగ చిత్రం కావటం.. మరాఠాయేతర ప్రాంతాల్లోనే తీవ్రమైన భావోద్వేగాన్ని రగిల్చిన ఆ మూవీ.. మహారాష్ట్రలో ఎలాంటి భావావేశాలకు గురి చేస్తుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చావా చిత్రం కారణంగా ఔరంగజేబు వర్తమాన రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. అతడి పాలన మీద మొదలైన వ్యాఖ్యలు.. పలు రాజకీయ పరిణామాలకు వేదికగా మారాయి. కొత్త ఉద్రిక్తతలకు తెర తీశాయి. చివరకు అవెక్కడి వరకు తీసుకెళ్లాయంటే..ఆ రాష్ట్రంలోని ఔరంగజేబు సమాధి వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసే వరకు. దీంతో గతంలో మాదిరి అందరిని అనుమతించటం కూడా నిలిపేశారు. సమాధిని సందర్శించాలని భావించే వారు ముందుగా రిజిస్టర్ లో తమ వ్యక్తిగత వివరాల్ని.. ఆధార్ కార్డుల్ని చూపించిన తర్వాతే అనుమతిస్తున్న పరిస్థితి. మరాఠాల్లో తీవ్రమైన భావోద్వేగాన్ని రగిలించిన చావా మూవీతో.. ఔరంగజేబు పాలనపై మొదలైన చర్చ.. రాజకీయ వేడిని రగిలించింది. ఇప్పటి వేసవికి మించిన మంటల నేపథ్యంలో.. మహారాష్ట్ర ముఖ్యమంత్రి.. బీజేపీ సీనియర్ నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్ ను ఔరంగజేబుతో పోలుస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై కమలనాథులు కోపంతో ఉన్నారు. ఒక క్రూరమైన రాజు.. అందునా ముస్లిం మహారాజును తమ నాయకుడిగా అభివర్ణించటాన్ని సీరియస్ గా తీసుకున్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్న మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కాల్ తీవ్రంగా స్పందిస్తున్నారు. ఔరంగజేబు ఒక క్రూరమైన పాలకుడిగా పేర్కొంటూ.. ఫడ్నవీస్ కూడా ఔరంగజేబుకు ఉన్న లక్షణాలు ఉన్నాయని.. ఆయన ఎప్పుడూ మతపరమైన అంశాలకే ప్రాధాన్యం ఇస్తున్నారే తప్పించి.. రాష్ట్రానికి ఏమీ చేయటం లేదని మండిపడుతున్నారు. రాష్ట్రంలో హత్యకు గురైన సర్పంచ్ సంతోష్ దేశ్ ముఖ్ తరహా అంశాలకే ఆయన ప్రాధాన్యతను ఇస్తున్నట్లుగా చెబుతున్నారు. అందుకు ఆయన్ను ఔరంగజేబుతో పోలిస్తే తప్పేంటి? అని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. పబ్లిక్ లో ఏది మాట్లాడితే అది మాట్లాడతానంటే కుదరదని.. ముఖ్యమంత్రి అద్భుతంగా పాలిస్తుంటే.. ఆయన్ను ఔరంగజేబుతో పోలుస్తారా? అంటూ మండిపడుతున్నారు. సప్కాల్ వ్యాఖ్యలు మహారాష్ట్రకే అవమానమని.. ఆయనపై కేసు నమోదు చేయాలని.. కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. సప్కాల్ మీద తీసుకునే చర్యలు వేరే వారికి గుణపాఠంగా మారాలని కోరుతున్నారు. మొత్తంగా ఔరంగజేబు మహారాష్ట్ర రాజకీయాల్ని నేటికి ప్రభావితం చేస్తున్న వైనం ఆసక్తికరంగా మారింది.

# పాపం సుబ్రహ్మణ్యం.. పాములు ఇతడి మీద పగబట్టాయా

**చిత్తూరు జిల్లా** :కొన్ని ఉదంతాలు ఎందుకు చోటు చేసుకుంటాయో కూడా అర్థం కాదు. ఇప్పుడు చెప్పేది కూడా ఆ కోవలోకే. ఈ మొత్తం చదివిన తర్వాత ఆశ్చర్యపోవటమే మిగులుతుంది. లాజిక్ కు అందని ఈ ఉదంతంలోకి వెళితే.. చిత్తూరు జిల్లా (బైరెడ్డిపల్లె మండలం)కు చెందిన యాభై ఏళ్ల సుబ్రహ్మణ్యం జీవితంలో మిగిలిన వారికి చాలా భిన్నం. చదువు లేని అతడు కూలి పనులకు వెళ్తుంటాడు. రెక్కాడితే కానీ డొక్కాడని సాదాసీదా బడుగు జీవి. అయితే.. ఇతగాడు ఎక్కడకు వెళ్లినా.. ఏ పని చేసినా.. ఏదోలా పాములు అతడ్ని కాటేస్తుంటాయి. ఏదో నాలుగైదు సార్లు అనుకుంటే తప్పులో కాలేసినట్లే. ఇప్పటికి పదుల సంఖ్యలో పాముకాట్ల బారిన పడ్డాడు. అంతేనా.. ఈ పాముల దెబ్బకు ఊరు విడిచి బెంగళూరుకు వలస వెళ్లాడు. అక్కడ కూడా పాములు అతడ్ని వదల్లేదు. ప్రతిసారీ పగబట్టినట్లుగా పాములు అతడ్ని కరవటం..



ఆ వెంటనే ఆసుపత్రికి వెళ్లటం.. చికిత్స చేసుకొని బతుకు జీవుడా అని ఇంటికి రావటం రివాజుగా మారింది. ఇతడి దయనీయ పరిస్థితిని చూసినోళ్లు.. సర్పదోష నివారణ.. రాహు కేతు పూజలు.. పరిహారాలు చేయించారు. అయినా.. అతడి పరిస్థితుల్లో మార్పు లేదు. అతడికి 20 ఏళ్ల వయసులో తొలిసారి పాము కరిచింది. కట్ చేస్తే.. అప్పటి నుంచి ఈ ముప్ఫై ఏళ్లలో పదుల సంఖ్యలో పాములు కాటు వేస్తున్న దుస్థితి. పాముల భయంతో ఊరు వదిలి బెంగళూరు వెళ్లి.. అక్కడ భవన నిర్మాణ.. మట్టి పనుల్లో చేరాడు. అక్కడా పాములు వదల్లేదు. దీంతో చికిత్స చేయించుకొని మళ్లీ ఊరికి వచ్చాడు. స్థానికంగా ఉన్న కోళ్ల పరిశ్రమలో పనికి కుదిరాడు. అప్పుడప్పుడు పొలం పనులకూ వెళుతుంటాడు. తాజాగా రెండు రోజుల క్రితం ఊరి సమీపంలో పనులు చేస్తుండగా.. మరోసారి పాము కరిచింది. దీంతో.. ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తరచూ కరుస్తున్న పాముల కారణంగా అతడి ఆర్థిక పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఏం చేయాలో పాలుపోవట్లేదని.. ఎక్కడే సుబ్రహ్మణ్యం అని వెతికి మరీ తున్నాడు.

# టీడీపీ, జనసేనతో కలిస్తే బీజేపీకి నష్టమా



**హైదరాబాద్:** తెలంగాణలో సంకుల సమరం నడుస్తోంది. ప్రధానంగా మూడు పార్టీలు అధికారం కోసం ఆరాటపడుతున్నాయి. బీఆర్ఎస్ ఇప్ప టికే అధికారం సాధించగా.. ఆ పార్టీపై వ్యతిరేకతతో కాంగ్రెస్ కు అధికారం దక్కింది. ఇప్పుడు కాంగ్రెస్ పై వ్యతిరేకతను సొమ్ము చేసుకోవాలని బీజేపీ బలంగా ప్రయత్నిస్తోంది. వచ్చేసారి అధి కారం సంపాదించాలని చూస్తోంది. అయితే ఏపీలోలాగా టీడీపీ, జనసేనతో కలిసి వెళితే తెలంగాణలో జట్టు కడితే బీజేపీ అధి కారం దక్కుతుందని ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై బీజేపీ ఎమ్మెల్యే సంచలన కామెంట్స్ చేశారు. అవి ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. తెలంగాణ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ముఖ్యంగా బీజేపీలో నెలకొన్న అంతర్గత సంక్షోభాన్ని, భిన్నాభిప్రాయాలను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఆయన చేసిన ప్రతి వ్యాఖ్య ఒక నిర్దిష్టమైన రాజకీయ కోణాన్ని స్పృశిస్తూ, రాబోయే రోజుల్లో తెలంగాణ బీజేపీ ఎదుర్కొనే సవాళ్లను సూచిస్తోంది. -జనసేన, టీడీపీతో పొత్తు: బీజేపీకి నష్టమా పైడి రాకేష్ రెడ్డి జనసేన, టీడీపీతో పొత్తు పెట్టుకుంటే బీజేపీకి నష్టం జరుగుతుందని కుండబద్దలు కొట్టినట్లు చెప్పడం గమనార్హం. ఇది బీజేపీలో ఒక వర్గం యొక్క అభిప్రాయాన్ని ప్రతిబింబిస్తోంది. అంతరాష్ట్ర వ్యవహారాల్లో ఇబ్బందులు తలెత్తుతాయని, బీఆర్ఎస్ వంటి పార్టీలకు లబ్ధి చేకూరుతుందని ఆయన వాదన. కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం ఈ వాదనకు మరింత బలం చేకూరుస్తోంది. ఈ వ్యాఖ్యలు బీజేపీ యొక్క కేంద్ర నాయకత్వం పొత్తు వ్యూహాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. తెలంగాణలో బీజేపీ సొంతంగా బలపడాలని కోరుకుంటున్న వర్గం ఉందా? లేక పొత్తుల ద్వారా అధికారం చేపట్టాలని భావిస్తున్నారా? అనే చర్చకు ఈ వ్యాఖ్యలు తెరలేపుతున్నాయి. ఒకవేళ బీజేపీ ఈ పొత్తును కొనసాగిస్తే, పైడి రాకేష్ రెడ్డి వంటి నాయకులు పార్టీలో అసంతృప్తితో ఉండే అవకాశం ఉంది. - రాజాసింగ్ వ్యాఖ్యలపై స్పందన: అంతర్గత విభేదాలు బహిర్గతంరాజాసింగ్‌ను ఉద్దేశిస్తూ పైడి రాకేష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తికరంగా ఉన్నాయి. "తెలంగాణ ప్రజలకు పాత ఇనుప సామాను అంటే ఎవరో బాగా తెలుసు" అంటూ రాజాసింగ్ వ్యాఖ్యలను పరోక్షంగా విమర్శించినట్టైంది. పార్టీ అంతర్గత విషయాలను బహిరంగంగా మాట్లాడకూడదని, సరైన వేదికపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలని ఆయన సూచించడం, పార్టీలో క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో రాజాసింగ్‌ను తెలంగాణ బీజేపీకి ఆస్తి వంటి నాయకుడిగా అభివర్ణించడం ద్వారా, ఆయనను పూర్తిగా విమర్శించకుండా, ఒక సమతూల్యమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసే ప్రయత్నం చేశారు. అయితే ఈ వ్యాఖ్యలు బీజేపీలో అంతర్గత విభేదాలు ఉన్నాయని, ఒకరి అభిప్రాయాలతో మరొకరు ఏకీభవించడం లేదని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. - పార్టీ అధ్యక్ష పదవి: నాయకత్వ మార్పు సూచనలుపార్టీ అధ్యక్ష పదవికి ఈటల రాజేందర్, అరవింద్, రామచందర్ రావు, డీకే అరుణ, రఘునందన్ రావు వంటి వారి పేర్లను ప్రస్తావించడం, ప్రస్తుత అధ్యక్షుడి పనితీరుపై అసంతృప్తి ఉందనే సంకేతాలను ఇస్తోంది. అధ్యక్షుడితో పాటు ఇద్దరు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమిస్తే బాగుంటుందని ఆయన సూచించడం, పార్టీని మరింత సమర్థవంతంగా నడిపించాలనే ఆలోచనను ప్రతిబింబిస్తోంది. ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో ప్రత్యేక ఇన్చార్జ్‌లను నియమించాలనే సూచన, ఆయా ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేయాలనే తపనను తెలియజేస్తోంది. -కాంగ్రెస్ అస్థిరతను సూచిస్తోంది.

## అవును.. ఈసారి పోలీసుల మీదనే వైసీపీ కార్యకర్తల రాళ్లదాడి

**ఎన్టీఆర్ జిల్లా** :తెలుగు రాష్ట్రాల్లో అధికారపార్టీ నేతలు.. కార్య కర్తల అత్యుత్సాహానికి సంబంధించిన ఉదంతాలు తరచూ తెర మీదకు వస్తుంటాయి. పలు సందర్భాల్లో ఈ అత్యుత్సాహం పార్టీకి.. ప్రభుత్వానికి తలనొప్పిగా మారి.. వారిని నియం త్రించేందుకు కిందా మీదా పడుతుంటాయి. అయితే.. ఏపీలో సీన్ కాస్త తేడాగా ఉన్న పరిస్థితి. సార్వత్రిక ఎన్నికల్లో విపక్ష హోదా దక్కని వైసీపీ నేతలు.. కార్యకర్తలు కొందరు చేస్తున్న ఇష్టారాజ్య పరిస్థితులు ఇప్పుడు సంచలనంగా మారుతున్నాయి. తరచూ చర్చనీయాంశాలుగా మారుతున్నాయి. మొన్నటికి మొన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత జిల్లాలో టీడీపీ కార్యకర్తను కత్తితో నరికేసి హత్య చేసిన ఉదంతం పెను సంచలనంగా మారింది. ఈ ఉదంతానికి ముందు సదరు కార్యకర్త తనకు ప్రాణహాని ఉందని పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్న విమర్శల నేపథ్యంలో ఇద్దరు పోలీసుల్ని సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

కట్ చేస్తే.. తాజాగా ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులో పోలీసులపై రాళ్లదాడికి తెగబడిన వైసీపీ కార్యకర్తల వైనం



షాకింగ్ గా మారింది. తిరునాళ్లలో పోలీసులపై అనూహ్యంగా జరిగిన రాళ్లదాడిలో నలుగురు పోలీసులు గాయపడ్డారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారమే ఈ దాడి జరిగిందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. రాళ్ల దాడిలో గాయపడిన పోలీసుల్ని ఆసుపత్రికి తరలించారు. రాళ్లదాడిలో జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు తలకు బలమైన గాయాలు అయినట్లుగా చెబుతున్నారు. ఈ దాడిలో పోలీసులతో పాటు కొందరు టీడీపీ కార్యకర్తలు సైతం గాయపడ్డారని తెలుస్తోంది. ఈ సందర్భంగా గత ఏడాది జరిగిన తిరునాళ్ల వేళలోనూ జరిగిన దాడులను గుర్తు చేసుకుంటున్నారు. గత ఏడాది ఇంచుమించే ఇదే సమయంలో తిరుపతమ్మ అమ్మవారి తిరునాళ్ల జరగటం.. అమ్మవారు పుట్టిళ్లు అనిగండ్లపాడు నుంచి పెనుగంచిప్రోలు వరకు బండ్ల ఉత్సవం సాగింది. ఈ సందర్భంగా జరిగిన దాడులతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో డీజేపీ.. పార్టీ జెండాల రంగులపైనా బ్యాన్ విధించారు. కట్టుదిట్టమైన మారాయి.

# ప్రతిష్టాత్మక కామధేను ప్రాజెక్టుకు సోమశిల జలాలు కేటాయించాలి.. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల



**ఉదయగిరి:** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం కొండాపురం మండలంలో చింతల దీవి గ్రామంలో నేషనల్ కామధేను బ్రీడింగ్ సెంటర్ ( NK BC%) 2015లో అప్పటి ఉపరాష్ట్రపతి రెండుసార్లుఈ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పనిచేసిన వెంకయ్య నాయుడు ద్వారా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకు%శీ%దనీ 1918లో బ్రిటిష్ కాలం లో ఈ ఫామ్ 2500 ఎకరాల్లో ఏర్పాటు చేయడం జరిగిందని దాంట్లో 1985 కాంపోజిట్ లైఫ్ స్టార్ ఫామ్ ఏర్పాటుచేసి ప్రఖ్యాతిగాంచిన నెల్లూరు జుడిపి బ్రిడ్ దాదాపు 968 మరియు ఒంగోలు క్యాటిల్ 368 వరకు ఉన్నవని ఇంతటి ప్రాధాన్యత గల ఫామ్ కు సమస్యల బెడద ఎక్కువగా ఉందని దేశంలోనే రెండు రాష్ట్రాల్లో ఒకటి మధ్యప్రదేశ్ రెండు ఆంధ్రప్రదేశ్ లో మాత్రమే ఇటువంటి బ్రీడింగ్ సెంటర్లు ఉన్నవని ఇందులో బ్లాక్ క్యాటిల్ 5 బ్రీడ్స్ వైట్ క్యాటిల్ 14 బ్రీడ్స్ ప్రోట్రక్ట్ చేయడం జరుగుతుందనీ దాదాపు 480 బ్రిడ్స్ ఈ ఫామ్ లో ప్రోటక్ట్ చేయడం జరుగుతుందనీ ఇక్కడ ఉన్న ప్రధాన సమస్య నీటి సమస్యని 2015 లో పాం ఏర్పాటు చేసినప్పుడు నీటి సమస్యపై దూరదృష్టితో ఆలోచన చేయలేదని వాటర్ ప్రాజెక్ట్ ప్రారంభమైంది కానీ కొన్ని రాజకీయ కారణాలతో అది ముందు సాగలేదనీ నేను ముఖ్యంగా ఇక్కడ పరిశీలించింది కనీసం మేత కూడా పండించుకోలేని పరిస్థితి 2500 ఎకరాలు ఉన్న మూగజీవాలకు సమృద్ధిగా మేత అందించలేని పరిస్థితిని దానిపై పెద్ద మనసు చేసుకొని సత్వరం చర్యలు తీసుకోవాలని విన్నవించారు ఈ ప్రాజెక్టుకు కూతవేటు దూరంలో రాళ్లపాడు రిజర్వాయర్ ఉందని దానికి మూడున్నర కోట్లు కేటాయిస్తే శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారం చూపగలిగిన వారము అవుతామని మంత్రికి చెప్పారు. ఈ ప్రాజెక్టు విస్తీర్ణం 2500 ఎకరాలు ఇక్కడ బి 3 మోడల్ లేదా బి4 మోడల్ ఫీల్ చేసుకోవచ్చని ఈ ప్రదేశంలో ఒక వెటర్నరీ కాలేజ్ సరైన సౌకర్యాలతో ఏర్పాటు చేయగలిగితే చుట్టుపక్కల ఐదు జిల్లాలలో కాలేజ్ లేదు కాబట్టి మా నియోజకవర్గ రూపురేఖలు మారుతాయని విన్నవించారు అందుకు ఈ ప్రాంతం అన్నివిధాల అనువైనదని మంత్రినీ కోరడం జరిగింది. అన్ని సావధానంగా విన్న మంత్రి సానుకూలంగా స్పందించారని త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు

# బ్యాంకింగ్ పరిశ్రమను స్తంభింప చేస్తాం



**సమ్మె యథాతథం**

**(తాడేపల్లిగూడెం):** బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసంఅనివార్యమైతే బ్యాంకింగ్ కార్యకలాపాలన్నీ స్తంభింపచేస్తామని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ నాయకులు టి వి సూర్యనారాయణ హెచ్చరించారు ఈరోజు ఎస్ బి ఐ మార్కెట్ యార్డ్ శాఖ ఏర్పాటు చెసిన యూ ఎఫ్ బి యూ సమావేశం లో ఆయన మాట్లాడారు. 5 రోజుల పని దినాలు అమలు పరచాలని బ్యాంకుల్లో రిక్రూట్ మెంట్ చేపట్టాలని లేడీస్ స్టాఫ్ కు రక్షణ కలిపించాలని తాత్కాలిక స్వీపర్లను పెర్మనెంట్ చేయాలనీ బాంక్‌ల్లో పెన్షన్ రివిజన్ జరపాలని డిమాండ్ చేశారు.బ్యాంకు ఉద్యోగులు చేస్తున్న సమ్మెను ఐబిఏ / ప్రభుత్వము సమస్యల పరిష్కారం ద్వారా నివారించాలని ఆయన కోరారు.ఎస్ బి ఐ అధికారుల సంఘ జోనల్.కార్యదర్శి జి జవహర్లాల్ ..యూ ఎఫ్ బీ యూ కన్వీనర్ ఎస్ ఎస్ ప్రసాద్, సి బి ఈ నాయకులూ ఎం కిరణ్ .కోఆర్డినేషన్ కమిటీ నాయకు లూ బి ఏడుకొండలు లింగంపల్లి గాంధీ, కనకారావు, ప్రకాష్ కుమార్ ,వీరబాబు పాల్గొన్నారు

సంవత్సరంన్నర పైగా పెండింగ్‌లో వున్న న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బ్యాంకు ఉద్యోగులు మ 24 ,25 తేదీలలో తలపెట్టిన రెండు రోజుల సమ్మె యధాతథంగా కొనసాగు తుందని యూ ఎఫ్ బీయూ నాయకులు తెలిపారు .సమ్మె సంప్రదింపుల పరిష్కారం కోసం ఐ బి ఏ. యూ ఎఫ్ బి యూ ప్రతినిధుల మధ్య ఢిల్లీలో సెంట్రల్ లేబర్ కమీషనర్ సమక్షంలో మంగళవారం జరిగిన సంప్రదింపులు విఫలమవ్వడంతో సమ్మె అనివార్యమైందని సూర్యనారాయణ తెలిపారు.యూ ఎఫ్ బి యూ జాతీయ నాయకులూ ఇచ్చిన పిలుపుమేరకు రెండు రోజుల సమ్మెజరుగుతుందని శని ,ఆదివారాలలో వారాంతపు సెలవులు కారణంగా మొత్తం వరుసగా నాలుగు రోజుల పాటు దేశ వ్యాప్తంగా బ్యాంకింగ్ లావాదేవీలు నిలిచి పోతాయన్నారు. సమ్మె నివారణలో విఫలమైన ఐ బి ఏ ప్రభుత్వాల మొండి వైఖరి వల్లనే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతారన్నారు. 21 న దేశ వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు.

# అవార్డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత సైబర్ నేరాలపై అవగాహన







**రుణాలు పొంది సకాలంలో ఋణలు చెల్లించాలి: బ్యాంక్ సిబ్బంది**




**అనంతసాగరం :** అనంతసాగరం మండలం పరిధిలోని బి అగ్రహారం గ్రామంలో ప్రసాద్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో అవార్డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏపీజీబీ మేనేజర్ సంజీవ్ మాట్లాడుతూ బ్యాంకుల అందించే సామాజిక భద్రత పథకాలు అయిన పీఎం ఎస్బివై,పిఎం జె జె బి వై, పీఎం ఏపీ వై, సుకన్య సమృద్ధి వంటి పథకాలలో చేరి ఆర్థిక భరోసా పొందవలసినదిగా కోరారు. హెచ్ ఓ రాజశేఖర్ మాట్లాడుతూ సైబర్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఏపీజీబీ రిటైర్ మేనేజర్ సూర్య ప్రకాష్ మాట్లాడుతూ అందరూ బ్యాంకు ఖాతా ద్వారా ప్రభుత్వం అందించే పథకాలను వినియోగించుకుని ఆర్థిక అభివృద్ధిని సాధించాలని కోరారు.ఎఫ్ పి ఓ చైర్మన్ అంకిరెడ్డి, బి ఓ డి సుబ్బారావు మాట్లాడుతూ బ్యాంకులు రైతులకు విద్యార్థులకు మహిళలకు రుణాలు అందిస్తున్నాయి వాటిని వినియోగించుకొని లబ్ధి పొంది తిరిగి రుణం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏపీజీబీ మేనేజర్ సంజీవ్, హెచ్ ఓ రాజశేఖర్, గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి విహెచ్ఏ రమణయ్య అనంతసాగరం ఎస్ పి ఓ.బి ఓ డి అంకిరెడ్డి, సుబ్బారావు,ఏపీజీబీ రిటైర్డ్ మేనేజర్, సూర్య ప్రకాష్, అవార్డు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శ్రీనివాసరావు, యేసు బాబు, పద్మావతి మరియు రైతులు పాల్గొన్నారు.

# బొద్దవరం గ్రామంలో సిపిఎం ప్రజా చైతన్య యాత్ర...





**సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడి బేబీ రాణి.**

**కోటనందూరు.:** కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం కోటనందూరు మండలం సిపిఎం కాకినాడ జిల్లా కమిటీ సభ్యురాలు కామ్రేడ్ బేబీ రాణి ఆధ్వర్యంలో బోద్దవరం గ్రామంలోప్రజలు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యలు అడిగి తెలుసుకున్నారు.కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలందరికీ ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి నెలకు 1500 ఇస్తామన్న హామీని,ఉచిత బస్సు ప్రయాణ హామీని నెరవేర్చాలని ఇంట్లో ఎంతమంది చిన్నపిల్లలు ఉంటే వారందరికీ తల్లికి వందనం అమలు చేయాలని, ఒక సంవత్సరం అందర్నీ మభ్యపెట్టే ప్రయత్నం చేశారని అన్నారు. ఎండాకాలం లో ఇంట్లో ఫ్యాన్ వేసుకోవాలంటే కరెంటు చార్జీలు పెరగడం వలన భయాందోళనకు గురవుతున్నామని, గతంలో రూ 200/- లు వస్తే రూ 500/- రూపాయలు బిల్లు వచ్చేలా పెరగడం వలన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక పోయిందని అన్నారు.ప్రజల్లో తిరుగుబాటు సంవత్సరం కాకముందే మొదలైందని కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఇప్పుడు నెరవేరుస్తాం అప్పుడు నెరవేరుస్తామని కాలం వెళ్లబుచ్చుతుందని, ఇప్పటికైనా కళ్ళు తెరుచుకోకపోతే ప్రజల తిరుగుబాటుతో కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోసిపిఎం నాయకులు ఎస్.కె పద్మ, ఎన్. శ్రీనివాస్, ఎం లక్ష్మి ,గడ్డం లక్ష్మి, అప్పలనర్స అరవాలమ్మ ప్రవంతి మంగ కృష్ణ బాబ్జి పాల్గొన్నారు.

# చారిత్రాత్మక నిర్ణయం



**(తాడేపల్లిగూడెం):** 30 ఏళ్ల ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి తెరదించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని తెలుగుదేశం పార్టీ ఎస్సీ విభాగం జిల్లా కార్యనిర్వాహక కార్య దర్శి, న్యాయవాది చెప్పులు వాసు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర యూనిట్ గా ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు క్యాబినెట్ తీర్మానం చేయడం వల్ల యావత్ మాదిగ జాతి చంద్రబాబుకి రుణపడి ఉంటుంద న్నారు. మంత్రివర్గ నిర్ణయాన్ని అభినంది స్తూ తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో కడకట్లలో ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి తెలుగుదేశం పార్టీ ఎస్సీ విభాగం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.. ఈ సందర్భంగా చెప్పుల వాసు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. మాల మాదిగల అందరికీ సమాన న్యాయం చేసేలా సీఎం చంద్రబాబు ముందుకు వెళ్తున్నారని కొనియాడారు. గతంలోనే రామచంద్ర రాజు కమిషన్ వేసి సీఎం చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ అమలు చేశారని ఫలితంగా అప్పట్లో 25 వేల మంది మాదిగ ఉప కులాలవారు ప్రభుత్వ ఉద్యోగాలు పొందా రని ఆయన గుర్తు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పెద్ద మనసు చేసుకొని 30 ఏళ్ల వర్గీకరణ ఉద్యమంలో అశువులు బాసిన మాదిగ అమరవీరుల కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగంతో పాటు ఆ కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ దళిత విభాగం నాయకులు గెద్దాడ రాజు, మార్లపూడి మహేష్, మెరుపు సంతోషరావు, సీలి వెంకటాచలం, పెనుమాక రాకేష్, బొల్లిపో రత్నాజీ, గాలికి ప్రేమ్ కుమార్, పెద మూర్తి పాల్గొన్నారు.

# ఇంట్లో దొంగలు స్వైర విహారం



**కుప్పం:** కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలంలోని శెట్టిపల్లి గ్రామం - బందార్లపల్లి గ్రామ మార్గంలో వ్యవసాయ పొలాల వద్ద ఉన్న ఆటో నాగరాజు ఇంట్లో దొంగలు అందిన కాడికి దోచుకెళ్లారు. మార్చి రెండవ తేదీన నాగరాజు కుమార్తెకు వివాహం జరిగింది. ఇంట్లోని బంగారు, వెండి ఆభరణాలతో పాటు వధువుకు చెల్లింపుల ద్వారా వచ్చిన రూ. 3.25 లక్షల నగదును సైతం దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడు నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# ప్లాస్టిక్ ను నిషేధించి గుడ్డ సంచులనే వాడాలి...






**భీమవరం :** ప్లాస్టిక్ ను నిషేధించి గుడ్డ సంచులనే వాడాలని టీడీపి పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్య రాజు అన్నారు. భీమవరం నరసయ్య అగ్రహారంలోని దాసాంజనేయ స్వామి దేవస్థానం వద్ద భీమవరం పురపాలక సంఘం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 4,5వ వార్డు ప్రజలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సుబ్రహ్మణ్య రాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధం మనందరి బాధ్యత అని, అనారోగ్య సమస్యగా మారుతున్న ప్లాస్టిక్ ను నిషేధించడం మనందరి బాధ్యతని అన్నారు.ప్లాస్టిక్ నిషేద కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు,చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరంలో ఇప్పటికే ప్లాస్టిక్ ను నిషేధించడం జరిగిందని, రానున్న రోజుల్లో పూర్తిగా ప్లాస్టిక్ ను నిషేదిస్తారని అన్నారు. కార్యక్రమంలో విన్నకోట వినాయక్, పులఖండం శివరామ కృష్ణ,గంధం రాధ,లలిత సహస్ర నామ బృందం సభ్యులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# స్మశాన వాటిక భూములపై తప్పుడు సమాచారం చేయద్దు...

**దిరుసుమర్రు గ్రామంలో దళితులు ధర్నా...**



**భీమవరం :** భీమవరం మండలం దిరు సుమర్రు గ్రామంలో దళితుల పంట భూమిని స్మశాన వాటిక భూమి అనడం తగదని మంగళవారం దళితులు ధర్నా నిర్వహించారు. ఒకరి భూమిని చెరువు నిమిత్తం తవ్వుతుండగా ఆ గ్రామంలో కొంతమంది స్మశాన వాటికకు సంబంధించిన భూమిని తప్పుడు సమాచారం ఇవ్వడం దారుణమని దళిత జెఏసి కన్వీనర్ బందెల రాజు అన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్ కుమార్, పరవు విజయ కుమార్, తలకాయల జాన్ కెనాడి, ఈదా దానియేలు, తొకల మర్తారాజు,

న్యూస్-9
సామాజిక అవసరం...సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక
www.news9-india.com
news9.india News9India_ news9telugudaily

# అమరజీవిపొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేసిన ఆర్యవైశ్య సంఘం నేతలు

### ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



**దేవరపల్లి :** దేవరపల్లి: అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగులు విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయటానికి నిర్ణయించడం పట్ల దేవరపల్లి ఆర్యవైశ్య సంఘం నేతలు మంగళ వారం సాయంత్రం దేవరపల్లిలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపం లో జరిగిన విలేకరుల సమావేశంలో హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు పొట్టి శ్రీరాములు సమితి పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాకుళపు కాళీ కృష్ణ మాట్లాడుతూ అమరావతి రాజధానిలో పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహంతో పాటు శృతి వనం ఏర్పాటు చేయటం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు బిజెపి నాయకులకు కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు ఆర్యవైశ్య ప్రముఖులు గతంలో తెలుగుదేశం నాయకులు నారా చంద్రబాబు నాయుడు ఆర్యవైశ్యులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని నెల్లూరికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు వాసవి కన్య కాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం అధికార లాంచినాయాలతో చేయటం శుభ పరిణా మం అన్నారు గన్నవరం విమానాశ్రయానికి పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని దేవరపల్లి ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు తీగల బలరామ య్య కొత్త గుండి బాబురావు సూతపల్లి ప్రభాకరరావు, వెలగా శ్రీనివాస్,సుతాపెల్లి నాగరాజు,సుతాపెల్లి వెంక టరామారావు,సుతాపల్లిరత్నాజీ,చలంచర్ల రాము,వెల గా వీరవెంకటసత్యనారాయణ,పులపర్తి ప్రసాద్, ఆర్య వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు అనంతరం ముఖ్యమ ంత్రి,ఉపముఖ్యమంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారుపొట్టి శ్రీరాములు గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అమరజీవి పొటి శ్రీరాములు.వనపరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన శ్రీకాకోలపు ఖాళీ కృష్ణను సత్కా రించారు

# మంజురైనా రోడ్ల నిర్మాణానికి ఫారెస్ట్ అనుమతులు ఇవ్వాలి..





**అనంతగిరి:**అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం మారుమూల పినకోట పంచాయితీ తట్టబుడి, సిందుల పాడు, పెద్ద బురగా గ్రామాల్లో పర్యటించి సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో వారి సమస్యలు పరిష్కారం చేయాలని

1)మంజూరైన రోడ్డు నిర్మాణానికి ఫారెస్ట్ అనుమతులు మంజూరు చేయాలని..

2)పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు రోడ్డు నిర్మాణం ప్రారంభించాలని..

3)గ్రామాల్లో ఆధార్ కార్డులు నమోదు చేయాలని..

4)రేషన్ కార్డులు మంజూరు చేయాలని..

5)పించన్లు మంజూరు చేయాలని..

6)అర్హులందరికీ గృహాలు మంజూరు చేయాలని..

మండుటెండలో కొండ శిఖర గ్రామాల్లో పర్యటించిన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అనంతగిరి జడ్పిటిసి దీసారి గంగరాజు ఈ సందర్భంగా జడ్పీటీసీ అనంతగిరి మండలంలో పినకోట పంచాయితీ తట్టబుడి, సిందులపాడు పెద్ద బురుగ, సొలొబోంగు,వలసలు గరు మీదుగా చింతపాక వరకు 16 కిలోమీటర్లు 16కోట్లా 67 లక్షల నిధులు డోలీ మోతల గ్రామాల్లో సిపిఎం పార్టీ గిరిజనుల పోరాటాల ఫలితంగా నిధులు కేటాయింపు జరిగింది.డోలీ మోతల గ్రామాల్లో గౌరవ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు పంచాయితీరాజ్ శాఖ మంత్రి వర్య లు స్పందించి మన్యం,అల్లూరి ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యటించి డోలీ మోతలు అరికట్టాలని నిధులు కేటాయించి శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేసిన ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారుల నిర్వాకం వల్ల అనుమతుల పేరుతో రోడ్లు చేయకుండా అడ్డగించడం రెండవ బాగం పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు నిర్లక్ష్యం చేయడం గిరిజనులకు రోడ్డు సౌకర్యానికి మోక్షం కలగటం లేదు.జిల్లా అధికారుల నిర్లక్ష్యమే గిరిజన అభివృద్ధికి అట్టంకంగా మారుతుంది. ఇప్పటికైనా అధికారులు మేలుకోని ఫైలు పైరవీలు అనుమతులు కలెక్టర్‌గారి దృష్టికి పెట్టి పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తున్నాము లేని యెడల మండల జిల్లా అధికారుల కార్యల యలు ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నాము. ఇప్పటికైనా గిరిజనుల ఆగ్రహానికి గురి కాకుండా రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు.గ్రామాల్లో ఆధార్ కార్డులు లేవు, రేషన్ కార్డులు లేవు,అర్హులకు పించన్లు లేవు,గిరిజనులకు రేషన్ సక్రమంగా అందటం లేదు.దుర్భర పరిస్థితిని గిరిజనులు ఎదుర్కొంటున్నారు.వారి సమస్యలు పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని ప్రజలకు భరోసా ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు నందుల చినగంగులు,సాగర రాజు, నరాజీ సురేష్ బాబు,రాప్ప రాజారావు,నందుల రాజారావు, పాడి లక్ష్మణరావు,సోమెల సన్యాసిరావు,గెమ్మెల గెడ్డన్న,వార్డు మెంబర్ సివెరి దేముడు ప్రజలు మహిళలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మిగనూరు తాసిల్దార్ ఆఫీస్ నందు

# మనీ ఇస్తే పని చేస్తా వి ఆర్ ఓ మోహన్



**ఎమ్మిగనూరు:** ఎమ్మిగనూరు వీఆర్వో మోహన్ మోహం మనీ కోసమేనా అంటే దానికి ప్రజలు అవునని గుసగుసలాడు తున్నారు . వివరాల్లోకి వెళితే ప్రతి రోజూ నిత్యం వందల మంది పౌరులు తమ తమ అవసరాల నిమిత్తం ఎమ్మిగనూరు ఎమ్మార్వో ఆఫీస్ కు వస్తూ ఉంటారు. డెత్ సర్టిఫికేట్లు, ఫ్యామిలీ సర్టిఫికెట్లు, పట్టాదారు పాసు బుక్కులు, పట్టా ట్రాన్స్ఫర్లు, పొజిషన్ సర్టిఫికెట్లు, మ్యుటేషన్ ల కొరకు ప్రజలు ఎమ్మార్వో ఆఫీసుల చుట్టూ తిరగడం ప్రతిరోజు కూడా చూస్తుంటాం. కానీ ఇక్కడికి వచ్చే పౌరులకు ఎమ్మిగనూరు వీఆర్వో అందుబాటులో లేకపోవడం సమయపాలన పాటించకపోవడం ఎక్కడెక్కడి దూర ప్రాంతాల నుండి ప్రజలు వచ్చి నానా అవస్థలు పడడం జరుగు తుంది. వేసవి కాలంలో సైతం ప్రజలు ఆఫీసుల చుట్టూ ఈయన చుట్టూ తిరుగుతూ అలసిపోతున్నారు.ఆయన సకాలంలో ఆఫీసు కు రాకుండా ఆయన ఇష్టం వచ్చినప్పుడు రావడం ప్రజలు అడిగితే నేను ఫీల్డ్ కి వెళ్లాను అంటూ నాకు పని ఉండదా అంటూ పౌరులనే బెదిరించడం ఇందులో కొసమెరుపు. శివున్ని దర్శించుకోవాలంటే ముందుగా నందిని దర్శించుకోవాలి. అలాగే ఆఫీసులో ఈయన్ని దర్శించుకోవాలంటే ముందుగా ఆయన నియమించినటువంటి ప్రైవేట్ వ్యక్తిని ప్రసన్నం చేసుకోవాలి. ఈయన తన ఆఫీసు తాళం తీయడానికి తన పనులు చక్కబెట్ట డానికి మరొకరిని నియమించుకోవడం గమనార్హం. డబ్బుల కోసమే ఈయన పనుల నిమిత్తం వచ్చిన వారిని రేపు రా మాపు రా అంటూ తిప్పుకుంటున్నాడని గుసగుస లు వినపడుతున్నాయి. అందుకు బలం చేకూరుస్తూ వచ్చిన వారిని కాలయాపన చేస్తూ ఉండడం అన్నది ఇక్కడ నిత్యకృత్యం. ఎందరో వృద్ధులు వికలాంగులు వితంతువులు ఇలా ప్రతి ఒక్కరూ తమ తమ అవసరాల నిమిత్తం ఇక్కడికి వస్తూ పనులు జరగక ఎంతో బాధ తో ఇంటికి వెళ్లడం అన్నది జరుగుతుంది. కాబట్టి ఎమ్మిగనూరు ఎమ్మార్వోదీనిని గుర్తించి పౌరులకు త్వరగా సేవలు అందించి పౌరుల బాధల ను తొలగించాలని ప్రజలు కోరుకుంటున్నారు. చాకలి ఈరన్నను వికలాం గుడు అని కూడా కనికరం చూపడం లేదు. అన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్ కోసం వస్తే నెల రోజుల నుండి తిప్పుకుంటూ ఆయన అందుబాటులో ఉండడం లేదు.ఒకవేళ కలిస్తే మళ్లీ కలుస్తానంటూ వెళ్ళిపోవడం జరుగు తుంది పైగా ఆయనను ఓపిక ఉండాలి లేకపోతే ఎలా అంటూ ఆయనే బెదిరించడం జరిగింది. చాకలి ఈరన్న వికలాంగుడు.

# సి బెళగల్ మండలంలో కేజీబీవీ కస్తూర్బా పాఠశాల లో విద్యార్థుల ఆకలి కేకలు

**ఎమ్మిగనూరు (సి. బెళగల్):** సి బెళగల్ మండలంలోని కేజీబీవీ కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు ( ఉడికి ఉడకని అన్నం )పెడుతు వంట వండే వారు విద్యార్థులను నాన్న రకమైన బూతులు తిడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు రాయలసీమ యునైటెడ్ స్టూడెంట్ ఫెడరేషన్(ఆర్ యూ ఎస్ ఎఫ్) విద్యార్థి సంఘాన్ని ఆశ్రయించడం జరిగింది కావున విద్యార్థి సంఘ నాయకులైన మేము విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి మధ్యా హ్నం భోజనాన్ని పరిశీలించడం జరిగింది ఈ సందర్భంగా ఆర్ యు ఎస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్ మాట్లాడుతూ విద్యార్థు లకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా వ్యవహరిస్తూ ఉంటే అక్కడ ఉండేటటువంటి యాజమా న్యం మాత్రం దానికి భిన్నంగా వ్యవహరించడం జరుగుతుంది ఈ విషయం పైన ప్రిన్సిపల్ ని అడగగా అక్కడ ఉండేటటువంటి వంట యాజమాన్యం మరియు అటెండర్ ఒక నియంతల వ్యవహరించడం జరుగుతుంది అని వారు అన్నారు ప్రిన్సిపాల్ మాటలు లెక్కచేయకుండా తమకు నచ్చినట్లుగా వ్యవహరిస్తూ విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చినటువంటి సరుకులను వారి ఇండ్ల కు తరలించడం జరుగుతుందని




తెలిపారు కావున జిల్లా విద్యాధి కారులు దీనిపైన స్పందించి విద్యార్థి జీవితాలను కాపాడాలని అవినీతికి పాల్పడిన టువంటి వంట వాళ్లను అటెండర్ ను తొలగించాలని వారు డిమాండ్ చేశారు లేనిపక్షంలో మేము ఈ సమస్య పైన మరిన్ని ఉద్యమాలు చేస్తామని వారు హెచ్చరించారు.

# మేము ఉన్నాం అంటున్న జగజ్జీవన్ రామ్ అరుణోదయ సంఘం



**గోపాలపురం** కాలుకి బ్లడ్ ఇన్ఫెక్షన్ వచ్చి యువకుడు బాధపడుత్తున్న కడిమి రాముకి మేము సైతం ఉన్నామంటూ జగజ్జీవన్ రామ్ అరుణోదయ సంఘం అధ్యక్షులు చాపల రవి ఆర్థిక సహాయం అందించారు. మంగళవారం మండలంలోని గోపాలపురం గ్రామం పెద్దగూడెం జగజ్జీవన్ రామ్ అరుణోదయ సంఘం ఆధ్వర్యంలోరూ పదివేలు ఆర్థిక సహాయం అభినందనీయమని, గ్రామస్తులు తెలిపారు. పెద్దగూడెం, ఆపదలో ఉన్న కడిమి రాము అనే వ్యక్తిని ఆర్థికంగా ఆదుకున్నారు. చాపల రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దీర్సిపోం మురళి, పసలపూడి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పిలుపుమేరకు అరుంధతి యూత్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు





**గోపాలపురం** మండలంలోని దొండపూడి గ్రామం లోఅరుంధతి యూత్ ఆధ్వర్యంలో డయోరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అభినందనీయమని గ్రామస్తులు తెలిపారు.మంగళవారంగోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు గ్రామాల లో అరుంధతియ యూత్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్,పరిశుభ్రత ధ్యేయంగా స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పిలుపునిచ్చారు. గ్రామంలోని ప్రధాన వీధులలో స్వచ్ఛందంగా, మండలంలోని గ్రామీణ పల్లె ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రంగా, ఉంచుకోవాలని, వీధులలో చెత్తాచెదారం వేయకుండా, శుభ్రం చేయడం, డ్రైనేజీలలో ప్లాస్టిక్ పెద్ద పదార్థాలు వేయరాదని, ప్రజలు తడి చెత్త పొడి చెత్త పై అవగాహన కలిగి ఉండాలని అరుంధతి యూత్ సూచించారు. యూత్ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని స్వచ్ఛందంగా సేవలు అందించాలని గ్రామస్తులు కోరారు.

# వాటర్ షెడ్ పథకంలో అవినీతి

### - బిగించుకుండానే విరిగిపోతున్న బెంచ్





**కొయ్యూరు :**ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేసినప్పటికీ, సంబంధిత అధికారుల అవినీతి కారణంగా ప్రభుత్వ నిధులు బూడిదలో పోసిన పన్నీరు అవుతున్నాయి.మండలంలో వాటర్షెడ్ పథకం ద్వారా చేపట్టిన పనులలో అవినీతి చోటుచేసుకుందని పంచాయతీ సర్పంచులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.మండలానికి వాటర్షెడ్ పథకం ద్వారా మంజూరైన సిమెంట్ బెంచ్ బల్లలు నాణ్యత లోపంతో నిర్మించారు. అవి బిగించకుండానే పగిలిపోయి,విరిగిపోతున్నాయి .బిగించిన కొన్ని బల్లలు కూర్చోవడానికి ఉపయోగపడటం లేదు . కొయ్యూరు, మంప ,మర్రివాడ, రేవళ్లు, రావణపల్లి పంచాయతీలకు ఒక్కొక్క పంచాయతీకి 15 సిమెంటు బెంచ్ వల్లల మంజూరయ్యాయి. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై నాణ్యతలోపంతో బెంచులను నిర్మించారు. ఈ అవినీతిపై సంబంధిత ఎంపీడీవో ఎస్. కె.వి ప్రసాద్ కు సర్పంచులు, గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తామని ఎంపీడీవో ప్రసాదు హామీ ఇచ్చారు.

# తాగునీటి కోసం జాతీయ రహదారి దిగ్బంధం



**మంత్రాలయం:**మంత్రాలయం మండలంలోని కల్లుదేవకుంటలో తాగునీటి సమస్యను తీర్చాలని గ్రామస్తులు మంగళవారం 167 ఎన్ హెచ్ ఎ జాతీయ రహదారిని దిగ్బంధించారు ఖాళీ బిందెలతో మహిళలు జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు దీంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి 20 రోజులుగా తాగునీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అయినప్పటికీ పట్టించుకునే నాథుడే కరవయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు తక్షణమే తాగునీటికి సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామ ప్రజలు డిమాండ్.

# సమస్యలపై స్పష్టత లేని విపక్షాలు !





పార్లమెంట్ సమావేశాల్లో ప్రజలకు సంబంధించిన అంశాలపై చర్చ సాగడం లేదు. ఈ విషయంలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఘోరంగా విఫలం అవుతోంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చకు తేవడం లో ఆ పార్టీ గత కొంత కాలంగా పార్లమెంటులో విఫలం అవుతోంది. ఎంతసేపు కేవలం బిజెపిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తోందే తప్ప..సమస్యలను ఆధారంగా చేసుకుని బిజెపిని విమర్శలు చేయడం లేదు. పార్లమెంట్ ఇప్పుడు కాంగ్రెస్, బిజెపిల మధ్య వ్యక్తిగత ఎజెండాగా మారింది. మిగతా విపక్షాలు కూడా అలాగే ఉన్నాయి. పార్లమెంట్ సమావేశాల్లో గతంలో చక్కటి చర్చ జరిగేది. ప్రభుత్వం కూడా చర్చలకు అవకాశం ఇచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. సాదాసీదాగా పార్లమెంట్ సమావేశాలు సాగుతు న్నాయి. ఏ పార్టీ ఎజెండా దానికి ఉంది. దాని ప్రాకరమే సాగుతున్నారు. డిఎంకె హిందీవ్యతిరేకత, డీలిమిటేషన్‌పై పోరాడుతోంది. ఆ అంశాలను ప్రస్తావించి హడావిడి చేసింది. విలువలతో కూడాని రాజకీయాలు నెరిపే బిజెపికి ఇప్పుడు అసత్యాలు మాట్లడడమే అలవాటుగా చేసుకుంది. ఈ పార్టీలో అన్నీ అవలక్షణాలు చోటుచేసుకున్నాయి. కేవలం ఇద్దరి చేతుల్లోనే పార్టీ ఉంది. వారిద్దరే అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు. కార్పోరేట్ల సలహాలతో వారు చెప్పిన రీతిలోనే పాలన సాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తాము చెప్పిందే వేదం అన్న రీతిలో పార్టీని నడుపుతూ పోతున్నారు. అన్నీ ఘనతలు సాధించామని, భారత్ ఉజ్వలంగా ఉందని గొప్పలకు పోతున్నారు. ఇలాంటి వారికి ఎదుటి వారు చెప్పే నిజాలు చేదుమాత్రగానే ఉంటుంది. దేశంలో నిరుద్యోగం గరిష్ఠానికి చేరింది. సమస్యలపై గొంతుచించుకుని అరిచినా వినిపించుకునే స్థాయిని మోడీ దాటిపోయారు. నిరుద్యోగం పెరిగిందని, ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీస్తున్నా సమాధానం ఇచ్చే ధైర్యం మోడీకి లేదు. విపక్ష పార్టీలు నిజాలు అడిగినంతనే బిజెపి అగ్గిమీద గుగ్గిలం కావడం దాని అసహనాన్ని వెల్లడిస్తోంది. ఉద్యోగ కల్పనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విఫలమయ్యారని గణాంకాలే వెల్లడిస్తున్నా ఒప్పుకునే ధైర్యం చేయడం లేదు. దీనికితోడు ఉన్నప్రభుత్వరంగ సంస్థలను నిస్సిగ్గుగా అమ్ముతున్నా..గట్టిగా నిలదీసే నేతలు బిజెపిలో కూడా లేరు. అంతెందుకు పార్లమెంటులో ఏ సమస్యపైనా చర్చించే ధైర్యం కూడా మోడీ చేయడం లేదు. అసలు తమను పట్టించుకున్న పాపాన పోవడం లేదని అన్ని వర్గాలు వాదిస్తున్నా పట్టించు కోవడం లేదు. ఎన్నికల ముందు, పార్లమెంటు సమావేశాల సందర్భంగా నీతి వాక్యాలు చెప్పడంతప్ప సమస్యల కోణంలో చూడడం లేదు. కేంద్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయే రంగాల్లో ఎలాంటి సానుకూల మార్పులు తీసుకు వచ్చిందీ చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసు కోవడం లేదు. రాష్ట్రాలకు ఒరగబెట్టిందీ ఏమీ లేకున్నా గణాంకాలతో వివరించేందుకు పదేపదే ప్రయత్నాలు చేయడంతప్ప మరేమీ లేదు. యోడీ తీసుకుంటున్న నిర్ణయాలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బ తీసింది. చాయ్ అమ్మానని గొప్పుల చెప్పే ప్రధాని మోడీ,గ్రామాల్లో చాయ్ అమ్మేవాళ్లకు కూడా కష్టకాలం తీసుకుని వచ్చారు. ఎంతోమంది ఆర్థిక వేత్తలు, ఆర్థిక నిపుణులు జిఎస్‌టి వల్ల కలిగిన విపరిణామాలను ఏకరువు పెట్టినా పట్టించుకోలేదు. పలు స్వతంత్ర నివేదికలు ఇప్పటికే ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టాయి. నిజానికి ఇది ప్రతి నిరుద్యోగి చేస్తున్న ఆక్రందన. దేశంలో ఉద్యోగాలు రావు. వస్తూత్పత్తి పెరిగినా అనుబంధ రంగాలు బలపడలేదు. వ్యవసాయం దివాళా తీసింది. పండించిన పంటలకు మద్దతు ధరలు రావడం లేదు. పండించిన పంటలను అమ్ముకునే పరిస్థితి లేదు. బలమైన మార్కెటింగ్ వ్యవస్థ లేకుండా పోయింది. ఇందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పత్తి, మిర్చి, పసుపు,వరి పండించిన రైతులే నిదర్శనం. వ్యయసాయానుబంధ పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించి ఉంటే నిరుద్యోగాన్ని తగ్గించుకునే అవకాశం ఉంది. ఉద్యోగాలు కల్పిస్తానని, మేకిన్ ఇండియా అంటూ ఊదరగొట్టడం తప్ప క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. దేశంలో నిరుద్యోగ సమస్య తీర్చే ప్రయత్నాలు జరిగివుంటే పరిస్థితి ఎందుకింత దారుణంగా ఉంటుంది. దీనికితోడు రూపాయి విలువ పడిపోతూ, ద్రవ్యోల్బణం పెరుగుతూ పోతుందే తప్ప అభివృద్ధి గణాంకాలు ముందుకు సాగడం లేదు. పాలనలో కొత్త ఒరవడి తీసుకుని వచ్చి,ప్రజలకు ఆసరాగా అండగా, దేశానికి మంచి చేసేలా చేస్తారని మోడీని నమ్మిన ప్రజలు ఇప్పుడు చేష్టలు ఉడిగి చూస్తున్నారు. దీనిపై బిజెపి పెద్దలు ఆత్మవిమర్శ చేసుకుంటే పార్టీకి, దేశానికి మంచిది. దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు ఎలా సన్నగిల్లాయో లెక్కలుచూస్తే తెలుస్తుంది. దేశంలోని పట్టణ ప్రాంతాల్లో 7.8శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 5.3శాతం చొప్పున నిరుద్యోగిత ఉందని, సగటున 6శాతం పైనేనని గణాంకాలు తెలుపుతున్నాయి. తీవ్రమైన ఉపాధి లేమి కారణంగా మొన్నటి ఎన్నికల్లో మోదీ విజయావకాశాలను దెబ్బతీసిందని చాలా మంది అంచనాలు వేశారు. అయితే మోడీ మేనేజ్‌మెంట్‌తో ఎన్నికల్లో గెలవడంతో ఇక తమకు తిరుగులేదన్న ధోరణిలో ఉన్నారు. స్వతంత్ర సంస్థల నోరుకట్టేసి, ప్రభుత్వ సంస్థల నివేదికలను దాచేసి, ఎన్నో అద్భుతాలను సాధించామని చెప్పుకున్నంత మాత్రాన ప్రజలు నమ్ముతారనుకోవడం అవివేకం. అధికారంలోకి వచ్చేముందు కోట్లాది ఉద్యోగ ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత కొంతకాలం అవే మాటలతో మేకిన్ ఇండియా పాట కూడా పాడారు. నిజంగానే ఇదే సాకారం కావాలంటే స్వయం ఉపాధి రంగాలను ప్రోత్సహించాలి. పంటల కొనుగోలుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పడాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలి. చైనా ఈ రకమైన విజయాలతోనే ఆర్థికంగా విజయం సాధించిందని వేరుగా చెప్పనక్కరలేదు.



# ఉనికిని కోల్పోతున్న బిఎస్పీ

- ఆత్మపరిశీలనచేసుకోని మాయావతి
- బిజెపిలో బిసిలకు పెరుగుతున్న ఆదరణ

**న్యూఢిల్లీ,మార్చి18:** ఒకప్పుడు యూపీ రాజకీయాలను శాసించిన బీఎస్పీ నామావశిష్టంగా మారిపోవడం విషాదం. బడుగు వర్గాలకు అండగా నిలిచిన పార్టీ మట్టి కరచి పోవడం దేశంలో బడుగులకు గొడుగు లేకుండా పోయింది. దీనికితోడు మాయావతి నాయకత్వం కూడా ప్రభావవంతంగా లేదు. ఇలాంటి సందర్భంలో ఇప్పుడు అన్ని పార్టీలు బిసి జపం చేస్తున్నాయి. ఒకప్పుడు యూపిని ఏలడంతో పాటు, బడుగులకు ఆశాజ్యోతిగా ఉన్న బిఎస్పీ ఇప్పుడు ఉనికి కోల్పోవడం చూస్తుంటే..బడుగులకు కూడా ఆశలు సన్నగిల్లాయా అన్న అనుమానాలు వస్తున్నారు. అంతేగగాకుండా యూపిలో అధికార పీఠానికి దూరంగానే మిగిలిపోయింది. సంక్లిష్ట కుల, ప్రాంత సమీకరణలతో బహుముఖ పోటీ ఉండే యూపీ లాంటి రాష్ట్రం కేవలం బీజేపీ, ఎస్పీల ద్విముఖ పోరుగా మారిపోవడం గమనించాలి. ఈ పోరుతో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)తో పాటు కాంగ్రెస్ కూడా నలిగిపోయింది. దశాబ్దాలుగా లేని విధంగా యూపీలో అధికార పక్షాన్నే రెండోసారీ పీఠమెక్కించాయి. గతంలో బిజెపి మద్దతుతో లేదా ఎస్పీ మద్దతుతో అధికారం నడిపిన మాయావతి ఎందుకనో నిస్తేజంగగా మారారు. తాజా రాజకీయాల్లో నామమాత్ర పాత్రకే పరిమితం అయ్యారు. బిఎస్పీ తన పూర్వ ప్రాభవాన్ని పూర్తిగా కోల్పోయింది. ఓటు బ్యాంకును కూడా కోల్పోవడం మాయావతి నాయకత్వ వైఫల్యం తప్ప మరోటి కాదు. కాన్షీరామ్ లాంటి బలమైన నేత ఇప్పుడు బిఎస్పీకి రావాలి. బడుగు బలహీనవర్గాలకు అండగా ఉన్నారన్న ప్రభావం చూపాలి. ధరల పెరుగుదల, ఉపాధి లేమి, రైతు ఉద్యమాలు, మధ్యతరగతి కష్టాలు, అధికారపక్షానికి సాధారణంగా ఎదురయ్యే వ్యతిరేకత లాంటివేవీ బీజేపీ గెలుపును ఆపలేక పోయాయి. భావోద్వేగాలను ప్రేరేపించే అంశాలే ఎన్నికల్లో ప్రతిఫలిస్తున్నాయి. నిజానికి బిఎస్పీ, కాంగ్రెస్ పార్టీల్లోనే బడుగు బలహీన వర్గగాలకు పెద్దపీట దక్కుతుంది. అలాంటిది ఈ రెండు పార్టీలు ఈ ఎన్నికలతో తమ మూలాలను కోల్పోయాయి. బీజేపీ, మోదీ ప్రభంజనాలకు ఇప్పటికైతే తిరుగులేదనే భావనను కలిగించాయి .విభిన్న సమీకరణాల ఎన్నికల రాజకీయాల నిర్వహణలో ప్రస్తుతం దేశంలో మరే పార్టీ దానికి పోటీలో లేవని నిరూపితం అయ్యింది. దీనికితోడు బిజెపిలో ఇప్పుడు బిసిలు,ఎస్సీలకుకూడా తగు ప్రాధాన్యత దక్కుతోంది. కులాల గురించి పోరాడుతున్న వారు సైతం బిజెపి గొడుగుకిందకు చేరుతున్నారు. ఈ ఫలితాలతో బిఎస్పీ ఆత్మపరిశీలన చేసుకోవాలి. నిజానికి బిఎస్పీలో కూడా మాయావతి తిరుగేలని నియంతలా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఓ రకంగా చెప్పాలంటే బిఎస్పీ, కాంగ్రెస్ ఓటు బ్యాంక్ బిజెపికి మళ్లుతోందని గుర్తించాలి.

## ప్రేమ మధురమైన అనుభూతి ! ( ఆధ్యాత్మిక చింతన )

**తిరుమల,మార్చి18:** భగవద్గీతలోని 'భక్తియోగం' భక్తి తత్వాన్నీ, లక్షణాల్నీ భాగవతం విపులంగా తెలిపింది. శ్రీమద్భాగవతం భగవద్భక్తుల లక్షణాలను, భక్తి స్వరూపాన్నీ సవిస్తరంగా ఆవిష్కరించింది. మానవునికి క్రోధం, శోకం లాంటి ఎన్నెన్నో అనుభూతులు ఉన్నా ప్రేమ లాంటి మధురమైన అనుభూతి మరేదీ లేదు! ప్రేమ పొందడం కన్నా ప్రేమించడం ఇంకా మధురం. మానవునికి స్వతహాగా ప్రేమించే లక్షణం ఉన్నా... ఆ ప్రేమ ఒక వ్యక్తికో, ఒక వస్తువుకో మాత్రమే పరిమితమవుతుంది. అప్పుడప్పుడు మాత్రమే కనిపిస్తూ, స్వార్థభావంతో కలుషితమౌతూ, విచ్ఛిన్నమైపోతూ ఉంటుంది. దీనినుంచి బయటపడి ప్రేమతత్వాన్ని అలవర్చుకుంటే భగవంతుడు వశమవుతాడని పురాణాలు చెబుతున్నాయి. భగవంతుడు ఎల్లవేళలా తనయందు భక్తి ఉండాలని కోరుకుంటాడు. భక్తితో తనను శరుణు వేడుకున్న వారికి అండగా ఉంటానని చెబుతాడు. మన పురాణాలు, ఉపనిశత్తులు, అన్నీ ఇదే చెబుతున్నాయి. పురాణాలు, ఇతిహాసాల్లో ప్రహ్లాదాదులంతా ఇలాగే భక్తిని చాటారు. భగవంతుడు వారికి అండగా నిలిచాడు. అంటే భక్తికి భగవంతుడు వశమవుతాడన్నది సత్యం. ప్రతిఫలాపేక్ష లేకుండా తనను కొలువుమని గీతాచార్యుడు చెప్పాడు. ఆధునిక కాలంలోనూ ఇదే పద్ధి కొనసాగుతోంది. గుడికి వెళ్లడం భక్తితో చేయాలని అంటారు. భగవంతుని మీద పరిపూర్ణమయైన ప్రేమ కలిగి ఉండడమే భక్తి. అది అమృతానంద స్వరూపం. త్యాగరూపమైనది అయి ఏ కోర్కెలూ లేని స్థితిలో ఉండాలి. అదే మోక్ష అని నారద భక్తి సూత్రాలు చెబుతున్నాయి. నిష్కామంగా ప్రేమించడాన్ని సాధన చెయ్యాలి. ఈ జగత్తులో భగవంతుడు సర్వవ్యాప్తి. సమష్టి రూపమైన భగవంతుని పట్ల... సాధకులు చేసే 'నిష్కామప్రేమ' అనే ఈ ఉపాసనాక్రమానికి కూడా 'భక్తి' అనేదే వ్యవహార నామం. భక్తి సార్వజనీనం, భేదరహితం కావడంవల్ల నిజమైన భక్తిలో లోపాలు ఉండవు. అనంతమైన భగవత్తత్వానికి అనంతమైన కళ్యాణ గుణాలు, రూపాలు, నామాలు ఉన్నాయి! వాటిలో రాముడు, కృష్ణుడు, శివుడు, లలిత తదితర సంపూర్ణ దేవతామూర్తుల్ని ఉపాసనా సౌలభ్యం కోసం వేద, పురాణాలు మనకు అందించాయి. భక్తులు తమకు ఇష్టమైన ఒక దేవతా మూర్తిని స్వీకరించి, సమస్త దేవతలనూ, సమస్త జగత్తునూ ఆ మూర్తిలోనే ఉన్నట్టు భావించి, పరదేవతగా ఉపాసించడం ద్వారా భక్తిని కలిగి ఉండాలి.

# ఉత్తర తెలంగాణలో ఎండల తీవ్రత




**నిజామాబాద్,మార్చి18:** ఉత్తర తెలంగాణలో మళ్లీ ఎండలు ఠారెత్తిస్తున్నాయి. గత రెండుమూడు రోజలులుగా ఎండవేడిమికి తోడు ఉక్కపోతలు మొదలయ్యాయి. ఇన్నాళ్లూ చలితో వణికిపోయిన ప్రజలు తాజాగా ముదురుతున్న ఎండలు చెమటలు పట్టిస్తున్నాయి. జిల్లాల్లో పగటిపూట ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతుండడంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లోనే జనాలు రోడ్లపైకి వస్తున్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు బయటకు రావడంలేదు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరగడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. దీంతో తాగునీటికి, సాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి నెలకొంది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో ఉక్కపోత ఎక్కు వైంది. మధ్యాహ్నం సమయంలో ఇళ్లల్లో ఉండడమే కష్టమవుతోంది. ఎప్పుడూ ఏప్రిల్ నెలలో ఎండల తీవ్రత పెరిగేది. కానీ ఈసారి ముందుగానే ఎండలు మొదలయ్యాయి. ఉత్తర తెలంగాణలో నిజామబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎండల తీవ్రత అప్పుడే పెరిగింది. గరిష్ఠం 38 డిగ్రీలుగా నమోదు అవుతోంది. ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదైతే రాబోయే ఏప్రిల్, మేలో పరిస్థితులు ఎలా ఉంటాయోనని జనం బెంబేలెత్తి పోతున్నారు. వేసవి సీజన్ ప్రారంభం కావడంతో వ్యాపారాలు ఊపందుకుంటున్నాయి. ఇప్పటికే శీతల పానియాల కేంద్రాలు సిద్ధమవుతుండడంతో కూలర్‌ల తయారీలో వ్యాపారులు నిమగ్నమయ్యారు. ఎండల తీవ్రతకు ముందే ముందస్తుగా కూలర్లను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. సీజన్ ఊపందుకుంటే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

న్యూస్-9
సామాజిక అవసరం...సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక
www.news9-india.com
news9.india News9India_ news9telugudaily

# ప్రి ప్రైమరీ తగతులను ప్రారంభించిన పెబ్బేరు మండల విద్యాధికారి





,పెబ్బేరు:పీఎం శ్రీ ప్రాథమికోన్నత పాఠశాలగా ఎన్నికైన పెబ్బేరు మండలం బున్యాదిపూర్ గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యలో భాగం గా ఎల్కేజీ, యూకేజీ తరగతులకు ఇండోర్ గేమ్స్ మెటీరియల్ మరియు అవుట్డోర్ గేమ్స్ మెటీరియల్ తో పాటు ప్రీ ప్రైమరీ తరగతులను రంగాపూర్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయు లు,పెబ్బేరు మండల విద్యాశాఖ అధికారి జయరాములు మంగళవారం ప్రారంభించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు నోట్ పుస్తకాలు,పలకలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పీఎం శ్రీ పాఠశాలలో భాగంగా బునియాదిపురం పాఠశాలలో గ్రామంలోని పూర్వ ప్రాథమిక విద్యను అభ్యసించిన అందరు విద్యార్థులు వినియోగించుకొని వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రైవేటు పాఠశాల కన్నా దీటుగా విద్య బోధన చేస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ పాఠశాల అభ్యున్నతికి కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమములో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగశేషు,ఉపాధ్యాయులు దయానంద్ దొడ్ల,ఇన్ స్ట్ర మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాల ఏర్పాటుకు 50వేల విరాళం



,పెబ్బేరు: పెబ్బేరు మండలంలోని రంగాపురం గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం నెల రోజుల క్రితం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎస్సై హరిప్రసాద్ రెడ్డి సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.గ్రామంలో కొంతమంది దాతలు సహకరించి పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ కుమార్ కు అందజేయడం జరిగింది.మంగళవారం ట్రాక్టర్ అసోసియేషన్ నుంచి 25 మంది ట్రాక్టర్ ఓనర్లు 50వేల రూపాయలు కాంగ్రెస్ నాయకులు బి.రాంచంద్రారెడ్డి ఆద్వర్యంలో పంచాయతీ కార్యదర్శికి అందజేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ... మన గ్రామంలో గతంలో ఎన్నో దొంగతనాలు జరిగే చాలామంది నష్టపోయారని,నేరాల అదుపునకు ,ప్రమాదాలు,దొంగతనాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఎంతో దోహద పడుతాయన్నారు.సీసీ కెమెరాల ఏర్పాటుకు మన గ్రామంలో దాతలు ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని ఆయన కోరారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ కుమార్,ట్రాక్టర్ అసోసియేషన్ సంఘం అధ్యక్షులు బెరికి లక్ష్మణ్,దాది శేఖర్,బండమీధి గోవిందు,గడ్డం శేఖర్,మండ్ల నరేష్,గొల్ల రాముడు,బండమీది కురుమన్న,మండ్ల గట్టన్న,గడ్డం చెన్నకేశవులు,ఎండి సలీం,ఎర్ర రాముడు,పిట్ట గణేష్,కావలి ఊషన్న తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ఉపాధి హామీ ప్రతి కూలీదారునికి వంద రోజులు పని కల్పించాలి

**- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్.**



పెబ్బేరు: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉపాధి పని ప్రదేశాల సందర్శనలో భాగంగా పెబ్బేరు మండలం గుమ్మడం తండాలో జరుగుతున్న ఉపాధి పని ప్రదేశాన్ని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం ఆంజనేయులు సందర్శించడం జరిగింది.ఈ సందర్భంగా వ్యవసాయ కూలీల యొక్క సమస్యలను తెలుసుకుని మాట్లాడడం జరిగింది.కేంద్ర బిజెపి ప్రభుత్వము జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి వార్షిక బడ్జెట్లో కేవలం 86 వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించడం మరి దారుణం.దేశవ్యాప్తంగా వ్యవసాయ కూలీలు 44 శాతం మంది జనాభాలో ఉన్నా,బడ్జెట్లో మాత్రం కేటాయింపులు 0.3 శాతం మాత్రమే జరిగింది.అంటే జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి 32 రూపాయలు మాత్రమే కూలివచ్చే విధంగా బడ్జెట్ను కేటాయింపులు చేశారు.ఉపాధిలో కనీసం 600 రూపాయల కైనా పెంచాలని వ్యవసాయ కూలీలు డిమాండ్ చేస్తున్నా,మోడీ ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదు.అదేవిధంగా 20 సంవత్సరాల క్రితం ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కేటాయించిన దాన్ని ఇప్పటికీ అదేవిధంగా కొనసాగించడం సరైంది కాదు.వ్యవసాయంలో యంత్రాలు రావడం మరి వ్యాపార పంటలు రావడం వల్ల వ్యవసాయ భూమిలో కూలీలకు పని దొరకడం తగ్గిపోయింది.కాబట్టి ప్రతి ఉపాధి కూలికి వందరోజుల పని దినాలు కల్పించి రోజు కూలి 600 రూపాయలు ఇస్తూ 15 రోజుల ఒకసారి గా పేమెంట్ చెల్లించాలని ఈ సందర్భంగా కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మున్సిపాలిటీలలో కూడా ఉపాధి పనిని పెట్టాలని అన్నారు.

# జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ నీ కలిసిన తుడుం దెబ్బ నాయకులు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.**

**మార్చి 18.** అసరా పేటలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ ని కలిసిన తుడుం దెబ్బ నాయకులు పలు సమస్యలపై మెమోరాండం ఇవ్వడం జరిగినది వారు మాట్లాడుతూ నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న ఆదివాసి భూములు కనుమరుగైపోతున్నాయని కొంతమంది ఇతర కులస్తులు అధికారులతో కుమ్మక్కై దొంగ పాసు బుక్కులు తయారుచేసి ఆదివాసి పువ్వులను లాక్కుంటున్నారని ఏజెన్సీ ప్రాంతంలో సర్వహక్కులు ఆదివాసులకే ఉండాలని, ఆదివాసి చట్టాలను ప్రతిష్ట చేయాలని అన్యాకాంతమైన ప్రభుత్వ భూములను వెలుగు తీసి ఆ భూములను భూమిలేని నిరుపేదలకు పంచాలని ప్రతి మండలానికి ఒక ఆదివాసి కమ్యూనిటీ హాల్ కేటాయించాలని ఆదివాసి చట్టాలు హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తంబళ్ల రవి, రాష్ట్ర నాయకులు బండారు సూర్యనారాయణ అశ్వరావుపేట మండలం తుడుం దెబ్బ నాయకులు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ బలోపితానికి కృషి

**- అన్ని గ్రామాలలో తెలుగుదేశం పార్టీ క్యాడర్ చెక్కుచెదరలేదు.**
**- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ రామన్ గౌడ్.**



,పెబ్బేరు: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో తెలుగుదేశం పార్టీ క్యాడర్ చెక్కుచెదరకుండా ఉన్నదని తెలంగాణ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామన్ గౌడ్ తెలుగుదేశం పార్టీ అధినేత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మంగళవారం కలిసిన భేటీలో చర్చించారు. ఈ భేటీలో ప్రధానంగా అన్ని గ్రామాలలో పార్టీ క్యాడర్ ఉన్నప్పటికీ నాయకత్వ లోపం కారణంగా కార్యకర్తలలో నిరుత్సాహం కలుగుతుందని, తెలంగాణ రాష్ట్రంలో పర్యటించి రాష్ట్ర కార్యాలయం హైదరాబాదులో వారంలో ఒకరోజు సమయం కేటాయించాలని కోరారు. మరియు హైదరాబాద్ లోని తమరి ఆధీనంలో ఉన్న రాష్ట్ర కార్యాలయంలో ద్వితీయ స్థాయి నాయకులను పరిశీలించి వివిధ పదవులలో అవకాశాలు కల్పించాలని కోరారు.రాష్ట్రంలో పార్టీని పటిష్ట పరచడంలో భాగంగా సమర్థవంతమైన నాయకుడిని రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకం చేయాలని కోరారు.తద్వారా రాష్ట్రంలో పార్టీ పునర్నిర్మాణంలో భాగంగా గ్రామస్థాయి నుంచి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను సమీకరించి రాష్ట్రస్థాయి వరకు పార్టీ పునర్ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు.

# అసెంబ్లీ ఆవరణలో బిజెపి సభ్యుల బైఠాయింపు

**హైదరాబాద్,మార్చి18:** తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో భాజపా ఎమ్మెల్యేలు బైఠాయించారు. ఆ పార్టీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీశ్, ధన్‌పాల్ సూర్యనారాయణ తదితరులు నిరసన తెలిపారు. మంగళవారం ఉదయం బీజేవైఎం ఆధ్వర్యంలో చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ తర్వాత అసెంబ్లీ వద్దకు తీసుకొచ్చారు. అయితే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని రోడ్లపై తిప్పారంటూ భాజపా ఎమ్మెల్యేలు అసెంబ్లీ వద్ద ఆందోళన చేపట్టారు. పోలీసుల వైఖరిని ఖండిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనకు దిగారు.

# డికె అరుణ ఇంట్లో చొరబడ్డ వ్యక్తి అరెస్ట్

**హైదరాబాద్,మార్చి18**: భాజపా ఎంపీ డీకే అరుణ ఇంట్లో చొరబడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని దిల్లీకి చెందిన అక్రమ్‌గా గుర్తించారు. అతడిని వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్, జూబ్లీహిల్స్ పోలీసులు విచారిస్తున్నారు. ఎంపీ ఇంట్లోకి చొరబడేందుకు గల కారణాలను తెలుసుకుంటు-న్నారు. అక్రమ్ గతంలో హైదరాబాద్‌లోని పాతబస్తీ, దిల్లీలోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు- సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో సీపీ సీవీ ఆనంద్ సోమవారం ఎంపీ ఇంటికి చేరుకుని వివరాలను సేకరించిన విషయం తెలిసిందే. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 56లోని ఎంపీ నివాసంలోకి నిందితుడు ముసుగు ధరించి ఇంటి వెనుక నుంచి లోపలికి ప్రవేశించాడు. సీసీ కెమెరా వైర్లను కత్తిరించి, సుమారు గంట పాటు- ఇంట్లో తిరిగి అక్కడి నుంచి జారుకొన్నాడు. ఆమె కుమార్తె ఉదయం నిద్రలేచి చూసేసరికి ఇల్లంతా చిందరవందరగా ఉంది.

# జర్నలిస్టులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ కలిగి ఉండాలి

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి.**
**- విజయవంతంగా సాగిన ఉచిత మెగా వైద్య శిబిరం.**
**- దాదాపు 250 మందికి పైగా పాల్గొన్న జర్నలిస్టులు.**





**పెబ్బేరు:** సమాజంలోని సమస్యలను వెలికితీయడంతో పాటు జర్నలిస్టులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ కలిగి ఉండాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు.మంగళవారం టీయూడబ్ల్యూజే ( ఐజేయు)ఆధ్వర్యంలో చిట్యాల గ్రామ శివారులోని దేశినేని శ్యామలమ్మ ఫంక్షన్ హాల్లో మెడికవర్ హాస్పిటల్స్ హైటెక్ సిటీ వారి సహకారంతో జిల్లాలోని జర్నలిస్టుల కు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.టీయూడబ్ల్యూజే (ఐజెయూ) రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై,జ్యోతి ప్రజ్వలన చేసి వైద్య పరీక్షలను ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ..సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని,ఎన్నో సమస్యల్ని వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారం దిశగా చొరవ చూపుతారని చెప్పారు.మన దేశంలో ఎంతోమంది గొప్ప జర్నలిస్టులు ఉన్నారని,పెద్ద పెద్ద కుంభకోణాలను బయట పెట్టడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని కొనియాడారు.జర్నలిస్టులు సమయాభావం లేకుండా పని చేస్తుంటారు.కాబట్టి వారి సొంత ఆరోగ్యం పైన సైతం శ్రద్ధ వహించాలని సూచించారు.ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించకపోతే డయాబెటిస్,బిపి,గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల దృష్టి సారించాలన్నారు.శారీరకంగా ఫిట్ గా ఉండడం అనేది చాలా ముఖ్యమని,ఎన్ని కోట్లు పెట్టిన కొనలేనిది ఆరోగ్యమేనని,కాబట్టి జాగ్రత్తగా ఉండాలని చెప్పారు.నిత్యం వ్యాయామం చేయడంతో పాటు,ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.వ్యాయామం చేయడానికి తీరికలేని పరిస్థితుల్లో కనీసం ఫోన్లో మాట్లాడేటప్పుడు అయినా వాకింగ్ చేయడం ఉత్తమమని సూచించారు.నిత్యం వాకింగ్ చేయడం,వ్యాయామం చేయడం వల్ల అనేక వ్యాధుల్ని దరిచేరనీయకుండా చేయవచ్చని అన్నారు. ఏదైనా వ్యాధిని ముందుగానే గుర్తించడం ఉత్తమం అని,అందులో భాగంగానే జర్నలిస్టులు ఈ మెడికల్ క్యాంపు సద్వినియోగం చేసుకొని తమ జీవనశైలిలో మార్పులు చేసుకోవడం మేలని చెప్పారు.జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎన్నో మంచి కార్యక్రమాలు జరుగుతున్నాయని కలెక్టర్ గుర్తు చేశారు. మిషన్ మధుమేహ,టీబీ స్క్రీనింగ్ వంటి కార్యక్రమాలతో ఉచితంగా ఇంటింటికి వెళ్లి ఆశా కార్యకర్తలు,ఏఎన్ఎంలు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.వీటన్నిటిని అందరూ సద్వినియోగం చేసుకోవడమే కాకుండా ప్రజల్లోకి కూడా తీసుకువెళ్లాలని కలెక్టర్ సూచించారు.టియుడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధు గౌడ్ మాట్లాడుతూ యూనియన్ ఏర్పడి 70 సంవత్సరాలు అవుతుందని,ఉమ్మడి జిల్లాలో 40 సంవత్సరాలుగా జర్నలిస్టుల కోసం అనేక కార్యక్రమాలను నిర్విరామంగా నిర్వహిస్తున్న ఏకైక యూనియన్ టీయూడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ అని అన్నారు.కరోనా కష్టకాలంలో జర్నలిస్టుల కుటుంబాలకు నిత్యవసర సరుకులను అందించడమే కాకుండా వైద్య పరంగా కూడా సహకారం అందించినట్లు ఆయన తెలిపారు.జిల్లా వైద్యశాఖ అధికారులు కూడా సహాయం కోరిన వెంటనే జర్నలిస్టుల కుటుంబాల ఇంటికి వెళ్లి మరి ఆరోగ్య సేవలు అందించారని గుర్తు చేశారు.జిల్లాలో ఉన్న జర్నలిస్టులు దాదాపు 90 శాతం వార్తలను ఉన్నది ఉన్నట్లుగా రాసి అధికా రులకు ప్రజలకు మధ్య వారదులుగా నిలుస్తున్నారని అన్నారు.

# బదిలీపై వెళ్తున్న ఉద్యోగికి సన్మానం



**,పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు తహసిల్దార్ కార్యాలయం నందు డిప్యూటీ తహసిల్దారుగా పనిచేయుచున్నటువంటి లక్ష్మీకాంత్ ఘణ పూర్ మండలముకు బదిలీపై వెళ్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని తహసిల్దార్ లక్ష్మి,ఆర్ ఐ రాఘవేంద్రరావు మరియు కార్యాలయ సిబ్బంది మంగళవారం శాలువాతో ఘన సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అశ్వరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజీ డాక్టర్ నిర్వాకం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. మార్చ్ 18.**





అశ్వరావుపేట నియోజకవర్గం అశ్వరావుపేట మండల హెడ్ క్వార్టర్ ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజీ డాక్టర్ నిర్వాకం గర్భిణీ డెలివరీ కేసు బాధితులకి అందుబాటులో లేకుండా వారానికి రెండు మూడు రోజులు మాత్రమే వస్తూ ఉన్నారని తమను పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు సోమవారం నాడు డెలివరీ కేసు ఒకటి రాగా అప్డేట్ చేసుకుని డెలివరీ చేపిస్తామని చెప్పి తమను పట్టించుకోకుండా మధ్యాహ్నమే వెళ్లిపోయారని ఆరోజు సాయంత్రం నొప్పులు వస్తూ బ్లీడింగ్ అవుతుంటే గైనకాలజీ డాక్టర్ వచ్చి చూడకుండా నరుషులతోనే చూపించి వెళ్లిపోండి రిఫర్ చేస్తామని చెప్పించామన్నారు. డబ్బులు లేకే కదా మేము ఈ హాస్పిటల్ కి వచ్చింది తీరా చూస్తే డాక్టర్లు అందుబాటులో లేకుండా మమ్మల్ని పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు ఆసుపత్రిలో గైనకాలజీ సెక్షన్ ఉన్నప్పుడు డాక్టర్ ఎప్పుడు అందుబాటులో ఉండాలని అలా కాకుండా వేరే ఊర్లో ఉంటూ వచ్చి ఉద్యోగం చేసి వెళ్ళిపోతే రోగులకు అందుబాటులో ఎలా ఉంటారని ప్రజలందరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇకనుండి అయిన ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోని డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు

# తిరుమలలో 25,30 విఐపి దర్శనాలు రద్దు

**తిరుమల,మార్చి18:** మార్చి 25, 30న తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు- టిటిడి అధికారులు తెలిపారు. మార్చి 25న శ్రీవారి కోయిల్ అల్వార్ తిరుమంజనం, మార్చి 30 ఉగాదిన శ్రీవారి ఆస్థానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు- అధికారులు వెల్లడించింది. ఈ సందర్భంగా వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు- వెల్లడించారు. అలాగే శ్రీవారి ఆలయంలో నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన సేవ సైతం రద్దు చేస్తున్నట్లు- స్పష్టం చేశారు. ఈ షెడ్యూల్ ప్రకారం వీఐపీ భక్తులు తిరుమల శ్రీవారి దర్శన ఏర్పాట్లు- చేసుకోవాలని అధికారులు సూచించారు.

# బ్యాక్ రుణాల అవకతవకలపై ఆందోళన

**రాజవొమ్మంగి,మార్చి18:** బ్యాంకు రుణాలు అవకతవకలపై స్థానిక వెలుగు కార్యాలయంవద్ద మహిళలు మంగళవారం ఆందోళన చేపట్టారు. మండలంలోని తంటికొండ పంచాయతీ వట్టిగడ్డ గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలకు రాజవొమ్మంగి యూనియన్ బ్యాంకులో 33 డ్వాక్రా సంఘాలు ఉండగా అందులో 15 డ్వాక్రా సంఘాలలో సంఘ సభ్యులు అనుమతులు, ఎటువంటి సమాచారం లేకుండా డ్వాక్రా రుణాలు మంజూరు చేసి బ్యాంకు ఖాతాలో జమ చేసి తిరిగి బ్యాంకు వారే తీసుకున్నారంటూ వట్టిగడ్డ గ్రామానికి చెందిన గ్రూపులకు చెందిన సుమారు వందమంది డ్వాక్రా మహిళలు రాజవొమ్మంగి వెలుగు ఆఫీస్ వద్ద ఆందోళన చేపట్టారు. తమకు రుణాలు మంజూరైనట్లు గాని డబ్బులు వేసినట్టుగాని తీసినట్లు- గాని ఏటువంటి విషయాలు తెలియదని మాకు తెలియకుండా బ్యాంకులో లావాదేవీలు ఎలా జరిగాయంటూ ఏపిఎం రామాంజనేయులు, ఎంఎంఎస్ సభ్యులను నిలదీశారు. ఈనేపథ్యంలో వెలుగు ఏపీఎం రామాంజనేయులు, ఎంఎంఎస్ లీడర్లు స్పందించి బుధవారం తమ ఒట్టిగడ్డ గ్రామంలో సమావేశం ఏర్పాటు- చేసి సమస్యలను తెలుసుకుని చర్యలు చేపడతామని డ్వాక్రా మహిళలకు హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో దూసరపాము ఎంపీటీసీ నల్ల సత్యనారాయణ, ఒట్టిగెడ్డ గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

# ఛావా సినిమాతో ప్రజల్లో ఆగ్రహావేశాలు

## మహారాష్ట్ర అల్లర్లపై సిఎం దేవేంద్ర ఫడ్నవీస్

**ముంబై,మార్చి18:** నాగ్‌పూర్ అల్లర్ల, హింస నేపథ్యంలో మహారాష్ట్ర అసెంబ్లీలో 'ఛావా' సినిమాపై సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ కీలక వ్యాఖ్యలు చేశారు. మరాఠా ఛత్రపతి శంభాజీ మహారాజ్ చరిత్ర తెరపైకి వచ్చిందని, ఇది మొఘల్ పాలకుడు ఔరంగజేబుపై ఆగ్రహాన్ని రేకెత్తించిందని ఆయన అన్నారు. సోమవారం రాత్రి నాగ్‌పూర్‌లో జరిగిన అల్లర్ల నేపథ్యంలో అసెంబ్లీలో మాట్లాడుతూ, ఫడ్నవీస్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఛావా సినిమాను తాను నిందించాలని అనుకోవడం లేదని, ఛావా ఛత్రపతి శంభాజీ మహారాజ్ చరిత్రను ప్రజల ముందుకు తీసుకువచ్చిందని, దీంతో ప్రజల మనోభావాలు రగిలిపోయాయని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఔరంగజేబుపై ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని, శాంతిభద్రతలను కాపాడుకోవాలని, ప్రతీ ఒక్కరూ ఓపికతో ఉండాలని, ఎవరైనా అల్లర్లు చేస్తే కులం, మతం అనే తేడా లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. విక్కీ కౌశల్ లీడ్‌రోల్‌లో లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో వచ్చిన బాలీవుడ్ సినిమా 'ఛావా' సంచలనం క్రియేట్ చేసింది. ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం రికార్డ్ కలెక్షన్లను రాబట్టింది.

# టాప్ టీమ్స్‌పై పంత్ టార్గెట్.. ఒక్క వీడియోతో దడ పుట్టిస్తున్నాడు..

ఐపీఎల్-2025 కోసం అటు ఆటగాళ్లతో పాటు ఇటు అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరో నాలుగు రోజుల్లో క్యాష్ రిచ్ లీగ్ కొత్త సీజన్ స్టార్ట్ కానుంది. దీంతో ప్లేయర్లంతా ఒక్కో లక్ష్యంతో బరిలోకి దిగుతున్నారు. లక్నో సూపర్ జియాంట్స్ కొత్త సారథి రిషబ్ పంత్ కూడా బిగ్ టార్గెట్‌తోనే వస్తున్నాడు. అసలు.. అతడి లక్ష్యాలు ఏంటి.. కొత్త సీజన్‌లో పంత్ ఏం చేయాలని అనుకుంటున్నాడు.. లక్నో విజయం కంటే కూడా రిషబ్ సాధించాల్సిన ఘనతలు ఏం ఉన్నాయి.. అనేది ఇప్పుడు చూద్దాం..గూస్‌బంప్స్ స్పీచ్‌మెగా ఆక్షన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి లక్నో సూపర్ జియాంట్స్‌కు వచ్చేశాడు పంత్. అతడ్ని ఏకంగా రూ.27 కోట్ల ఊహించని ధర చెల్లించి మరీ దక్కించుకుంది ఎల్ఎస్‌జీ. దీంతో కప్పు వేటలో టీమ్‌ను ముందంజలో ఉంచే బాధ్యత అతడి మీద ఉంది. బ్యాటర్‌గా, వికెట్ కీపర్‌గా రాణించడంతో పాటు కెప్టెన్‌గా సత్తా చూపించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో పంత్ గట్టి ప్లానింగ్‌తో ముందుకెళ్తున్నట్లు కనిపిస్తోంది. చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్ రైడర్స్ వంటి బడా జట్లను అతడు టార్గెట్ చేస్తున్నట్లు



తెలుస్తోంది. అందుకు అతడి తాజా స్పీచ్ ఉదాహరణగా నిలుస్తోంది. అందులో గూస్‌బంప్స్ తెప్పించే విషయాలను సహచరులతో పంచుకున్నాడు పంత్. మనం ఏదైనా సాధించగలమని నమ్మాలన్నాడు.అంతా మీ చేతుల్లోనే..: పంత్ఆటగాళ్లు స్వేచ్ఛగా ఆడే అవకాశాన్ని కల్పించాలని చూస్తున్నాం. జట్టులో అద్భుతమైన వాతావరణాన్ని సృష్టించాలని అనుకుంటున్నాం. అయితే ఇది మేనేజ్‌మెంట్ చేతుల్లో లేదు. ఇది చేయాల్సింది మనమే (ప్లేయర్లమే). ప్రతి ఆటగాడికి మేం అండగా ఉంటాం. వరుస అవకాశాలు ఇస్తాం. సీనియర్లు కూడా వాళ్ల అనుభవాలు మీతో పంచుకుంటారు. ప్రతి మ్యాచ్‌ను చాలెంజ్‌గా తీసుకుందాం. 100 శాతం ఎఫర్ట్ పెడదాం. టీమ్ కోసం ఏం చేయాలో అది చేద్దాం. మీరంతా తోపులు కాబట్టే ఇక్కడ ఉన్నారు. ఎన్నో మర్చిపోలేని అనుభూతులు, జ్ఞాపకాలను సృష్టిద్దాం.అది కంపల్సరీ..బిగ్ టీమ్స్‌తో మ్యాచుల్లో గెలుపే లక్ష్యంగా పంత్, కోచ్ జస్టిన్ లాంగర్ గట్టి ప్లాన్స్ వేస్తున్నారని వినిపిస్తోంది. ప్లేఆఫ్స్‌కు చేరాలంటే బడా జట్ల మీద విజయం సాధించడం చాలా అవసరమని భావిస్తున్నారట. అదే ఊపులో ఫైనల్స్‌కు చేరుకొని కప్పు సొంతం చేసుకోవాలనేది ఎల్ఎస్‌జీ ప్లాన్ అని సమాచారం. అందుకే టీమ్‌లోని ప్రతి ఆటగాడ్ని అందుకు తగ్గట్లు ఇప్పటి నుంచే రెడీ చేస్తున్నారట. గెలుపు తప్ప వేరేదేదీ అక్కర్లేదు.. ఫియర్‌లెస్ అప్రోచ్‌తో ముందుకెళ్లేలా పంత్ ప్రణాళికలు రచిస్తున్నట్లు వినిపిస్తోంది.

# ఐపీఎల్ కెప్టెన్లకు బీసీసీఐ హుకుం.. వెంటనే రావాలంటూ..



ఇండియన్ ప్రీమియర్ లీగ్ నయా సీజన్‌కు టైమ్ దగ్గర పడుతోంది. ఈ శనివారం నుంచి క్యాష్ రిచ్ లీగ్‌కు తెరలేవనుంది. అటు ఆటగాళ్ల నుంచి ఇటు అభిమానుల వరకు అంతా టోర్నమెంట్ ఆరంభం కోసం ఎదురు చూస్తున్నారు. ధనాధన్ ఆటతో వినోదాన్ని పంచాలని ప్లేయర్లు.. వాళ్ల విన్యాసాలు చూసి ఎంజాయ్ చేయాలని అభిమానులు రెడీ అవుతున్నారు. ఈ తరుణంలో ఐపీఎల్ కెప్టెన్లకు సమన్లు జారీ చేసింది భారత క్రికెట్ బోర్డు. బీసీసీఐ ఇలా ఎందుకు చేసింది.. అనేది ఇప్పుడు చూద్దాం..చలో ముంబై..ఐపీఎల్ 18వ ఎడిషన్ ఆరంభానికి ముందు ఫ్రాంచైజీల కెప్టెన్లకు బీసీసీఐ ఆర్డర్ వేసింది. మార్చి 20వ తేదీన ముంబైకి రావాలని ఆదేశించింది. 22 నుంచి కొత్త సీజన్ స్టార్ట్ కానున్న నేపథ్యంలో దానికి రెండ్రోజుల ముందు ముంబైలోని బీసీసీఐ హెడ్‌క్వార్టర్స్‌లో మీటింగ్ నిర్వహిస్తున్నారట. ఇందులో లీగ్‌లోని 10 ఫ్రాంచైజీల కెప్టెన్స్‌తో పాటు ఆయా జట్ల మేనేజర్లు కూడా హాజరు కానున్నారట. ఒక గంట పాటు ఈ సమావేశం ఉండొచ్చని తెలుస్తోంది. ప్లాన్ చేంజ్..కొత్త ఎడిషన్‌లో చేసిన మార్పుచేర్పులు, రూల్స్‌పై ఐపీఎల్ కెప్టెన్స్, మేనేజర్స్‌తో చర్చిస్తారట బీసీసీఐ పెద్దలు. ఆ తర్వాత ముంబైలోని ప్రఖ్యాత తాజ్ హోటల్‌లో స్పాన్సర్ కార్యక్రమాలు, కెప్టెన్స్ ఫొటో షూట్, లంచ్ లాంటివి ఉంటాయని సమాచారం.

సాధారణంగా ప్రతి ఐపీఎల్‌కు ముందు అన్ని జట్ల సారథులతో ఫొటోషూట్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా తొలి మ్యాచ్‌కు ఆతిథ్యం ఇస్తుండటంతో ఈసారి కోల్‌కతాలో ఫొటోషూట్ జరగాల్సింది. కానీ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు చాలా ఆలస్యంగా తమ కొత్త సారథి (అక్షర్ పటేల్) పేరును ప్రకటించడంతో కెప్టెన్స్-మేనేజర్స్‌తో బీసీసీఐ మీటింగ్ లేట్ అయిందట. దీంతో ఫొటోషూట్ తతంగాన్ని కూడా ముంబైలోనే పూర్తి చేయాలని బోర్డు పెద్దలు నిర్ణయించారని తెలుస్తోంది.

# ఇన్వెస్టర్లకు శుభవార్త.. త్వరలో అమెజాన్ ఐపీఓ కూడా..

ఇన్వెస్టర్లకు గుడ్ న్యూస్ రాబోతుంది. ఎందుకంటే అమెరికాకు చెందిన ప్రముఖ ఈ కామర్స్ సంస్థ అమెజాన్‌కూడా ఇండియాలో తన భారతీయ విభాగాన్ని సపరేట్ చేసి స్టాక్ మార్కెట్లో ఐపీఓకు రావాలని చూస్తోంది. ఈ అంశంపై ఇప్పటికే కంపెనీ వర్గాలు చర్చలు ప్రారంభించినట్లు తెలిసింది.ఈ క్రమంలో అమెజాన్ తన వాల్ స్ట్రీట్ బ్యాంకింగ్ భాగస్వామి జేపీ మోర్గాన్‌తోపాటు భారతదేశంలోని పెట్టుబడి బ్యాంకులతో చర్చలు ప్రారంభించిందని ఓ నివేదిక తెలిపింది.ఇప్పటికే పలు బ్యాంకులతో..ఈ నేపథ్యంలో గత వారం అమెజాన్ ఇండియా దీని కోసం 8 నుంచి 10 పెట్టుబడి బ్యాంకులను ఆహ్వానించింది. భారత నిబంధనల ప్రకారం, దేశీయ కంపెనీలు మాత్రమే ఇన్వెంటరీ ఆధారిత ఇ-కామర్స్ మోడల్ కింద పనిచేస్తాయి. తద్వారా వేగవంతమైన డెలివరీలు, షిప్పింగ్ ఖర్చులను తగ్గించుకోవడానికి అవకాశం ఉంటుంది.అయితే, విదేశీ సంస్థలు




కొనుగోలుదారులు, విక్రేతల మధ్య మధ్యవర్తిగా పనిచేసే మార్కెట్ ప్లేస్ మోడల్ విధానాన్ని అనుసరించాలి. ఈ నియంత్రణ అంతరం చాలా కాలంగా అమెజాన్‌కు సవాలుగా మారింది. మరోవైపు ఫ్లిప్‌కార్ట్, రిలయన్స్ జియోమార్ట్ వంటి స్వదేశీ కంపెనీలతో సమర్థవంతంగా పోటీ పడే సామర్థ్యాన్ని పరిమితం చేస్తుంది.2030 నాటికిఈ నిర్ణయం ద్వారా అమెజాన్ ప్రధానంగా స్థానిక డేటా అవసరాలు, భారతదేశంలో ప్రత్యక్ష జాబితాను నిర్వహించగల సామర్థ్యాన్ని కల్గి ఉంటుందని నివేదిక తెలిపింది. ఈ క్రమంలో మార్కెట్లో ఖర్చులు తగ్గిపోయి, వ్యాపారం పెరిగే అవకాశం ఉంటుంది. ఇప్పటికే భారతదేశంలో ఈ-కామర్స్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇంటర్నెట్ వ్యాప్తి, డిజిటల్ చెల్లింపు పరిష్కారాలు పెరుగుతున్నాయి. దీంతో ఈ పరిశ్రమ 2030 నాటికి 350 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ఈ విభాగంలో అపారమైన వృద్ధి అవకాశం ఉందని చెబుతున్నారు.వ్యూహాత్మక చర్యలుఈ నేపథ్యంలో భారతదేశంలో తన వ్యాపారాన్ని విస్తరించడానికి తీసుకుంటోంది.

# దేశీయ సూచీలకు భారీ లాభాలు.. ఈ రోజు టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..



భారత వాణిజ్య లోటు మూడేళ్ల కనిష్టానికి చేరడం, వరుస నష్టాల నేపథ్యంలో చాలా స్టాక్స్ ఆకర్షణీయంగా మారడంతో మదుపర్లు మళ్లీ కొనుగోళ్లకు మొగ్గు చూపుతున్నారు. సోమవారం లాభాలు అందుకున్న దేశీయ సూచీలు మంగళవారం కూడా అదే జోరును చూపించాయి. చైనా తీసుకుంటున్న ఉద్దీపన చర్యలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరచడంతో ఆసియా మార్కెట్లు భారీ లాభాలను ఆర్జించాయి. అదే బాటలో సెన్సెక్స్, నిఫ్టీ కూడా కదలాడాయి సోమవారం ముగింపు (74, 169)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం దాదాపు 500 పాయింట్ల లాభంతో ప్రారంభమైన సెన్సెక్స్ రోజంతా లాభాల్లోనే కదలాడింది. మధ్యాహ్నం తర్వాత ఆ లాభాలు మరింత పెరిగాయి. ముఖ్యంగా మెటల్, ఐటీ, ఫైనాన్స్ స్టాక్స్ భారీ లాభాలను ఆర్జించాయి. దీంతో సెన్సెక్స్ చాలా రోజుల తర్వాత 75 వేలను దాటింది. చివరకు సెన్సెక్స్ 1,131 పాయింట్ల లాభంతో 75, 301 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 3251 పాయింట్ల లాభంతో 22, 834 వద్ద స్థిరపడింది.సెన్సెక్స్‌లో పేటీఎమ్, పీబీ ఫిన్‌టెక్, జొమాటో, ఐఐఎఫ్ఎల్ షేర్లు లాభాలను ఆర్జించాయి.

# సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్‌లో ధోని.. ఈ కాంబో ఊహించలేదు..



సందీప్ రెడ్డి వంగా.. ఈ పేరు వినగానే ఇంటెన్స్ మూవీస్ గుర్తుకొస్తాయి. అర్జున్ రెడ్డి, యానిమల్ చిత్రాలతో ఇంటెన్స్ డైరెక్టర్‌గా ఆయన గుర్తింపు సంపాదించాడు. ప్రేమ అనే ఎమోషన్‌ను ఆయన డెప్త్ వరకు వెళ్తూ చూపించే తీరుకు ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే. దీనికి తోడు తనదైన శైలిలో మాస్ టచ్ ఇస్తూ, ఆల్ఫా మెన్ స్టైల్‌లో హీరో క్యారెక్టర్స్‌ను ఆయన ప్రెజెంట్ చేసే తీరు స్టన్నింగ్ అనే చెప్పాలి. ఇప్పుడు ఇదే అవతార్‌లో క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీని చూపించి అందరికీ షాక్ ఇచ్చాడు సందీప్ వంగా.

అచ్చం రణ్‌బీర్‌లా..ఎంఎస్ ధోనీని మాస్ గ్యాంగ్‌స్టర్‌లా చూపించాడు సందీప్ వంగా. ఓ సైకిల్ సంస్థకు సంబంధించిన యాడ్ షూట్ కోసం వీళ్లిద్దరూ చేతులు కలిపారు. సాధారణంగా ధోనీని అంతా స్టైలిష్‌గా చూపిస్తారు. కానీ సందీప్ మాత్రం స్టైల్‌తో పాటు పవర్‌ఫుల్‌గా ప్రెజెంట్ చేశారు. యాటిట్యూడ్, అగ్రెషన్‌ను కలిపి కొంచెం ఫన్నీగానూ చూపించారు. బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'యానిమల్'లో రణ్‌బీర్ కపూర్‌ను పోలిన లుక్‌లో ధోని కారులో నుంచి దిగడం, నడుచుకుంటూ వెళ్లడం, సందీప్ వంగా విజిల్ వేయడం హైలైట్‌గా నిలిచాయి. ఈ యాడ్ వీడియో చూసిన ఫ్యాన్స్.. వీళ్ల కాంబోలో గనుక ఓ సినిమా వస్తే థియేటర్లు దద్దరిల్లాల్సిందేనని అంటున్నారు. పోతారు.. అంతా పోతారు అని ఫన్నీ కామెంట్స్ చేస్తున్నారు. బాక్సాఫీస్ షేక్ అవ్వాల్సిందేనని చెబుతున్నారు. కాగా, ఐపీఎల్-2025 కోసం నెట్స్‌లో భీకరంగా ప్రాక్టీస్ చేస్తున్నాడు మాహీ. సీఎస్‌కేకు మరో కప్పు అందించాలని కసిగా సాధన చేస్తున్నాడు.

# ధోని గిఫ్ట్‌కు షాకైన అశ్విన్.. అస్సలు ఎక్స్‌పెక్ట్ చేయలేదంటూ..



మహేంద్ర సింగ్ ధోని-రవిచంద్రన్ అశ్విన్.. టీమిండియా అభిమానులతో పాటు చెన్నై సూపర్ కింగ్స్ ఫ్యాన్స్‌కు ఈ జోడీ అంటే చాలా ఇష్టం. ఇద్దరూ మంచి దోస్తులు. అంతకంటే కూడా వీళ్ల మధ్య గురుశిష్యుల బంధం ఉందని చెప్పొచ్చు. మాహీ సారథ్యంలో భారత జట్టులోకి వచ్చిన అశ్విన్.. అతడితో పాటు కోహ్లీ, అశ్విన్ లాంటి ఇతర సారథులూ అండగా నిలవడంతో ఈ స్థాయికి చేరుకున్నాడు. అశ్విన్ బౌలింగ్-ధోని కీపింగ్.. ఇది బ్లాక్‌బస్టర్ కాంబినేషన్. టీమిండియాతో పాటు ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కు ఆడుతున్నప్పుడు ఈ జోడీ అదిరిపోయే ఆటతీరుతో అభిమానుల మనసు దోచుకుంది. మధ్యలో విడిపోయిన అశ్విన్-ధోని.. ఐపీఎల్ కొత్త ఎడిషన్ కోసం మళ్లీ ఒక్కటయ్యారు.తిరిగి సొంతగూటికి..అశ్విన్ తన పాతగూటికి చేరుకున్నాడు. మళ్లీ చెన్నై సూపర్ కింగ్స్‌తో జతకట్టాడు. కొత్త సీజన్ కోసం ప్రాక్టీస్‌లో చెమటలు కక్కుతున్నాడు అశ్విన్. ధోని, జడేజా లాంటి పాత సీఎస్‌కే సహచరులతో కలసి దుమ్మురేపాలని అనుకుంటున్నాడు. ఈ తరుణంలో అతడు ఆసక్తికర విశేషాలు పంచుకున్నాడు. తన 100వ టెస్ట్ నేపథ్యంలో మాహీ చేతుల మీదుగా మెమొంటో అందుకోవాలని భావించానని.. కానీ కుదరలేదన్నాడు.అతడే ఆహ్వానించాడుఅశ్విన్ పిలిచినా ఆ మ్యాచ్‌కు వచ్చేందుకు ధోనీకి కుదర్లేదట. ఆ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇచ్చిన ధర్మశాలకు వచ్చేందుకు మాహీ ఎంతగా ప్రయత్నించినా సాధ్యం కాలేదట. అయితే అంతకంటే ధోని తనకు పెద్ద బహుమతి ఇచ్చాడని తాజాగా అశ్విన్ రివీల్ చేశాడు. తిరిగి తనను చెన్నై సూపర్ కింగ్స్‌లోకి ఆహ్వానించాడని స్పష్టం చేశాడు. సీఎస్‌కేకు ఆడే అవకాశం కల్పించిన ధోనీకి అతడు థ్యాంక్స్ చెప్పాడు. దిగ్గజ ఆటగాడు ఇలా చేస్తాడని తాను ఊహించలేదన్నాడు. కాగా, 2008లో చెన్నైతో ఐపీఎల్ జర్నీ స్టార్ట్ చేసిన అశ్విన్.. 2015లో ఆ టీమ్‌ను వీడాల్సి వచ్చింది. ఈ గ్యాప్‌లో పంజాబ్, రాజస్థాన్, ఢిల్లీ జట్లకు ఆడాడతను. అయితే రిటైర్మెంట్ తర్వాత తిరిగి సొంతగూటికి చేరుకున్నాడు లోకల్ బాయ్. దీంతో చెన్నై ఫ్యాన్స్ అతడిపై గంపెడాశలు పెట్టుకున్నారు.

# యుద్ధభూమిని వీడొద్దు.. హార్దిక్ మాటలు వింటే గూస్‌బంప్సే



టీమిండియా స్టైలిష్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కెరీర్‌లో ఒక్క ఏడాదిలో ఊహించని మార్పు వచ్చింది. గతేడాది ఐపీఎల్ సమయంలో అతడ్ని బూ.. అంటూ ఎగతాళి చేశారు అభిమానులు. గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబై ఇండియన్స్‌కు మారడం, రోహిత్ శర్మను తీసేసి అతడికి సారథ్యం ఇవ్వడం చాలా మంది ఫ్యాన్స్‌కు రుచించలేదు. దీంతో పాండ్యాను ట్రోల్ చేశారు. అయితే అటు టీ20 వరల్డ్ కప్‌తో పాటు చాంపియన్స్ ట్రోఫీ విన్నింగ్ టీమ్‌లో కీలకపాత్ర పోషించి తిరిగి అందరి నుంచి ప్రశంసలు అందుకుంటున్నాడు హార్దిక్. ఈ నేపథ్యంలో యుద్ధభూమిని వీడొద్దంటూ అతడు తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. పాండ్యా ఇంకా ఏమన్నాడంటే..అదే నా సిద్ధాంతం: పాండ్యాయుద్ధభూమిని ఎల్లప్పుడూ వీడొద్దనేది నా ఫిలాసఫీ. విజయం ఒక్కటే కాకుండా టీమ్‌లో నా బెర్త్‌ను కాపాడుకోవడం.. ప్లేస్‌ను నిలబెట్టుకోవడం లాంటి ఎన్నో ఫేజెస్‌ను కెరీర్‌లో చూశా. నా జీవితంతో పాటు కెరీర్‌లోనూ ఎన్నో విషయాలు జరుగుతున్నా నేను మాత్రం క్రికెట్ మీద మాత్రమే దృష్టి పెట్టా. ఈ ఆటే నాకు బెస్ట్ ఫ్రెండ్ అని అర్థం చేసుకున్నా. ఎన్ని కష్టనష్టాలు వచ్చినా, అవాంతరాలు ఇబ్బంది పెట్టినా, సమస్యలు కుంగదీసినా వాటిని దాటుకుంటూ ముందుకు సాగుతున్నా. ఆఖరుకు అనుకున్న ప్రతిఫలం వచ్చింది. వరల్డ్ కప్ నెగ్గిన ఈ ఆరు నెలల్లో ఫ్యాన్స్ నుంచి దొరికిన లవ్, సపోర్ట్‌కు నా కృతజ్ఞతలు. వాళ్ల ప్రేమకు ధన్యుడ్ని. నా మీద అభిమానులు ఇలాగే లవ్ చూపించాలని కోరుకుంటున్నా.

# ఆ కుర్రాడో అద్భుతం.. ఫ్యూచర్ అతడి చేతుల్లోనే కోహ్లీ



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఓ కుర్ర క్రికెటర్‌ను ఆకాశానికెత్తేశాడు. అతడో అద్భుతమని ప్రశంసించాడు. చాలా టాలెంటెడ్ బ్యాటర్ అని మెచ్చుకున్నాడు. సాధారణంగా విరాట్ అంత ఈజీగా ఎవర్నీ పొగడడు. అవ తలి ఆటగాళ్లలోని నైపుణ్యం, క్రమశిక్షణ, పట్టుదలను చూసే కామెంట్స్ చేస్తుంటాడు. అలా ఒటిది ఓ యంగ్ బ్యాటర్‌ను ఈ రేంజ్‌లో మెచ్చుకోవడం అంటే సమ్‌థింగ్ స్పెషలే. మరి.. కింగ్ కోహ్లీ నుంచి ప్రశంసలు అందుకున్న ఆ ఆటగాడు ఎవరు.. అనేది ఇప్పుడు చూద్దాం..మీ సపోర్ట్ అవసరంరాయల్ చాలెంజర్స్ బెంగళూరు కొత్త కెప్టెన్ రజత్ పాటిదార్‌ను ప్రశంసల్లో ముంచెత్తాడు కోహ్లీ. బెంగళూరులో సోమవారం నిర్వహించిన ఆర్సీబీ అన్‌బాక్స్ ఈవెంట్‌లో విరాట్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. నయా సీజన్‌తో పాటు జట్టు కూర్పు గురించి పలు విషయాలు పంచుకున్నాడు. తన ప్రసంగం ముగిసే సమయంలో కొత్త సారథిని ఉద్దేశించి మాట్లాడాడు కోహ్లీ. రజత్ పాటిదార్ ఆర్సీబీని సుదీర్ఘ కాలం కెప్టెన్‌గా ముందుండి నడిపిస్తాడని అన్నాడు. అతడిపై ప్రేమ కురిపించండి, ఆదరించండి రజత్‌కు మీ సపోర్ట్ కావాలన్నాడు.

న్యూస్-9 సామాజిక అవసరం...సామాన్యుడి ఆయుధం తెలుగు దినపత్రిక
www.news9-india.com
news9.india News9India_ news9telugudaily

# కల్కి-2పై దర్శకుడు అదిరే అప్‌డేట్..

ప్రభాస్ హీరోగా వచ్చిన 'కల్కి 2898 ఏడీ' సక్సెస్ తర్వాత దాని కొనసాగింపుగా వచ్చే 'కల్కి2' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తాజాగా పార్ట్-2 దర్శకుడు నాగ్ అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ప్రభాస్ హీరోగా వచ్చిన 'కల్కి 2898 ఏడీ' సక్సెస్ తర్వాత దాని కొనసాగింపుగా వచ్చే 'కల్కి2' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తాజాగా పార్ట్-2 దర్శకుడు నాగ్ అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'కల్కి సినిమా తక్కువ టైమ్‌లో తీసే సినిమా కాదు. పెద్ద క్యాస్టింగ్, సీజీ వర్క్ ఎక్కువగా ఉండటం వల్ల ఆలస్యమవుతోంది. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. అసలు ప్రాజెక్ట్-కె అంటే ఏంటి అనే దగ్గరే ఉన్నాం. అది పూర్తయిన దాని బట్టి షూటింగ్ మొదలు



పెడతాం. ఈ ఏడాది చివరి నాటికి సెట్స్‌పైకి వెళ్లే ప్రయత్నం చేయాలనుకుంటున్నాం. 'కల్కి'లో మహాభారతం నేపథ్యాన్ని సెట్ చేసుకుని, సుమతి, అశ్వత్థామ పాత్రలను డిజైన్ చేసుకుని ఇక్కడదాకా వచ్చాం. ప్రభాస్ నిడివి పార్ట్2లో కచ్చితంగా ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా భైరవ, కర్ణ యాంగిల్‌లోనే కథ సాగుతుంది. రెండో భాగంలో వీటికి అధిక ప్రాధాన్యం ఉంటుంది. దీనికి చాలా వర్క్ చేయాల్సి ఉంది. విడుదల తేదీపై ప్రస్తుతం స్పందించలేను. ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని కథలతోనే సినిమాలు చేశా" అని అన్నారు.ప్రస్తుతం ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఏ హీరో చేయనన్ని ప్రాజెక్టలతో ప్రభాస్ క్షణం తీరిక లేకుండా ఉన్నారు. 'ది రాజా సాబ్', 'ఫౌజీ' ఉన్నాయి.

## మంచు ఫ్యామిలీకి బిగ్ షాక్ ..మంచు లక్ష్మీ అరెస్ట్ తప్పదా..

సినీ సెలబ్రిటీలు బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ బెట్టింగ్ యాప్స్ వ్యవహారాన్ని తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలపై తెలంగాణ పోలీసులు నజర్ పెట్టారు. బెట్టింగ్ యాప్స్ ని ప్రమోట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొనే ప్రయత్నం చేస్తున్నారు పోలీసులు. దీనిలో భాగంగానే పోలీసులు బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.తాజాగా 11 మంది సెలబ్రిటీలకు పోలీసులు షాకిచ్చారు.హర్షసాయి, పరేషాన్ బాయ్స్ ఇమ్రాన్ ఖాన్, టేస్టీ తేజ, కిరణ్ గౌడ్, విష్ణుప్రియ, యాంకర్ శ్యామల, రీతూ చౌదరి, బండారు షేషయాని సుప్రిత తదితరులపై పంజాగుట్ట పోలీసులు కేసులు నమోదు చేశారు.తాజాగా ఈ లిస్ట్‌లో మంచు మోహన్ బాబు కూతురు మంచు లక్ష్మీ పేరు కూడా తెర మీదకు వచ్చింది.ఆమె ఓ బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేస్తోన్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోలో మంచు లక్ష్మీ మాట్లాడుతూ..ఇది ఒక మంచి ప్లాట్ఫారం డబ్బు సంపాదించుకోవడానికి అందరికీ చక్కగా ఉపయోగపడుతుంది అంటూ యోలో 247 అనే బెట్టింగ్ యాప్‌ని ప్రమోట్ చేసింది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఇప్పటికే బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న సినీ సెలబ్రిటీలపై పోలీసులు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే.దీంతో ఇప్పుడు మంచు లక్ష్మీ బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేసిన వీడియో బయటకు రావడంతో పోలీసులు ఆమెపై కేసు అన్నది ఆసక్తికరంగా మారింది.



# బాలకృష్ణ సినిమాకు చిరంజీవి ప్రచారం

బాక్సాఫీస్ బరిలో నువ్వా నేనా అంటూ నాలుగు దశాబ్దాలుగా సాగుతున్న బాలకృష్ణ చిరంజీవి రియల్ లైఫ్ లో మంచి మిత్రులు. అందుకు నిదర్శనంగా చిరంజీవి ఇంట్లో ఫంక్షన్స్ లో బాలయ్య చేసిన సందడి, బాలయ్య అభినందన సభలో చిరంజీవి మురిపించిన వైనం అందరికీ తెలిసిందే! కానీ, బాక్సాఫీస్ వార్ లో మాత్రం ఇద్దరూ ఢీ అంటే ఢీ అంటూ సాగుతుంటారు. వారి ఫ్యాన్స్ కూడా పోటాపోటీగా ప్రచారాలు చేసుకుంటూనే ఉంటారు. ఇక 34 ఏళ్ళ క్రితం చిరు, బాలయ్య మధ్య బాక్సాఫీస్ వార్ మరింత రంజుగా ఉండేది. అలాంటి సమయంలో బాలయ్య సినిమాకు చిరంజీవి ప్రచారం చేయడం విశేషంగానే మారింది. ఆ సినిమా ఏదంటే 'ఆదిత్య 369'. ఈ చిత్రం 1991 జూలై 18న విడుదలయింది. భారతదేశంలో తొలి సోషియో హిస్టారికల్ ఫాంటసీ సైన్స్ ఫిక్షన్ గా 'ఆదిత్య 369' నిలచింది. ఇప్పటి దాకా ఆ జానర్ లో మరో మూవీ వెలుగు చూడలేదనుకోండి. అది మరో విశేషం!సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో మధురగాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సమర్పణలో 'ఆదిత్య 369' రూపొందింది. ఈ సినిమాకు బాలు సమీపబంధువు శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మాత. టైటిల్ కార్డ్స్ లో ఆయన సతీమణి ఎస్.అనితా కృష్ణ అన్న పేరు కనిపిస్తుంది. నిజానికి శివలెంక కృష్ణప్రసాద్ అసలు నిర్మాత. ఈ నాటికీ ఆయనను 'ఆదిత్య 369' నిర్మాతగానే జనం గుర్తిస్తూ ఉంటారు. అందుకు కృష్ణప్రసాద్ గర్వంగా ఫీలవుతూ ఉంటారు. బాలకృష్ణ అంగీకరిస్తేనే ఈ సినిమా - లేదంటే లేదు



అన్న రీతిన సాగింది. ఎందుకంటే ఇందులో కథానాయకుడు కృష్ణకుమార్ పాత్రను ఎవరైనా పోషించగలరు. కానీ టైమ్ మిషన్ ఎక్కి భూతకాలంలో విజయనగర సామ్రాజ్యంలోకి వెళతారు హీరో, హీరోయిన్. అక్కడ వారికి శ్రీకృష్ణదేవరాయలు భువనవిజయం కనిపిస్తుంది. అందులో శ్రీకృష్ణదేవరాయలు పాత్రకు యన్టీఆర్ నటవారసుడైన బాలకృష్ణ మాత్రమే న్యాయం చేయగలరని అందరూ భావించారు. బాలు అడగ్గానే బాలయ్య కూడా మరోమాట లేకుండా సినిమాను అంగీకరించారు. ఎక్కడా రాజీపడకుండా భారీగా నిర్మించారు కృష్ణ ప్రసాద్. ఈ సినిమా విడుదలై విజయవిహారం చేస్తున్న సమయంలో పిల్లలను మరింతగా ఆకర్షించడానికి అన్నట్టు చిరంజీవి చేత ప్రకటన చేయిస్తే బాగుంటుందని భావించారు నిర్మాతలు. అసలు 'ఆదిత్య 369' వంటి వైవిధ్యమైన చిత్రం రూపొందడమే విశేషం! అందునా భారతదేశంలో అందించింది తెలుగువారు.

# నాగ్ 100వ సినిమా... రూ. 100 కోట్లు..





ఇండస్ట్రీ అంటే నెంబర్ గేమ్. ఏ హీరో ఎన్ని సినిమాలు చేశాడు? ఏ ర్యాంకులో ఉన్నాడు? అనేది పదే పదే చూస్తుంటారు అభిమానులు. ఇక మైల్ స్టోన్ మూవీలకు ఉండే క్రేజ్ అయితే అంతా ఇంతా కాదు. 25, 50, 75,100 వంటి ఆ ప్రాజెక్ట్ లని అత్యంత స్పెషల్ గా చూస్తుంటారు. ప్రస్తుతం అలాంటి కేర్ ను తీసుకుంటున్నాడు అక్కినేని నాగార్జున తన కెరీర్ లో మైల్ స్టోన్ మూవీగా నిలిచే సినిమా సమ్ థింగ్ స్పెషల్ గా ఉండేలా చూసుకుంటారు టాలీవుడ్ మన్మథుడు.కింగ్ నాగార్జున వందో సినిమా కోసం ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు అక్కినేని అభిమానులు. ఇప్పటికే చిరంజీవి, బాలకృష్ణ ఆ మైల్ స్టోన్ ని అధిగమించగా... ఇప్పుడు నాగార్జున వంతొచ్చింది. కింగ్ నుంచి సోలో సినిమా వచ్చి ఏడాది దాటి పోయింది. 'నా సామి రంగ' తర్వాత సోలో సినిమా ఇంత వరకూ ప్రకటించలేదు. ప్రెజెంట్ కుబేర కూలీ మూవీలతో బిజీగా ఉన్న నాగ్... బెంచ్ మార్క్ సినిమా కోసం అదిరిపోయే ప్లాన్ వేస్తున్నట్లు టాక్ నడుస్తోంది. కింగ్ నాగ్ నటించబోయే 100వ సినిమాని టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మార్చేందుకు స్కెచ్ వేస్తున్నట్లు ఓ న్యూస్ చక్కర్లు కొడుతోంది. ప్రస్తుతం ఫిల్మ్ నగర్ లో వినిపిస్తున్న టాక్ ప్రకారం నాగార్జున బెంచ్ మార్క్ మూవీని కోలీవుడ్ డైరెక్ట్ కార్తీక్ తో చేసే ఛాన్స్ ఉందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. 'నితం ఓరువానం' అనే సినిమా ద్వారా కార్తీక్ డైరెక్టర్ గా పరిచయం అయ్యాడు. ఈ సినిమా తెలుగులో 'ఆకాశం' పేరుతో డబ్ అయ్యింది. బట్ ఇక్కడ మాత్రం సినిమా సక్సెస్ కాలేదు. నిన్న మొన్నటి వరకు నాగార్జున వందో చిత్రానికి పూరి జగన్నాథ్, బెజవాడ ప్రసన్న కుమార్, తమిళ్ డైరెక్టర్ మోహన్ రాజా, నవీన్ పేర్లు గట్టిగా వినిపించాయి. కానీ అవేవీ వర్కవుట్ కాలేదని తెలుస్తోంది. కానీ ఇప్పుడు యంగ్ డైరెక్టర్ చేతిలో నాగ్ మైల్ స్టోన్ మూవీని పెట్టినట్లే తెలుస్తోంది. కార్తీక్ కూడా కింగ్ కు సూట్ అయ్యేలా అక్కినేని ఫ్యాన్స్ కి గూస్ బంప్స్ తెప్పించే కథను రెడీ చేశాడట. పైగా 100 కోట్ల భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా రేంజ్ లో నాగ్ సెంచరీ మూవీని తెరకెక్కించేందుకు రెడీ అవుతున్నారట. మరి కార్తీక్ - నాగ్ కాంబో ఫైనలైజ్ అవుతుందా లేదా అనేది కొద్ది రోజుల్లో తెలిసిపోతుంది.

# ఏసుకోండ్రా మీమ్స్, చేసుకోండ్రా రీల్స్..

'మ్యాడ్' సినిమాకి సీక్వెల్ గా రూపొందుతోన్న 'మ్యాడ్ స్క్వేర్' నుంచి విడుదలైన 'లడ్డు గానీ పెళ్లి', 'స్వాతి రెడ్డి' పాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజాగా చిత్రం నుంచి మూడో గీతం 'వచ్చార్రోయ్' విడుదలైంది. సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో స్వరపరచి, ఈ పాటను స్వయంగా ఆలపించగా..



ప్రతిభావంతులైన దర్శకుడు కె.వి. అనుదీప్ సాహిత్యం అందించడం విశేషం. భీమ్స్ సిసిరోలియో తనదైన ప్రత్యేక శైలి సంగీతంతో మరోసారి కట్టిపడేశారు. "ఏసుకోండ్రా మీమ్స్, చేసుకోండ్రా రీల్స్, రాసుకోండ్రా హెడ్ లైన్స్.. ఇది మ్యాడ్ కాదు మ్యాడ్ మ్యాక్స్" వంటి పంక్తులతో అందరూ పాడుకునేలా గీతాన్ని రాశారు. యువత కాలు కదిపేలా ఉన్న ఈ గీతం, విడుదలైన కొద్దిసేపటిలోనే సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది.మొదటి భాగంలో తమ అల్లరితో నవ్వులు పూయించిన నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ త్రయం.. 'మ్యాడ్ స్క్వేర్'లో అంతకుమించిన అల్లరి చేయబోతున్నారు. ప్రియాంక జవాల్కర్, మురళీధర్ గౌడ్, కె.వి. అనుదీప్ కీలక పాత్రలలో అలరించనున్నారు. అలాగే, రెబా మోనికా జాన్ ప్రత్యేక గీతంలో సందడి చేయనున్నారు. శ్రీకర స్టూడియోస్ తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు.

# అర్జున్‌రెడ్డి పాత్రపై షాలినీ కామెంట్స్



సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో వచ్చిన 'అర్జున్ రెడ్డి' సినిమాతో గుర్తింపు తెచ్చుకుంది షాలినీ పాండే . ప్రీతి పాత్రలో అందరినీ మెప్పించింది. అయితే ఆ సినిమాలోని నటీనటుల పాత్రలను ఎంతో మంది విమర్శించారు. హీరోయిన్ పాత్ర వీక్ అని పోస్ట్‌లు పెట్టారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న షాలిని ఆ పాత్ర గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'డబ్బా కార్టెల్' సిరీస్‌లో బలమైన మహిళగా కనిపించిన తర్వాత కూడా షాలినీ మరోసారి 'అర్జున్ రెడ్డి' లాంటి సినిమాను అంగీకరిస్తారా అనే ప్రశ్నకు ఆమె స్పందించారు."నేను కెరీర్ ప్రారంభించిన తొలినాళ్లలో నటించిన సినిమా అది. ఇప్పుడు దాని గురించి ఆలోచిస్తే అమాయకంగా అనిపిస్తోంది. నా పాత్ర మరింత బలంగా చేయొచ్చేమో అని అనుకుంటున్నా. మరోసారి అలాంటి అవకాశం వస్తే నో చెప్పను. దానిపై మరింత అవగాహన పెంచుకొని యాక్ట్ చేస్తాను. అప్పటికంటే ఇప్పుడు నటిగా పరిణితి చెందాను కాబట్టి వేరియేషన్ చూపిస్తాను. నిజాయతీగా చెప్పాలంటే దర్శకుడితో మాట్లాడి కొన్ని అంగీకరిస్తా" అని అన్నారు.

# మణిరత్నం కొత్త నిర్వచనం ఇవ్వబోతున్నాడు..

'థగ్‌లైఫ్'తో దర్శకుడు మణిరత్నం మల్టీస్టారర్‌కు కొత్త నిర్వచనం చెప్పబోతున్నారని విశ్వనాయకుడు కమల్‌హాసన్ అన్నారు. ఇటీవల జరిగిన ఎఫ్‌సీసీఐ ఈవెంట్‌లో పాల్గొన్న ఆయన రాబోయే గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "థగ్‌లైఫ్' ఓ మల్టీస్టారర్. ఇందులో చేస్తున్న నటీనటులు భవిష్యత్‌లో గొప్ప స్టార్స్ అవుతారు. అలాంటివాళ్లను ఈ మూవీలో భాగం చేయడం వల్లే ఇది మల్టీస్టారర్ అయింది. ఇలా అగ్ర నటులు, యువ నటులు కలయికగా సినిమా తీయాలన్నది మణిరత్నం ఆలోచన. దానిని నాతో పంచుకున్న వెంటనే నాకూ నచ్చింది. అందుకే ఇది కార్యరూపం దాల్చింది. ఇక ఇందులో చాలా



పాత్రలున్నాయి. మలయాళం, హిందీ, తెలుగు సినిమాల్లోని విలక్షణ నటుల ఇందులో కీలక పాత్రల్లో కనిపిస్తారు. అద్భుతమైన ప్రతిభ కలిగిన నటులు మనకు ఉన్నారు. ప్రతి ఒక్కరిలో ఒక్కో టాలెంట్ ఉంటుంది. అది వారికే సొంతం" అని కమల్‌హాసన్ పేర్కొన్నారు.1987లో కమల్‌హాసన్ - మణిరత్నం కాంబినేషన్‌లో వచ్చిన 'నాయకన్' ఎంతటి ఘన విజయాన్ని సాధించిందో తెలిసిందే. మళ్లీ 38 ఏళ్ల తర్వాత ఇద్దరూ కలిసి 'థగ్‌లైఫ్' కోసం పనిచేస్తున్నారు. శింబు, త్రిష, నాజర్, అభిరామి, జోజూజార్జ్, అశోక్ సెల్వన్, ఐశ్వర్య లక్ష్మి, మహేశ్ మంజ్రేకర్, అలీ ఫజల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

Edited,Printed,Published and Owend by Padakanti Venkateshwarlu,Printed at Daily Hindi Milap,#5-4-674,Kattelamandi,Hyderabad-500 001. Published at:6-3-4, Premnagar,Behind ASHOK MALL, Banjara Hills, Road#1, Hyderabad-500 034, Telangana. Editor : Padakanti Venkateshwarlu, (RNI TELTEL 2005/18007). e-mail : news9telangana@gmail.com. Office 040-2333 3349, 2333 3358, Cell 8331888861